www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బ్యాగులో యువతి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న బాలానగర్ డీసీపీ తదితరులు

పూర్తిగా కుళ్లిన స్థితిలో..

10 రోజుల క్రితం హత్య?

కట్టుబొట్టు ఆధారంగా ఉత్తరాది మహిళ అని అనుమానం

హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఘటన.. పోలీసుల దర్యాప్తు

13

గురువారం | 5-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 67 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: దశమి రా.2:16 తదుపరి ఏకాదశి, నక్షత్రం: హస్త పూర్తి, వర్జ్యం: మ.1:02-2:50, దుర్ముహూర్తం: ఉ.10:03-10:55, మ.3:15-4:07, అమృతఘడియలు: రా.11:49-1:37, రాహుకాలం: మ.1:30-మ.3:00, సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద భారీగా అభిమానులు

విజయోత్సవాల్లో ఘోర విషాదం!

చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట.. 11మంది మృత్యువాత.. 33 మందికి గాయాలు

ఐపీఎల్ విజేతలను చూసేందుకు బెంగళూరులో పోటెత్తిన అభిమానులు

గేట్లు తీయడంతో భారీగా తొక్కిసలాట.. మృతుల్లో నలుగురు మహిళలు

న్యాయ విచారణకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశం

బెంగళూరులో వేడుకల మధ్య ఒక యువకుడికి కత్తిపోట్లు

హైదరాబాద్‌లో అభిమానుల హల్‌చల్.. పలుచోట్ల ట్రాఫిక్ జామ్

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో బుధవారం తలపెట్టిన ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల్లో ఘోర విషాదం సంభవించింది. పరిమితికి మించి వేలాదిగా క్రికెట్ యువ అభిమానులు పోటెత్తడంతో చిన్నస్వామి స్టేడియం గేట్ల వద్ద భారీగా తొక్కిసలాట

మిగతా 2వ పేజీలో...



స్పృహ తప్పిన ఓ బాలుడిని చికిత్స కోసం తీసుకెళ్తున్న పోలీసు

2027 మార్చి 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా కులగణన కూడా.. షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

రెండు దశల్లో జరగనున్న జనాభా లెక్కల సేకరణ.. ఈ నెల 16న గెజిట్ నోటిఫికేషన్

రూ.13 వేల కోట్లకు పైగా వ్యయం.. 30 లక్షలకు పైగా ఎన్యూమరేటర్లు!

జనగణన అనంతరం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన?

న్యూఢిల్లీ, జూన్ 4: దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణకు కేంద్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. 2027 మార్చి 1వ తేదీ నుంచి దేశంలో 16వ జనగణనను చేపట్టనున్నట్లు తెలిపింది. జనగణనతో పాటే కులగణన కూడా చేపడతామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. రెండు దశల్లో జనాభా లెక్కలు సేకరించనున్నట్లు వివరించింది. అయితే హిమపాతం ఎక్కువగా ఉండే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో 2026 అక్టోబరు 1 నుంచి జనగణన ప్రారంభమవుతుందని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. మొత్తం మీద దేశంలో 16 ఏళ్ల తర్వాత జనగణన జరగనుంది. సామాజిక, ఆర్థిక వివరాలతో సమగ్రంగా జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారిగా పౌరులే స్వయంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకొనే అవకాశం కల్పించనున్నారు. జనాభా లెక్కల సేకరణకు రూ.13 వేల కోట్లకు పైగా వెచ్చించనున్నారు. ఈ భారీ ప్రక్రియలో 30 లక్షల మందికి పైగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొననున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జనగణన షెడ్యూల్‌పై జనాభా లెక్కల చట్టం 1948లోని సెక్షన్ 3 ప్రకారం ఈ నెల 16న అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. దేశంలో చివరి సారిగా 2011లో రెండు దశల్లో జనాభా లెక్కలను సేకరించారు. నాటి లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లు. నాటి యూపీఏ సర్కారు జనాభా లెక్క



లతో పాటు కులగణన కూడా చేసింది. కానీ, ఇప్పటికీ ఆ వివరాలను వెల్లడించలేదు. ఇటీవల బిహార్, తెలంగాణ రాష్ట్రాల్లో కులగణన సర్వే చేశారు. దేశవ్యాప్తంగా పదేళ్లకోసారి జనగణన చేపట్టాల్సి ఉండగా.. 2021లో కూడా అందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ, కరోనా కారణంగా జనగణన ప్రక్రియను వాయిదా

మిగతా 2వ పేజీలో...



నువ్వు కాకపోతే ఇంకో బకరా!

గ్రీన్‌కార్డ్ హోల్డర్‌ను పెళ్లి చేసుకునేందుకు ఓ మహిళ ఎత్తుగడ

ఆమె అసలు రూపాన్ని గ్రహించి పెళ్లికి నిరాకరించిన యువకుడు

అతడిపై రేప్ కేసు పెట్టిన మహిళ

ఆమె చాటింగ్ ఆధారంగా అతడిపై ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసిన సుప్రీంకోర్టు

ఆమెది మోసపూరిత, కక్షపూరిత వైఖరి అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూన్ 4: పెళ్లి పేరు చెప్పి తనను మోసం చేశాడంటూ ఒక వ్యక్తిపై హైదరాబాద్‌కు చెందిన మహిళ పెట్టిన రేప్ కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. సదరు మహిళ ఆ వ్యక్తితో చేసిన చాటింగ్ ఆధారంగా.. ఆమె తీవ్ర లైంగిక ధోరణలు కలిగి ఉందని, మోసపూరిత, కక్షపూరిత ధోరణి కలిగి ఉందనే విషయం స్పష్టంగా అర్థమవుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం... అలాంటి ఆమెతో పెళ్లి విషయంలో అతడు వెనక్కితగ్గడంలో తప్పేమీ

మిగతా 14వ పేజీలో...



సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, దుద్దిళ్ల, ప్రభుత్వ సలహాదారు కేశవరావు

స్థానిక ఎన్నికలపై నేడు స్పష్టత!

క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే చాన్స్

భూ భారతి చట్టంలో పలు సవరణలు

రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ఫీజు వసూలు, సాదాబైనామా అంశాలపై మంత్రివర్గంలో చర్చ

ఉద్యోగులు, రైతాంగ సమస్యలపై తుది నిర్ణయం

హ్యామ్ రోడ్ల నిర్మాణ విధానంలో మార్పులు

కాళేశ్వరంపై విజిలెన్స్ కమిషన్ సిఫారసులపైనా..

మూడు డీఏలు వెంటనే ఇవ్వండి

మిగతా రెండు డీఏలు పీఆర్సీలో కలపండి

పీఆర్సీ ఫిట్‌మెంట్ 51 శాతం ఇవ్వండి

సప్లిమెంటరీ బిల్లులు ఒకేదఫాలో క్లియర్ చేయండి

హెల్త్‌కార్డుల అంశాన్ని త్వరగా తేల్చండి

మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగ జేఏసీ విజ్ఞప్తి

పదవీ విరమణ వయసు పెంపు వద్దన్న నేతలు

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం.. స్థానిక ఎన్నికలు జూలైలో ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. క్యాబినెట్‌లో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు ఉద్యోగులు లేవనెత్తిన అంశాలు, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా అంశాలపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉద్యోగుల డీఏలు, ఆర్థికేతర అంశాల పరిష్కారంపై ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టంలో పలు సవరణలు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. మొత్తంగా క్యాబినెట్ భేటీలో కీలక అంశాలు

మిగతా 13వ పేజీలో...

వేములవాడ కోడెల మృతిపై నేడు క్యాబినెట్‌లో చర్చ 13

18 నుంచి టీజీటెట్

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లను ఈ నెల 18 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11:30 గంటలవరకు, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. పరీక్షలను తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమంలో నిర్వహించనున్నారు.



2

పాక్‌కు ఆసియా బ్యాంకు 6,869 కోట్ల సాయం!

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

నిధులు అభివృద్ధికి కాకుండా సైనిక వ్యయాలకు మళ్లిస్తారని ఆందోళన

పాక్‌కు నిధులను అడ్డుకోవడం కేంద్రానికి చేతకావడం లేదు: కాంగ్రెస్



సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం వాక్‌స్వాతంత్ర్యం కాదు

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

సమన్ల రద్దు పిటిషన్ కొట్టివేత

భారత్ జోడో యాత్రలో రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారని కేసు

2



ఇథనాల్ కర్మాగారం వద్ద ఆందోళనకారులు నిప్పంటించిన కంటైనర్

ఇథనాల్ కర్మాగారంపై జనాగ్రహం

పనుల పునఃప్రారంభంతో 3 గ్రామాల ప్రజల మూకుమ్మడి దాడి

కంపెనీ సిబ్బందితో వాగ్వాదానికి దిగి తరిమికొట్టిన నిరసనకారులు

ఒక గుడారం, కంటైనర్‌కు నిప్పు

ఓ యంత్రం, జీపు ధ్వంసం

గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఘటన

రాజోలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ కర్మాగారాన్ని నిర్మించవద్దంటూ సమీప గ్రామాల ప్రజలు దీక్షకు దిగడంతో నాయకులు, అధికారులు దాన్ని రద్దు చేస్తామని చెప్పి వారితో దీక్ష విరమింపజేశారు. తాజాగా మళ్లీ కర్మాగార నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించడంతో

మిగతా 14వ పేజీలో...

డైట్ కాంట్రాక్టర్ తొలగింపు

కేసు నమోదు.. ఆస్పత్రి ఆర్ఎంవోపైనా వేటు

'ఎర్రగడ్డ' ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్

ఆస్పత్రికి మంత్రి దామోదర.. అధికారులపై ఆగ్రహం

ఘటనపై విచారణ కమిటీని నియమించినట్లు వెల్లడి

92కు చేరిన కలుషితాహార బాధితుల సంఖ్య

హైదరాబాద్/సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో కలుషితాహార ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంది. ఆస్పత్రిలో ఆహారాన్ని సరఫరా చేసే కాంట్రాక్టర్ జి.జైపాల్‌రెడ్డి డైట్ కాంట్రాక్ట్‌ను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిత తెలిపారు. రోగులకు ఇబ్బంది కలగకుండా డైట్ బాధ్యతలను ఛాతీ ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంవో పద్మజారెడ్డిని

మిగతా 11వ పేజీలో...

మహిళా సమాఖ్యలకు రోగుల 'డైట్' బాధ్యత

మెనూ అమలు చేయని కాంట్రాక్టర్లపై వేటు 11

ప్రభుత్వ బోధనాస్పత్రులపై సర్కారు కీలక నిర్ణయం



ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో కవిత

దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ 3

గోదావరిని బాబు తరలిస్తుంటే రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారు?

బనకచర్ల ఆపమనే ధైర్యం లేదా?

బీజేపీ నేతలకు సిగ్గుంటే కాళేశ్వరానికి జాతీయ హోదా తేవాలి: ఎమ్మెల్సీ కవిత

కవితపై కేసీఆర్ నారాజ్!

అపాయింట్‌మెంట్ ఇవ్వని అధినేత

పది రోజులైనా రాని పిలుపు



3

భూభారతిలో ఏఎస్సై అతి

వృద్ధ రైతును మెడబట్టి బయటికి..

నిర్మల్ జిల్లాలో ఘటన.. ఏఎస్సై సస్పెన్షన్

తప్పుడు ఇంజెక్షన్‌తో ఆరుగురి మృతి!

ఒడిశాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

నర్సు నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు

ఘటనపై విచారణకు కమిటీ 2





2

ఉక్కు, అల్యూమినియంపై సుంకం 25% నుంచి 50శాతానికి!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో నిర్ణయం

మున్ముందు భారత్ ఎగుమతులపై ప్రభావం

పెంపు నుంచి బ్రిటన్‌కు మినహాయింపు

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మ్యాచ్ ఫిక్సింగ్

ప్రభాకర్‌రావు వచ్చినా ఒరిగేదేం లేదు

కేసీఆర్ నుంచి నాకు ప్రాణహాని ఉంది

ప్రభుత్వం రక్షణ కల్పిస్తే అన్ని అంశాలు బయటపెడతా

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నందకుమార్ 14

నేడు సిట్ ముందుకు ప్రభాకర్‌రావు!

తప్పుడు ఇంజెక్షన్‌తో ఆరుగురి మృతి?

» ఒడిశాలోని ఓ ఆస్పత్రిలో దుర్ఘటన.. విచారణకు కమిటీ

కోరాపూట్, జూన్ 4: ఒడిశాలోని ఒక ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు కొన్ని గంటల వ్యవధిలో అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. సిబ్బంది ఇచ్చిన తప్పుడు ఇంజెక్షన్ కారణంగానే ఈ మరణాలు సంభవించాయని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఒడిశాలోని కోరాపూట్ జిల్లాలోని షహీద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆపరేషన్ తరువాత కూడా తమ వారు ఆరోగ్యంగానే ఉన్నారని కానీ ఓ నర్సు వచ్చి ఇంజెక్షన్ ఇచ్చిన తరువాతే ప్రాణాలు కోల్పోయినట్లు ఓ మృతుని కుటుంబసభ్యులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై హాస్పిటల్ సూపరింటెండెంట్ సుశాంత కుమార్ స్పందిస్తూ మృతిచెందిన వారందరూ కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. మరోవైపు ఒడిశా ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఓ కమిటీని ఏర్పాటు చేసింది.

అల్యూమినియంపై సుంకం 50 శాతానికి పెంపు

న్యూఢిల్లీ, జూన్ 4: ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాలను 25శాతం నుంచి 50శాతానికి పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సంబంధిత పత్రాలపై మంగళవారం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. ఈ ఉక్కు, అల్యూమినియం సుంకాల పెంపు నుంచి బ్రిటన్‌ను ట్రంప్ మినహాయించారు. మిగతా దేశాలకు ఈ నిర్ణయం తక్షణమే వర్తిసుందని అమెరికా ప్రకటించింది. ఈ సుంకాల పెంపు ప్రభావం భారత ఎగుమతులపై తీవ్రంగా ఉండనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ ఏటా ఐదు బిలియన్ డాలర్ల విలువైన అల్యూమినియం, ఉక్కును.. సంబంధిత వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తోందని, బ్రిటన్ తరహాలో సుంకాల నుంచి మినహాయింపును భారత్ కోరాలని.. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు జరిగే సమయాల్లో ఈ విషయాన్ని అమెరికా దృష్టికి తేవాలని ఈఈపీసీ చైర్మన్ పంకజ్ చద్దా పేర్కొన్నారు.

రీల్స్ చేస్తూ నదిలో మునిగి ఆరుగురి మృతి

ఆగ్రా, జూన్ 4: ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో విషాదం చోటుచేసుకుంది. యమునా నదిలో రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు బాలికలు మృతి చెందారు. నలుగురు బాలికలు అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న ఇద్దరిని గ్రామస్థులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ వారు కూడా మరణించారు. బాలికలు నదిలోకి దిగడానికి ముందు ఒడ్డున వీడియోలు చిత్రీకరించినట్లు సాక్షులు తెలిపారు. వారు నది సమీపంలోని పొలాల్లో పని చేస్తారని, వేడి నుంచి ఉపశమనం పొందేందుకు స్నానం చేయడానికి నదిలోకి వెళ్లారని అధికారులు పేర్కొన్నారు. ఆ ఆరుగురు బాలికలు ఒకే ఉమ్మడి కుటుంబానికి చెందిన వారు కావడంతో వారి అకాల మరణం వారి కుటుంబంతో పాటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

అమర్‌నాథ్ యాత్రికుల భద్రతకు 'ఆపరేషన్ శివ'

న్యూఢిల్లీ, జూన్ 4: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వచ్చే నెలలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రను దృష్టిలో పెట్టుకుని యాత్రికుల భద్రత కోసం భారత భద్రతా బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఈ యాత్ర సజావుగా సాగేలా చూసేందుకుగాను భద్రతా బలగాలు 'ఆపరేషన్ శివ'ను ప్రారంభించాయి. జూలై 3న ప్రారంభం కానున్న ఈ యాత్ర ఆగస్టు 9 వరకు 38 రోజుల పాటు సాగనుంది. జూలై 3న మొదటి బ్యాచ్ యాత్రికులతో కూడిన బస్సులు శ్రీనగర్ నుంచి బయలుదేరుతాయి. మరోవైపు భద్రతా ఏర్పాట్లను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ షా సమీక్షించారు. 50వేలకు పైగా సైనికులను యాత్ర మార్గాలు, బేస్ క్యాంపులు, సున్నిత ప్రదేశాల్లో మోహరించారు. బాడీ స్కానర్లు, సీసీటీ వీ కెమెరాలు, 24/7 నిఘాతో కూడిన మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయనున్నారు.

కోతులపైకి తండ్రి గొడ్డలి..అది తగిలి కొడుకు మృతి

మొరాదాబాద్, జూన్ 4: కోతులపైకి విసిరిన గొడ్డలి తగిలి రెండేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మొరాదాబాద్‌లో రెండేళ్ల బాలుడు ఆరవ్ తన ఇంట్లో ఆడుకుంటుండగా అక్కడికి కోతులు వచ్చాయి. దీంతో అతడి తండ్రి లఖన్ సింగ్ అవి బాలుడికి హాని చేస్తాయని భావించి వాటిని తరిమేందుకు గొడ్డలి విసిరాడు. అయితే ప్రమాదవశాత్తు ఆ గొడ్డలి ఆరవ్ మెడపై తగలడంతో తీవ్రగాయమయ్యింది. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు చెప్పారు.

ముజిబుర్ రహ్మాన్ ఇక బంగ్లాదేశ్ జాతిపిత కాదు!

ఢాకా, జూన్ 4: బంగ్లాదేశ్ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ పేరును తాత్కాలిక ప్రభుత్వం తొలగించింది. దీంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల నిర్వచనాన్నే మార్చేస్తూ చట్టానికి సవరణలు చేసింది. బంగ్లాదేశ్ న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసినట్టు బుధవారం మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇటీవలే కరెన్సీ నోట్లపై కూడా మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రహ్మాన్ ఫొటోను తొలగించింది.

24 గంటల్లో 864 కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 4: దేశంలో గడచిన 24 గంటల్లో 864 కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం క్రియాశీలక కేసుల సంఖ్య 4,302కు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కోవిడ్ సంబంధిత కారణాలతో ఈ ఏడాది మరణించిన వారి సంఖ్య 44కు చేరింది. మరోవైపు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. తగినంత ఆక్సిజన్‌తో పాటు వెంటిలేటర్లు, పడకలు, తప్పనిసరి ఔషధాలు సిద్ధం చేసుకోవాలని సూచించింది. ప్రజలు శుభ్రతను పాటించాలని, అనారోగ్యంగా అనిపిస్తే ఎక్కువ మంది గుమికూడే చోటకు వెళ్లరాదని కేంద్రం సూచించింది. హిమాచల్‌ప్రదేశ్‌లో మాస్క్ తప్పనిసరి చేశారు.

2027 మార్చి 1 నుంచి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. కాగా, దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలంటే కులగణన కూడా చేయాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా చేసేందుకు అంగీకరించింది. 2027లో జనగణన పూర్తయిన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కూడా చేపట్టే అవకాశం ఉంది. జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నారు. అయితే దీనిపై దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తాము జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేశామని, ఫలితంగా పునర్విభజనతో తాము నష్టపోతామని వాదిస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ చర్యలు చేపట్టలేదని.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఆ రాష్ట్రాలు ఎక్కువగా లబ్ధి పొందుతాయని ఆరోపిస్తున్నాయి.

విజయోత్సవాల్లో

ఘోర విషాదం!



చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది మృత్యువాతపడ్డారు. 33మంది గాయపడ్డారు. బెంగళూరు జట్టు (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు) 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ కప్‌ను గెలుచుకుంది. ఈ సందర్భంగా బెంగళూరులో పలు కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆర్‌సీబీ క్రికెటర్లు సాయంత్రం 6గంటలకు స్టేడియానికి చేరుకుంటారని నిర్వాహకులు ప్రకటించారు. స్టేడియం సామర్థ్యం 30-40 వేలు. కానీ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పటీదార్ సహా తమ అభిమాన ఆటగాళ్లను ప్రత్యక్షంగా చూసేందుకు మధ్యాహ్నం ఒంటి గంటకే లక్షమంది తరలివచ్చారని సమాచారం. మరో మూడు గంటల్లో ఇంకో లక్షమంది అక్కడకు చేరుకున్నారు. వారిని నిర్వాహకులు, పోలీసులు అదుపు చేయలేకపోయారు. దీంతో తొక్కసలాట చోటుచేసుకుంది. కార్యక్రమ వివరాలను ముందుగా అందించకపోవడం, అభిమానులకు నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో ఈ దారుణం చోటుచేసుకుందని సమాచారం. మృతులలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు.



స్టేడియం కాదు.. జన సంద్రమే..

షెడ్యూల్ ప్రకారం బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అహ్మదాబాద్ నుంచి ఆర్‌సీబీ క్రికెటర్లు బెంగళూరు చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్టేడియం సమీపంలోని విధానసౌధ తూర్పు ద్వారం వద్ద ఐపీఎల్ విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం సన్మానం ఏర్పాటుచేసింది. అక్కడికీ వేలాదిమంది వెళ్లారు. మరోవైపు, చిన్నస్వామి స్టేడియం చుట్టూ ఎటుచూసినా రెండు కిలోమీటర్ల మేర ఇసుకేస్తే రాలనంతమంది జనం కనిపించారు. వీరందరూ సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత స్టేడియం గేట్ల వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న వారి సంఖ్య లక్ష దాటిందని సమాచారం. అయితే, నిర్వాహకులు ఇదేం పట్టించుకోకుండా ఒక్కసారిగా 3, 12, 18, 19, 20 నంబరు గేట్లన్నింటినీ తెరిచారు. అంతే...వేలాదిమంది దూసుకుపోయారు. ఈ క్రమంలో చాలామంది కిందపడ్డారు. వారిని తొక్కుకుంటూ విగతావారు ముందుకెళ్లారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని లాఠీచార్జి చేశాయి. కిందపడినవారికి సహాయక చర్యలు ప్రారంభించాయి. భారీగా జనం నిండిపోవడంతో అంబులెన్స్‌లు వారిని దాటుకుని సకాలంలో చేరుకోలేకపోయాయి. దీంతో గాయపడినవారిని చేతులపై ఎత్తుకుని సమీపంలోని వైదేహి ఆస్పత్రి వైపు పోలీసులు పరుగులు తీశారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగానే నలుగురు మృతి చెందారు. శివాజీ నగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించిన 24మందిలో ఏడుగురు మృతి చెందారు.



స్టేడియం గేటు వద్ద అభిమానుల అవస్థలు

న్యాయ విచారణకు సిద్దరామయ్య ఆదేశం

చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. ఊహించినదానికంటే ఎక్కువ జనం రావడంతోనే ప్రమాదం జరిగిందని, బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు విఫలమయ్యారన్నారు. మృతులకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు ఉచిత వైద్యం అందిస్తామని సీఎం తెలిపారు.

అస్తవ్యస్తం.. గందరగోళం..

విధానసౌధ తూర్పుద్వారం వద్ద ఆర్‌సీబీ జట్టు క్రీడాకారులను సన్మానించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అక్కడికి వేలాది మంది తరలివచ్చారు. రోడ్డును పూర్తిగా బ్లాక్ చేశారు. విధానసౌధకు దాదాపు 15 అడుగులకు పైగా ఎత్తైన గేట్‌లు ఉన్నాయి. వాటిపైకి ఎక్కి అవతలకు వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. విధానసౌధ వద్దకు నాలుగైదువేలమంది వస్తారని అంచనా వేశారు. కానీ 60వేలమందికి పైగా జనం చేరడంతో పోలీసులు నియంత్రించలేకపోయారు. విధానసౌధ లోపలికే వేలాది మంది వివిధ మార్గాల ద్వారా చేరుకున్నారు. దీంతో జట్టు సభ్యులను సన్మానించే కార్యక్రమాన్ని గందరగోళంగా ముగించారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు అక్కడ ఉండగానే.. చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట విషయం తెలిసింది. దీంతో ప్రసంగాలు లేకుండా సన్మాన కార్యక్రమాన్ని కొద్దిసేపట్లోనే ముగించారు. కాగా, తొక్కిసలాట తరువాత స్టేడియంలో వేచియున్న వేలాది మంది కోసం క్రికెటర్లు తరలివచ్చారు. చిన్నస్వామి స్టేడియంలో విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్ అభిమానులనుద్దేశించి మాట్లాడారు. గంటన్నరకుపైగా జరగాల్సిన కార్యక్రమాన్ని కొన్ని నిమిషాలలోనే ముగించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా దేశంలోని పలు చోట్ల అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. విజయవాడలో విజయోత్సవ ర్యాలీలో బైక్‌తో పాల్గొన్న యువకుడు కారు ఢీ కొనడంతో చనిపోయాడు. కర్ణాటకలో ఒకరు గుండెపోటుతో, మరొకరు యాక్సిడెంట్‌లో చనిపోయారు.



బెంగళూరు విధాన సౌధ వద్ద కిక్కిరిసిన అభిమానులు

లోకం తీరు

స్టీల్, అల్యూమినియంపై సుంకాలు రెట్టింపు చేసిన ట్రంప్



స్వదేశీ ఆయుధాలతో సత్తా చాటాం

» కేంద్ర మంత్రివర్గ భేటీలో ప్రధాని మోదీ వెల్లడి

» సిందూర్‌పై రక్షణ శాఖ ప్రజెంటేషన్



న్యూఢిల్లీ, జూన్ 4: మన దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలతో ఆపరేషన్ సిందూర్‌లో సత్తా చాటామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కాలానుగుణంగా యుద్ధతంత్రాలు మారుతూ వస్తున్నాయని.. ఇక ముందు భారత్‌లో 'మేకిన్ ఇండియా' ఆయుధాలు, వ్యవస్థలకే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ నేతృత్వంలో మూడున్నర గంటల పాటు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మంత్రులతో భేటీ ఇదే తొలిసారి కూడా. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో భారత్ చూపిన సత్తాపై ఈ భేటీలో ఒక ప్రజెంటేషన్ ఇచ్చినట్టు సమాచారం. మన రక్షణ శాఖ చెప్పినదానికంటే ఎక్కువగా నష్టం జరిగినట్టుగా పాకిస్థాన్ స్వయంగా బయటపెట్టిన అంశాన్ని కూడా ఇందులో ప్రస్తావించినట్టు తెలిసింది. ఇక ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి సర్కారు ఏర్పాటై ఈ నెల 9వ తేదీకి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో.. వివిధ మంత్రిత్వ శాఖలు సాధించిన విజయాలపై మరో ప్రజెంటేషన్ కూడా ఇచ్చినట్టు సమాచారం. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, జలశక్తి శాఖ విజన్ 2047 ప్రణాళికలను వివరించినట్టు తెలిసింది. మరోవైపు దేశంలో ఏటేటా పెరిగిపోతున్న ఊబకాయం సమస్య, ఆరోగ్యకర జీవన శైలిని అనుసరించాల్సిన అవసరంపై ఆరోగ్య శాఖ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు సమాచారం.

పాక్‌కు ఆసియా బ్యాంకు రూ.6,869 కోట్ల సాయం!

న్యూఢిల్లీ, జూన్ 4: పాకిస్థాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థలు ఏ సాయం చేయొద్దంటూ భారత్ పదే పదే కోరుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. గత నెలలోనే ఐఎంఫ్ పాక్‌కు రూ.8,500 కోట్ల ప్యాకేజీ ప్రకటించగా.. తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కూడా 800 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,869 కోట్ల) రుణం మంజూరు చేసింది. అయితే.. దీన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. పాక్‌కు అందుతున్న నిధులు దారి మళ్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. పాక్‌కు నిధులు వెళ్లకుండా అడ్డుకోవడం చేతగావట్లేదంటూ ఆక్షేపించింది. 'ఈ నెల 1న ఏడీబీ అధ్యక్షుడు మసాటో కందాను మోదీ కలిశారు. ఆ తర్వాత 3రోజులకే ఏడీబీ పాక్‌కు రుణం మంజూరు చేసింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.

పాకిస్థాన్‌కు మలేసియా షాక్

న్యూఢిల్లీ, జూన్ 4: 'ఆపరేషన్ సిందూర్' అనంతరం.. పాకిస్థాన్ వైఖరిని, ఆ దేశం ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఎలా మారిందన్న విషయాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని బృందం మలేషియాకు చేరింది. అయితే.. ఈ బృందాన్ని దేశంలోకి రానివ్వద్దని మలేషియాకు పాకిస్థాన్ విన్నవించింది. "మాది ఇస్లామిక్ దేశం, మీది కూడా ఇస్లామిక్ దేశం. భారత ప్రతినిధి బృందం చెప్పే మాటలు వినొద్దు. వారి కార్యక్రమాలను రద్దు చేయండి. ప్రస్తుతం కశ్మీర్ వ్యవహారం ఐక్యరాజ్యసమితి పరిధిలో ఉంది." అని పాక్ దౌత్యాధికారి మలేషియాకు వివరించారు. అయితే.. మలేషియా మాత్రం పాక్ విన్నపాన్ని బుట్టదాఖలు చేసింది. మీది-మాది ఇస్లామిక్ దేశమేనన్న వాదనను కూడా కొట్టివేసింది. భారత ప్రతినిధి బృందం నిర్వహించే 10 కార్యక్రమాలకు అనుమతిచ్చింది.

సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం

వాక్ స్వాతంత్ర్యం కాదు

రాహుల్‌పై అలహాబాద్ హైకోర్టు ఫైర్.. సమన్ల రద్దు పిటిషన్ కొట్టివేత



లఖ్‌నవూ, జూన్ 4: భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైనికులనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. వాక్ స్వాతంత్ర్యం అంటే సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం కాదని స్పష్టంచేసింది. 2022లో రాజస్థాన్‌లో జోడో యాత్ర సందర్భంగా రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జనం జోడో యాత్ర గురించి, అశోక్ గహ్లోత్ (నాటి రాజస్థాన్ సీఎం), సచిన్ పైలట్ (కాంగ్రెస్‌లో ఆయన ప్రత్యర్థి) గురించి అక్కడక్కడా అడుగుతుంటారు. కానీ చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించుకుందని గానీ, 20 మంది భారత సైనికులను చంపిందని గానీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మన జవాన్లను చావబాదుతోందని గానీ అడుగరు. వీటిపై భారతీయ మీడియా ఒక్క ప్రశ్న కూడా వేయదు. నిజమా కాదా' అని వ్యాఖ్యానించారు. ఆర్మీ పరువుకు భంగం కలిగించేలా రాహుల్ పదే పదే మాట్లాడారంటూ సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) మాజీ డైరెక్టర్ ఉదయశంకర్ శ్రీవాస్తవ ఫిర్యాదు చేశారు. దీనిపై లఖ్‌నవూ కోర్టు రాహుల్‌కు సమన్లు జారీచేసింది. ఈ సమన్లను రాహుల్ అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. 'రాజ్యాంగంలోని 19(1ఏ) అధికరణ వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ హక్కు ఇస్తోంది. అయితే ఇది సహేతుక ఆంక్షలకు లోబడి ఉంటుంది. భారత సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసే స్వేచ్ఛ ఈ హక్కులో భాగం కాదు' అని తేల్చిచెప్పింది. ఫిర్యాదుదారు భారత సైన్యంలో అధికారి కాదని.. బాధితుడు కూడా కాదన్న రాహుల్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. లఖ్‌నవూ కోర్టు జారీచేసిన సమన్లను రద్దు చేయాలన్న రాహుల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

కశ్మీర్‌పై మా ప్రయత్నాలు విఫలం: భుట్టో

కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తడానికి తాము చేసిన ప్రయత్నాలకు ఎదురుదెబ్బలు తగిలాయని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావర్ భుట్టో అంగీకరించారు. ఐక్యరాజ్యసమితి వేదికపైనా, బయట కూడా ఈ విషయంలో తమ ప్రయత్నాలేవీ ఫలించలేదని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్‌పై విషం చిమ్మాలని ప్రయత్నించి విదేశీగడ్డపై మరోసారి పాకిస్థాన్ భంగపడింది. భారత్‌లోని ముస్లిములను దుష్టులుగా చిత్రీకరించడానికి పహల్గాం దాడిని ఆ దేశం రాజకీయ సాధనంగా వాడుకుంటున్నదని బిలావర్ భుట్టో వ్యాఖ్యానించారు. అయితే, భారత సైనికాధికారుల్లో ముస్లింలు కూడా ఉన్నారు కదా అంటూ బిలావర్‌ను ఓ అమెరికా జర్నలిస్టు ప్రశ్నించడంతో ఆయన నోరు మూతబడింది. ఆపరేషన్ సిందూర్‌పై మిలిటరీ ప్రెస్ బృందంలో సోఫియా ఖురేషీ కూడా ఉన్న విషయం పరోక్షంగా గుర్తుచేశారు. దీంతో మాన్పడిపోయిన బిలావర్ ఉక్రోషంతో భారత్‌పై అవాకులుచెవాకులు మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో బిలావర్ భుట్టో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఘటన జరిగింది.

జులై 21 నుంచి పార్లమెంటు

న్యూఢిల్లీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. వచ్చే నెల 21న ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశం అవుతాయని ఆయన వెల్లడించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంట్ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. కాగా పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రధాని మోదీకి లేఖలు రాశారు. కేంద్రం దీనికి సానుకూలంగా స్పందించలేదు. మరోవైపు మంగళవారమే ఢిల్లీలో విపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన(యూబీటీ) తదితర ప్రతిపక్ష పార్టీలు ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశాయి. ఆ పార్టీలు లేఖ రాసిన మరుసటి రోజే జూలై 21 నుంచి వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఈ సమావేశాల్లో ప్రధానంగా పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన, జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు, జనగణన, కులగణన తదితర అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తే అవకాశం ఉంది.

ఫంగస్‌తో వ్యవసాయ ఉగ్రవాదం!?

ప్రమాదకర ఫంగస్‌ను స్మగుల్ చేస్తున్న ఇద్దరు చైనా పరిశోధకులను అరెస్టు చేసిన అమెరికా

» 'ఫుసేరియం గ్రామినియరం'గా పిలిచే ఈ ఫంగస్‌తో గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ పంటలకు తీవ్ర నష్టం

న్యూఢిల్లీ, జూన్ 4: అదో ప్రమాదకర ఫంగస్.. బయటికి వ్యాపించిందంటే వేలు, లక్షల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం.. దీనితో దిగుబడి, నాణ్యత తగ్గడమేకాదు.. ఆ పంట ఉత్పత్తులను వినియోగిస్తే మనుషులకూ ప్రమాదం.. మనలో కాలేయం, ప్రత్యుత్పత్తి వ్యవస్థలపై తీవ్ర ప్రభావం కూడా.. ఇలాంటి విషపూరిత ఫంగస్‌ను అమెరికాలోకి అక్రమంగా తీసుకెళ్తూ ఇద్దరు చైనా పరిశోధకులు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐకి పట్టుబడ్డారు. 'ఫుసేరియం గ్రామినియరం'గా పిలిచే ఈ ఫంగస్ 'వ్యవసాయ ఉగ్రవాదం (ఆగ్రో టెర్రరిజం)' కోసం ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందంటూ ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసింది. ఇది దేశ భద్రతకు ముప్పు అని పేర్కొంది. దీంతో ఈ ఫంగస్, వ్యవసాయ ఉగ్రవాదం అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

మిషిగన్ వర్సిటీ ల్యాబ్‌కు తీసుకెళ్తున్నామని..

చైనాలోని ఝెజియాంగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జున్ యోంగ్ ల్యూ (34)తోపాటు ఆయన ప్రియురాలు, అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీలో పనిచేస్తున్న యున్‌కింగ్ జియాన్ (33) కలసి అమెరికాలోకి 'ఫుసేరియం గ్రామినియరం' ఫంగస్‌ను అక్రమంగా తీసుకొస్తుండగా అమెరికా అధికారులు పట్టుకున్నారు. యున్‌కింగ్ జియాన్ చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా భావిస్తున్నారు. మిషిగన్ యూనివర్సిటీలోని ల్యాబ్‌లో పరిశోధనల కోసం తాము ఈ ఫంగస్‌ను తీసుకొచ్చినట్టు వారు చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో చైనీయుల తీరు వ్యవసాయ ఉగ్రవాదంలో భాగమని.. అమెరికాలో పంటలను దెబ్బతీసే కుట్ర ఉందని అమెరికా అధికారులు వారిని అరెస్టు చేశారు.

'ఫుసేరియం'తో ఏమిటీ ప్రమాదం?

'ఫుసేరియం గ్రామినియరం' ఒక రకం ఫంగస్. ఇది గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ, ఓట్స్ వంటి పంటల్లో 'హెడ్ బ్లైట్ లేదా స్కాబ్'గా పిలిచే తెగులుకు కారణం అవుతుంది. ఇది సోకిన పంటల దిగుబడి, నాణ్యత దారుణంగా తగ్గిపోతాయి. రైతులు తీవ్రంగా నష్టపోతారు. అంతేకాదు ఈ ఫంగస్ 'డీఆక్సీనివలెనాల్, జియారలెనోన్'గా పిలిచే విష పదార్థాలను విడుదల చేస్తుంది. ఈ విష పదార్థాలు పంటల ధాన్యాల్లో చేరుతాయి. ఆ ధాన్యాలను మనం ఆహారంగా తీసుకుంటే.. కాలేయం దెబ్బతింటుంది. ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ప్రభావం పడుతుంది. వాంతులు, విరేచనాల వంటివి తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. ఈ కారణాలతోనే 'ఫుసేరియం.. గ్రామినియరం' ఫంగస్‌ను వ్యవసాయానికి, ఆహార భద్రతకు అతి పెద్ద ముప్పుగా పరిగణిస్తారు.



చైనా శాస్త్రవేత్తలు అమెరికాలోకి తీసుకువచ్చిన ఫంగస్

వ్యవసాయ ఉగ్రవాదమంటే?

ఆయుధాలతో విచ్చలవిడిగా దాడులు చేసి... పౌరులను, భద్రతా బలగాలను చంపే ఉగ్రవాదం అందరికీ తెలిసిందే. అలా నేరుగా కాకుండా లక్ష్యంగా చేసుకున్న దేశంలోకి ఫంగస్ వంటి సూక్ష్మక్రిములు (పాథోజెన్స్), కీటకాలు వంటివాటిని ప్రయోగించి పాడిపంటలను తీవ్రంగా నష్టపర్చడం, తద్వార ఆహార కొరత, కరువు పరిస్థితులు నెలకొనేలా చేయడం, దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీయడమే 'వ్యవసాయ ఉగ్రవాదం'గా చెప్పవచ్చు. పంటల్లో చాలా భాగం దెబ్బతినడంతో వందలు, వేల కోట్ల రూపాయల్లో నష్టం సంభవిస్తుంది. ప్రమాదకర పాథోజెన్స్‌ను ఏదైనా ఒక ప్రాంతంలో ప్రయోగిస్తే చాలు.. అవి చాలా దూరం వరకు విస్తరించి, తీవ్ర నష్టాన్ని కలిగించేందుకు అవకాశాలు ఎక్కువని, దీనికి ఖర్చు కూడా తక్కువని నిపుణులు చెబుతున్నారు.

తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

- సీఎం, డిప్యూటీ సీఎంల చేతకానితనానికి నిదర్శనం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, హైదరాబాద్ జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. దానికి పూర్తిగా కర్ణాటక ప్రభుత్వం, ఆ రాష్ట్ర పోలీసుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. స్టేడియం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని తెలిసి కూడా తగిన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమన్నారు. అభిమానులను నియంత్రించలేకపోయామని ఆ రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎం ప్రకటించడం వారి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలన్నారు.

చిన్నస్వామి ఘటనపై బండి సంజయ్ దిగ్భ్రాంతి

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో ఆనందభరితంగా ఉండాల్సిన ఆర్‌సీబీ విజయోత్సవ ర్యాలీలో ఈ దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో పిల్లలు సహా పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కవిత పై కేసీఆర్ నారాజ్!

తండ్రే తన ఏకైక నేత అంటున్నా.. అపాయింట్‌మెంట్ ఇవ్వని అధినేత

- పది రోజులైనా రాని పిలుపు
- ఎవరేం చెప్పినా స్పందించని గులాబీ బాస్
- పార్టీకి దూరం.. జాగృతితో ముందుకు అనే వ్యూహంతో కవిత అడుగులు
- ఆమె కార్యక్రమాల కట్టడి బాటలో పార్టీ
- నేతలతోపాటు కార్యకర్తలూ జాగృతికి దూరం
- బీఆర్ఎస్, జాగృతి మధ్య స్పష్టమైన విభజన





హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కూతురు విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారా? కేసీఆరే తనకు ఏకైక నాయకుడని కవిత అంటున్నా.. గులాబీ బాస్ నుంచి ఆమెకు పిలుపు రాకపోవడానికి కారణం అదేనా? అంటే విశ్వసనీయ సమాచారం ప్రకారం అవుననే సమాధానమే వస్తోంది. గత కొద్దిరోజులుగా కవిత వ్యవహరిస్తున్న తీరు పట్ల కేసీఆర్ కోపంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఓవైపు తాను రాసిన లేఖను లీక్ చేసిన వారెవరో తేల్చాలని కవిత కోరుతున్నా, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టినా.. ఆయన మాత్రం ఈ పరిణామాలను ఒక కొలిక్కి తెచ్చే ఆలోచనలో లేరని అంటున్నారు. "కేసీఆర్‌కు ఎవరి మీదనైనా కోపం వస్తే ఇక అంతే. కలిసేది ఉండదు. ఇప్పుడు కవిత విషయంలోనూ ఆయన కోపంగానే ఉన్నారు, అందుకే ఆమెను పిలిచి మాట్లాడలేదు" అని బీఆర్ఎస్ నేత ఒకరు అన్నారు. వాస్తవానికి కవిత లేఖ బహిర్గతమై పది రోజులైంది. తొలి రెండు, మూడు రోజుల్లో కేసీఆర్ దీనిపై ఏమైనా స్పందిస్తారా? లేదంటే ఆమెను ఫామ్‌హౌస్‌కు పిలిచి మాట్లాడతారా? అన్న చర్చ జరిగింది. కవిత కూడా తండ్రి నుంచి పిలుపొస్తే వెళ్దామనే ఉద్దేశంతో ఉన్నారని అప్పట్లో జాగృతి వర్గాలు పేర్కొన్నాయి. కానీ, కొన్ని విషయాలను ఆమె బహిరంగంగా లేవనెత్తడంతో ఆమెను పిలిచేందుకు కేసీఆర్ ప్రస్తుతానికి సానుకూలంగా లేరని అంటున్నారు. మరోవైపు ఎంపీ దామోదర్‌రావు, లీగల్ సెల్ అధ్యక్షుడు గండ్ర మోహన్‌రావు.. కవిత నివాసానికి వెళ్లి ఆమెతో చర్చలు జరపగా.. ఎందుకెళ్లారని వారిలో ఒకరిని కేసీఆర్ ప్రశ్నించినట్లు తెలిసింది. అంటే.. వారంతట వారే చొరవ తీసుకుని వెళ్లారు తప్ప.. కేసీఆర్ పంపలేదని సమాచారం.

ఎవరేం చెప్పినా స్పందించని కేసీఆర్!

కవిత విషయాన్ని తన వద్ద ఎవరైనా ప్రస్తావించినా, ఏం చెప్పినా వినడం తప్ప.. దానిపై కేసీఆర్ ఏమీ స్పందించడం లేదని పార్టీ నేతలు చెబుతున్నారు. తన నాయకత్వాన్ని కవిత సమర్థిస్తున్నా.. పార్టీ, కుటుంబ వ్యవహారాలను బహిర్గతం చేశారనే అసంతృప్తితో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె విషయంలో పార్టీ నేతలెవరూ మాట్లాడొద్దని కూడా కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. జాగృతి వేదికగా కవిత నిర్వహిస్తున్న కార్యక్రమాలకు కూడా బీఆర్ఎస్ క్యాడర్ వెళ్లకుండా పార్టీ అంతర్గత ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి పార్టీ కింది స్థాయి కార్యకర్తలు కూడా ఎవరూ వెళ్లలేదు. తెలంగాణ జాగృతి మద్దతుదారులు మాత్రమే అందులో పాల్గొన్నారు. జాగృతి జెండాలు మాత్రమే కనిపించాయి. గతంలో పలు సందర్భాల్లో జాగృతి తరఫున కవిత కార్యక్రమాలు చేపట్టినప్పుడు పార్టీ కార్యకర్తలు కూడా కొందరు హాజరయ్యేవారు. ఆ కార్యక్రమం పార్టీకి చెందినదిగానే భావించేవారు. కానీ, ఇప్పుడు బీఆర్ఎస్ వేరు, జాగృతి వేరు అన్న భావన నెలకొందని రెండు వర్గాలూ అంటున్నాయి.

కవిత అడుగులు ఎటువైపు?

కవిత తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి ప్రస్తుతానికి తెలంగాణ జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలనే నిర్ణయంతోనే ఉన్నారని సమాచారం. తండ్రి నుంచి పిలుపు వచ్చినా, రాకున్నా.. తన పని తాను జాగృతి ద్వారా చేసుకుపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన కార్యక్రమాల్లో జాగృతి జెండాలు, బ్యానర్లు తప్ప.. బీఆర్ఎస్‌కు సంబంధించినవి ఎక్కడా లేకుండా చూసుకుంటున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ హాజరు కాకపోయినా.. కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోగలిగామని జాగృతి నేతలు అన్నారు. దీనిని బట్టి చూస్తే బీఆర్ఎస్‌లో స్పష్టమైన విభజన వచ్చినట్లు కనిపిస్తోంది. కవిత సాంకేతికంగా గులాబీ పార్టీలో కొనసాగుతున్నా.. వ్యవహారాలు మాత్రం ఎవరికివారే యమునా తీరే అన్న రీతిలోనే నడుస్తున్నాయి. ఏదైనా ఒక కీలక పరిణామం జరిగే వరకు పరిస్థితి ఇదే రీతిలో ఉండే అవకాశాలున్నాయి.

దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

- ఇది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ : ఎమ్మెల్సీ కవిత
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా

కవాడిగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది ఎకరాలకు నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని తెలంగాణ జాగృతితోపాటు తెలంగాణ సమాజం సహించబోదని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని, నీళ్లు, నిధులు తీసుకురావడం కేసీఆర్ చేసిన తప్పా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టే కాళేశ్వరం కట్టారని అన్నారు. ప్రాజెక్టుపై విచారణ చేపడుతున్నది కాళేశ్వరం కమిషన్ కాదని, కాంగ్రెస్ కమిషన్ అని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వాడాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్ష, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు గోదావరి జలాలను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపమని లేఖ రాయడానికి ధైర్యం లేదా? అని నిలదీశారు. ఈ విషయమై వెంటనే అపెక్స్ కౌన్సిల్, కేంద్రానికి లేఖలు రాసి.. జలదోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీ సీఎం చంద్రబాబుపై ఆధారపడి ఉందని, అందుకే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఏమీ మాట్లాడడం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్యమకారుడు, ఎంపీ ఈటల రాజేందర్ అయినా బాధ్యత తీసుకోవాలని, నోరు కట్టేసుకొని అపవాదు తెచ్చుకోవద్దని సూచించారు. పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు సమస్యలు సాధారణమేనని, మేడిగడ్డలో కుంగిన పిల్లర్‌కు మరమ్మతులు చేయకుండా, కేసీఆర్‌కు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నెహ్రూ హయాంలో కట్టిన నాగార్జున సాగర్‌కు ఇబ్బంది వస్తే ఎన్టీఆర్ మరమ్మతులు చేయించారని, ఇప్పుడు మేడిగడ్డ బ్యారేజీలో ఇబ్బందులుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. కాళేశ్వరం కమిషన్ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపైనే తమకు అనుమానం ఉందని, సంబంధిత కాంట్రాక్టర్లను విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే పులిచింతల గేట్లు కొట్టుకుపోయాయని గుర్తు చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 8 మంది కార్మికులు చనిపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు నెల రోజుల సమయం ఇస్తున్నామని, ఆయా పార్టీల నేతలు స్పందించకపోతే గోదావరి జలాలను కాపాడుకోవడానికి తెలంగాణ జాగృతి కార్యాచరణ తీసుకుంటుందని తెలిపారు. గోదావరి జలాల్లో వెయ్యి టీఎంసీల నీళ్లు కేటాయించే వరకూ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ నేతలకు సిగ్గు, శరం ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి తక్షణమే పొలాలకు నీళ్లు ఇవ్వాలని, ప్రాజెక్టులో 99 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు, వివిధ కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

పైన ఎండు గడ్డి మోపులు.. కింద ఆవులు

- కొత్త తరహాలో ఆవుల అక్రమ రవాణా
- యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఘటన
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలో గోరక్షకులపై దాడి
- కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు



ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ట్రక్కును భువనగిరిలో పట్టుకున్న గో రక్షకులు

భువనగిరి టౌన్, వట్‌పల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో కొందరు ట్రక్కులో ఎండు గడ్డిమోపుల కింద ఆవులను దాచి అక్రమ రవాణా చేస్తూ గోరక్షకుల చేతికి చిక్కారు. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రంపచోడవరం నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో గోరక్షకులు భువనగిరిలోని సింగన్నగూడెం చౌరస్తాలో వాహనాన్ని అడ్డుకున్నారు. ట్రక్కులో పైన ఎండుగడ్డి మోపులు పెట్టి కింద ఆవులను కట్టేయడాన్ని గోరక్షకులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఆవులను రాజాపేట మండలం చల్లూరు గోశాలకు తరలించామని, వాహనాన్ని సీజ్ చేసి యజమాని రాజు పత్లావత్, డ్రైవర్ మధు, క్లీనర్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోరక్షకులపై దాడి

గోరక్షకులపై పశువుల వ్యాపారులు దాడి చేసి గాయపరిచిన ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో జరిగింది. నారాయణఖేడ్ నుంచి డీసీఎం వ్యానులో గోవులను తరలిస్తున్నారనే సమాచారంతో గోరక్షకులు వట్‌పల్లి మండలం దేవునూర్ చౌరస్తాలో అడ్డగించారు. గోవులను కబేళాకు తరలించవద్దని, వాటిని విడిచిపెట్టాలని వ్యాన్ డ్రైవర్‌ను కోరారు. ఈ దశలో, పశువుల వ్యాపారికి చెందిన మద్దతుదారులు కారులో ఘటనాస్థలానికి చేరుకుని గోరక్షకులపై దాడికి పాల్పడ్డారు. రజనీకాంత్ అనే గోరక్షకుడిని గాయపరచడంతో పాటు వారి కారును ధ్వంసం చేశారు. గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు ఇమ్రాన్, జాఫర్, ఇలియాస్, మోయిన్, మజర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ. తెలిపారు. మరోవైపు వ్యాన్‌లో తరలిస్తున్నవి ఆవులు కాదని, కోడెలని పశు వైద్యాధికారి డాక్టర్ దివ్య తెలిపారు.



వెంకటిని బయటకు లాగేస్తున్న ఏఎస్సై రామచందర్

భూభారతి సదస్సులో ఏఎస్సై అతి

- సమస్య చెప్పుకునేందుకు వచ్చిన వృద్ధ రైతు మెడబట్టి బయటికి లాగేసిన వైనం
- నిర్మల్ జిల్లా పాత ఎల్లాపూర్‌లో ఘటన
- సదరు ఏఎస్సైని సస్పెండ్ చేసిన అధికారులు

ఖానాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తన సమస్యను అధికారులకు చెప్పుకుందామని భూభారతి సదస్సుకు వచ్చిన ఓ రైతు పట్ల ఓ పోలీసు అధికారి అత్యంత అమానుషంగా ప్రవర్తించాడు. సదరు రైతు చేతి కర్ర సాయంతో నిలబడి ఉన్న వృద్ధుడు అనే విచక్షణ కూడా లేకుండా మెడ పట్టుకుని బయటికి లాగేశాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లో రెవెన్యూ అధికారులు బుధవారం నిర్వహించిన భూభారతి సదస్సులో ఈ ఘటన జరిగింది. పాత ఎల్లాపూర్‌కు చెందిన అల్లెపు వెంకటి అనే రైతు తన భూసమస్యను అధికారులకు చెప్పుకునేందుకు భూభారతి సదస్సుకు హాజరయ్యాడు. అధికారులు ఉన్న గదిలోకి వెళ్లిన వెంకటి తన సమస్యను వారికి చెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అక్కడ భద్రత విధులు నిర్వర్తిస్తున్న ఖానాపూర్ ఏఎస్సై కాంబ్లి రామచందర్ సదరు రైతు మెడ పట్టుకొని బలవంతంగా ఆ గదిలో నుంచి బయటికి లాక్కొచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా విషయం తీవ్ర వివాదాస్పదమైంది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల వివాదానికి కారణమైన ఏఎస్సై రామచందర్‌ను సస్పెండ్ చేశారు. ఇక, రైతుకు జరిగిన అవమానంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇదేనా ప్రజాపాలన ? అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.

బేగంపేట కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో ప్రపంచంలోనే తొలి ఏఆర్ ఆధారిత ఓపీడీ

- దక్షిణ కొరియాకుచెందిన 'స్కియా'తో కలిసి ఏర్పాటు
- ఇది గేమ్ చేంజర్ టెక్నాలజీ: డాక్టర్ ఏ.వి.గురవారెడ్డి



మాట్లాడుతున్న కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏ.వి గురవారెడ్డి

బేగంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే కిమ్స్-సన్ షైన్ హాస్పిటల్ ఆ దిశగా మరో అడుగు ముందుకు వేసింది. ప్రపంచంలోనే తొలి ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఔట్‌పేషెంట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ టెక్నాలజీ.. శస్త్రచికిత్స చేసేముందు, ఔట్‌పేషెంట్ విభాగాల్లో (ఓపీడీ).. రోగులకు వారి అనారోగ్యం గురించి వివరంగా అర్థమయ్యేలా చెప్పేందుకు ఉపకరిస్తుందని ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ వైద్య ఆవిష్కరణల సంస్థ స్కియాతో కలిసి ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. దీన్నే గేమ్ చేంజర్ టెక్నాలజీగా అభివర్ణించారు. దీని ద్వారా రోగులు తమ ఆరోగ్య పరిస్థితులలను 3డీలో వీక్షించగలుగుతారని.. జీర్ణాశయ సంబంధిత సమస్యలు, పిత్తాశయం, పేగు సంబంధిత వ్యాధుల గురించి వారికి స్పష్టమైన అవగాహన కలుగుతుందని చెప్పారు. ఇక.. చదువులేనివారు, మారుమూల గ్రామాల వారికీ సులభంగా అర్థమయ్యేలా ఏఆర్ ఆధారిత ఓపీడీ ప్రిస్క్రిప్షన్ ఉంటుందని డాక్టర్ విమలాకర్‌రెడ్డి, డాక్టర్ రోహన్‌రెడ్డి తెలిపారు. మెడికల్ అండ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, గైనకాలజీ, కార్డియాలజీ తదితర విభాగాల ఓపీడీల్లో ఈ సేవలను అందించనున్నట్టు చెప్పారు.

శ్రీశైలం డ్యాంలో రెండో రోజూ శాస్త్రవేత్తల సర్వే

నంద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో కట్టడాల తీరుతెన్నులపై పుణెకు చెందిన కేంద్ర జల-విద్యుత్ పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తలు రెండో రోజు బుధవారం కూడా సర్వే చేశారు. శాస్త్రవేత్తలు ఎం.ఎస్ బిస్త్, అజయ్ సొనావనే, వీఎస్ కట్టే, రీసెర్చ్ అసిస్టెంట్ రాకీ పలు అంశాలపై అధ్యయనం చేశారు. ప్లంజ్‌పూల్‌తో పాటు కాంక్రీట్ సిలిండర్ల గ్యాలరీలను పరిశీలించారు. డ్యాంలోని కొన్ని ప్రాంతాలకు బోట్లలో వెళ్లారు. లేజర్ టెక్నాలజీతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే చేశారు. గోతులను పూడ్చడం.. మరమ్మత్తులు చేయడం తదితర అంశాల పరంగా నివేదికను సిద్ధం చేస్తున్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- బస్సు డ్రైవర్, ప్రయాణికురాలి మృతి
- 16 మందికి గాయాలు





గోవిందమ్మ, కొండల్‌రావు(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డివైడర్ పక్కన ఆగివున్న లారీని ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఆ బస్సు డ్రైవర్, ఓ ప్రయాణికురాలు దుర్మరణంపాలయ్యారు. 16 మందికి గాయాలయ్యాయి. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఏపీలోని ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద డివైడర్ పక్కన ఆగివున్న లారీని డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ఢీకొట్టింది. బస్సు డ్రైవర్, ప్రకాశం జిల్లా జరుగుమల్ల మండలం చిర్రికుర్రపాడుకు చెందిన మేడుబల్మి కొండల్‌రావు(41), ప్రకాశం జిల్లా కొన్నూరు మండలం పర్రిచూరివారిపాలెం గ్రామానికి చెందిన ప్రయాణికురాలు దండెబోయిన గోవిందమ్మ(47) అక్కడికక్కడే మృతి చెందారు. వీరితోపాటు మరో 16మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిని హైదరాబాద్, చౌటుప్పల్ ఆస్పత్రులకు తరలించారు.

రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

- పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష్ బిస్త్



హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులిచ్చారు. శిఖా గోయల్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా నియమించారు. చారుసిన్హాకు సీఐడీ అదనపు డీజీగా బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ సిటీ ఎస్‌బీ డీసీపీగా ఉన్న ఎస్. చైతన్యకుమార్‌ను సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా నియమించగా, ఆ పదవిలో ఉన్న పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కొమురంభీం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. మైనారిటీ వెల్ఫేర్‌లో ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న తఫ్సీర్ ఇక్బాల్‌ను చార్మినార్ జోన్ డీఐజీగా నియమించారు. డీవీ శ్రీనివాసరావును మెదక్ ఎస్పీగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న అభిలాష్ బిస్త్‌ను తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా నియమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్‌కు హసీనా పరీక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై విచారణ జరుపుతోన్న ట్రిబ్యునల్ ఆమెపై అరెస్టువారెంట్ జారీచేసింది. గత ఏడాది విద్యార్థుల ఆందోళనలను అణచివేయడానికి అవామీలీగ్ ప్రభుత్వం అతి క్రూరంగా వ్యవహరించి, సామూహిక మారణ కాండకు పాల్పడిందన్నది ప్రాసిక్యూషన్ ఆరోపణ. దీనిని పరిగణన లోకి తీసుకున్న బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) హసీనాతో పాటు అప్పటి బంగ్లా హోంమంత్రి, ఇనస్పెక్టర్ జనరల్‌కు సైతం అరెస్టువారెంట్లు జారీ చేసింది. సామూహిక హత్యాకాండలో ఈ ముగ్గురిదే ప్రధానపాత్రని నిర్ధారించింది. విద్యార్థులపై దాడులు చేయవలసిందిగా భద్రతాదళాలతో పాటు అధికారపార్టీ కార్యకర్తలను, అనుబంధ గ్రూపులను సైతం హసీనా ప్రభుత్వం ఆదేశించి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరణించడానికి కారణమైందని చీఫ్ ప్రాసిక్యూటర్ వాదన. ఈ హత్యలన్నీ పక్కా ప్రణాళికతో ఉద్దేశ పూర్వకంగా చేసినవని ఆయన వాదన. అభియోగాలను నమోదు చేసిన న్యాయస్థానం ఈ నెల 16లోగా హసీనాను ప్రవేశపెట్టాలంటూ ఆదేశాలు కూడా ఇచ్చింది. దోషులుగా తేలితే ఐసీటీ–బంగ్లాదేశ్ చట్టం ప్రకారం వీళ్ళకు ఉరిశిక్ష పడుతుందట.

హసీనా దుర్మార్గాలను నిరూపించడానికి 81మంది సాక్షులను, వందలాది వీడియోలు, మెసేజ్‌లను కూడా న్యాయస్థానం ముందు ప్రభుత్వం ఉంచింది. హసీనామీద వందకు పైగా కేసులు పెట్టి, భారత దేశం నుంచి వెనక్కు రప్పించాలని ప్రయత్నిస్తున్న యూనిస్ ప్రభుత్వానికి ఐసీటీ ఆదేశాలు కొత్త శక్తినిస్తాయి. భారత ప్రభుత్వం పలురకాల కారణాలు, అభ్యంతరాలతో హసీనా అప్పగింతకు సిద్ధ పడకపోవడం తెలిసిందే. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగిన హసీనా తన పదవిని పరిరక్షించుకోవడానికి నిరంకుశంగా, అప్రజా స్వామికంగా వ్యవహరించిన మాట నిజం. ఆమె ఆదేశాల మేరకే భద్రతాబలగాలు విద్యార్థులమీద అంత అమానుషంగా విరుచు పడ్డాయి. అందుకు ఆమెను బాధ్యురాలిని చేసి, శిక్షించేందుకు సిద్ధ పడినప్పుడు ఆ ప్రక్రియ పారదర్శకంగా, నిజాయితీగా జరగాలి. ఆమె పట్ల కక్షపూరితంగా కాక, ప్రస్తుత పాలకులు తటస్థంగా ఉండాలి. కానీ, నోబెల్ పురస్కార గ్రహీత నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో హసీనా ఉనికినీ, చిహ్నాలను తుడిచిపెట్టేయాలన్న కక్షతో కదులుతోంది. అవామీలీగ్ నాయకులను జైళ్ళలోకి తోయడమే కాదు, దశాబ్దాలనాటి ఓ ఉగ్రవాద చట్టాన్ని రాత్రికిరాత్రి తమకు అనుగుణంగా సవరించి, ఇటీవల ఏకంగా ఆమె పార్టీనే ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించింది. ఇక, హసీనాకు ట్రిబ్యునల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన మర్నాడే ఆ దేశ సుప్రీంకోర్టు 1971 ఊచకోతలో పాకిస్థాన్‌తో కుమ్మక్కయిన మతోన్మాద జమాతే ఇస్లామీని రాజకీయ పార్టీగా ఎన్నికల్లో పాల్గొనేందుకు అనుమతించడం విశేషం.

ఉన్నతంగా, తటస్థంగా దేశాన్ని నడిపించాల్సిన యూనిస్ ప్రభుత్వం ఏకపక్షంగా, ఒక మతతత్వసంస్థలాగా వ్యవహరిస్తోంది. బంగ్లాదేశ్‌కు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సాధించిన ముజిబుర్ రహ్మాన్ ఆనవాళ్ళేమీ దేశంలో మిగలకుండా చేసే ప్రయత్నాలు అక్కడ బలంగా, ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాయి. విగ్రహాల కూల్చివేత, బంగ్లావిమోచనంలో ఆయన పాత్రను కుదించడం, పాకిస్థాన్ మెచ్చే రీతిలో పాఠ్యపుస్తకాలను తిరగరాయడం ఇత్యాదివి సాగిపోతున్నాయి. జూన్ 1నుంచి జారీ అయిన నోట్ల మీద కూడా ఆయన ఫోటో లేకుండాపోయిన విషయం తెలిసిందే. కొత్తపాఠ్యపుస్తకాల్లో ముజిబుర్ రహ్మాన్‌ను వెనక్కునెట్టేసి, జియావుర్ రహ్మాన్‌ను ఆకాశానికెత్తే ప్రయత్నమూ జరిగింది. బంగ్లావిముక్తి పోరాటానికి మసిపూసి, దాని ఆవిర్భావానికి దోహదపడిన పరిస్థితులను, కారణాలను చెరిపివేసి, ఆనాటి ఆదర్శాలకు పాతరేసి, పాకిస్థాన్ అనుకూల, మత ఛాందస దేశంగా బంగ్లాదేశ్‌ను మార్చేందుకు బలమైన ప్రయత్నం జరుగుతోంది. ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్–ఉద్ దావా నాయకులు కొందరు ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తూ, 1971లో పాకిస్థాన్‌ను దెబ్బతీసి ఇందిరా గాంధీ బంగ్లాదేశ్‌ను సృష్టిస్తే, గత ఏడాది అందుకు ప్రతీకారం తీర్చుకున్నామంటూ హసీనా వ్యతిరేక ఉద్యమంలో తమ సంస్థ పాత్ర ప్రముఖంగా ఉన్నదని చెప్పుకున్నారట. పొరుగుదేశం పరిణామాలు భారత్‌కు పరీక్షపెట్టే విధంగా పరిణమిస్తున్నాయి.

కన్నడపై కమల్ వ్యాఖ్యలు సబబేనా?

సినీ నటుడు కమల్ హాసన్ ఇటీవల చెన్నైలో ఒక సినిమా వేడుకలో మాట్లాడుతూ కన్నడకు తమిళ భాష జన్మనిచ్చిందని చేసిన వ్యాఖ్య కన్నడనాట ఆగ్రహావేశాలు రేకెత్తించింది. ఈ వ్యాఖ్యలపై కర్ణాటకలోని పలు పోలీస్ స్టేషన్లలో కమల్‌పై కేసులు నమోదైనాయి. కన్నడ భాషకు 2,500 ఏళ్ల చరిత్ర ఉందనీ, తమిళభాష కన్నడానికి జన్మనివ్వటం ఏమిటని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొదలు అంతా ఆగ్రహించారు. జూన్ 5న విడుదల కానున్న కమల్ హాసన్ తాజాచిత్రం 'థగ్ లైఫ్' ప్రదర్శనలకు కర్ణాటకలో ఆటంకం ఏర్పడింది. ఇందుకు స్పందనగా కమల్ మాట్లాడుతూ చరిత్రకారుల ద్వారా తాను తెలుసుకున్న చరిత్రనే ప్రేమతో చెప్పాను తప్ప తనకు వేరే ఉద్దేశమే లేదన్నారు. తన వ్యాఖ్యను ఉపసంహరించుకోవడం గానీ క్షమాపణలు చెప్పడం కానీ చేయబోనని, ఈ విషయాన్ని చరిత్రకారులు, భాషా శాస్త్రవేత్తలకు వదిలేద్దామనీ కమల్ అన్నారు.

కమల్ వ్యాఖ్య బాగోగులేమిటో చూద్దాం. దక్షిణాది భాషలైన తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద మొదలైన భాషలను ద్రావిడ భాషా కుటుంబంగా వ్యవహరిస్తారు. అతి ప్రాచీనమైన ఈ ద్రావిడ భాషలలో ఏది అత్యంత ప్రాచీన భాష అనే విషయం పరిశీలించే ముందు అసలు ద్రావిడులు అంటే ఎవరు? వారు ఎక్కడి నుంచి వచ్చారు? అనేది చూడాలి. ద్రావిడులు ఆర్యులకన్నా ముందు అప్పటి భారతదేశంలో నివసించినవారు. వారు నవీన శిలాయుగంలో నెగ్రిటో, ప్రోటో ఆస్ట్రలాయిడ్ జాతుల తరువాత భారతదేశానికి వచ్చి స్థిరపడిన మెడిటరేనియన్ జాతివారని చరిత్ర పరిశోధకుల నిర్ధారణ. ఈ జాతివారు మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వాయవ్య భారతదేశం మీదుగా నాటి భారతదేశంలో ప్రవేశించారని కొందరు పరిశోధకులు భావించారు. ఇందుకు ఆధారంగా వారు నేటి పాకిస్థాన్‌లో ఉన్న బలూచిస్థాన్‌లోని బ్రాహుయిస్థాన్ ప్రజలు బ్రాహుయి (Brahui) అనే ద్రావిడ భాషను మాట్లాడుతూ ఉండటాన్ని పేర్కొన్నారు. ద్రావిడ భాషలు మాట్లాడే మిగతా దక్షిణ భారతదేశం నుంచి 1500 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ ప్రజలు ద్రావిడ భాష అయినట్టి బ్రాహుయిని నేటికీ మాట్లాడుతూ ఉండటాన్ని బట్టి, సామాన్య శకపూర్వం (అంటే BCE) 3,000 సంవత్సరానికి పూర్వమే మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వలస వస్తూ కొందరు ద్రావిడ జాతీయులు అక్కడ స్థిరపడి ఉంటారనే నిర్ధారణకు వచ్చారు. దక్షిణ ఆసియా భాషలపై విశేష పరిశోధనలు చేసిన ఎలీనా బషీర్, భద్రిరాజు కృష్ణమూర్తి వంటి వారి గ్రంథాలు ఈ అభిప్రాయాన్ని బలపరిచాయి. మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి ద్రావిడులు సముద్రమార్గాన దక్షిణ భారతదేశానికి వచ్చి స్థిరపడి, ఆ తరువాత క్రమంగా ఉత్తర భారతదేశానికి కూడా వ్యాపించి ఉంటారని ఇంకొందరి భావన. ఏది ఏమైనా ద్రావిడులంతా మౌలికంగా నవీన శిలాయుగంలో BCE 3,000 ప్రాంతంలో మధ్యధరా సముద్రం, పశ్చిమ ఆసియాలోని



ద్రావిడ భాషా కుటుంబంగా ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద వంటి భాషలలో తమిళ భాష అత్యంత ప్రాచీనమైనదని ఇప్పటికి లభించిన సాహిత్య, శాసనాధారాలవల్ల రుజువైంది. అయితే, తమిళ భాష నుంచే మిగిలిన ద్రావిడ భాషలు ఉద్భవించాయా? లేదా, అవి మొదటి నుంచీ వేరే భాషలుగానే ఉంటూ వచ్చాయా? అనేది తగు శాస్త్రీయ ఆధారాలతో చేయాల్సిన చర్చ.

ఇరాన్ ప్రాంతం నుంచి వలస వచ్చిన వ్యవసాయ సంస్కృతి నిర్మాతలనే విషయాన్ని దాదాపుగా చరిత్రకారులందరూ అంగీకరిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతపు తవ్వకాలలో ప్రత్యేకించి క్రీటు దీవిలో లభించిన క్రీటన్ జ్యూస్ (Cretan Zeus) విగ్రహాలు ద్రావిడులు పూజించే పిళ్ళార్ (వినాయక) విగ్రహాలకు మూలరూపాలని పరిశోధకులు తేల్చారు. నేటి టర్కీలో అంతర్భాగమైన అనటోలియాలోని లికియా (Lycia)లోని దిర్మిల్ ప్రాంతాన్ని అనాదిగా లికియన్లు త్రిమిలి అని పిలుస్తారనీ, దానినే బాబిలోనియన్లు తర్మిలా (Tarmila) అనీ, గ్రీకులు తర్మిలే (Termilae) అనీ పిలుస్తారనీ 'త్రిమిలి' శబ్దమే తమిళ, ద్రవిడ శబ్దాలకు మూలమని భాషావేత్తల నిర్ధారణ.

ప్రతి భాష ఏదో ఒక చారిత్రక దశలో తప్పక ఏదో మరొక భాష నుంచి వేరై ఉంటుంది. ఏ భాషా వేరుగా పుట్టింది మాత్రం కాదనేది గమనార్హం. అసలు ద్రావిడ భాషలేవీ ఏర్పడక ముందుదైన ప్రాగ్ద్రావిడ భాష నుంచి ఈ ద్రావిడ భాషలన్నీ రూపొందాయని భాషావేత్తల అభిప్రాయం. అయితే ద్రావిడ భాషలన్నిట్లోకీ తమిళం అతి ప్రాచీనమైన భాష అనేదానికి ఎన్నో ఆధారాలున్నాయి. ఒక వాడుక భాషగా తమిళం సంస్కృతం కంటే కూడా ప్రాచీనమైనది. ఇక సాహిత్యాధారాల విషయం చూస్తే తమిళ సాహిత్యం BCE మూడవ శతాబ్ది నుంచి లభిస్తూ ఉండగా సంస్కృత సాహిత్యం BCE రెండవ శతాబ్ది నుంచి మాత్రమే లభిస్తున్నది. తమిళం నేటికీ ప్రజల వాడుక భాషగా కొనసాగుతూ ఉండగా, సంస్కృతం సామాన్య శక పూర్వం ఆరవ శతాబ్దిలోనే ప్రజల వాడుక నుంచి తప్పుకుని, కేవలం పండిత భాషగా మిగిలిపోయింది.

సామాన్య శకం 850లకు చెందిన 'కవిరాజమార్గ' అనే గ్రంథం కన్నడ భాషలో ఇప్పటికి లభిస్తున్న అతి ప్రాచీన సాహిత్యం. రాష్ట్రకూట పాలకుడైన మొదటి అమోఘవర్షుడు ఈ గ్రంథాన్ని తాను ఒక్కడే కానీ వేరొకరితో కలిసి గానీ రాసివుంటాడని పరిశోధకుల అభిప్రాయం. కన్నడ కవిత్వం, ఛందస్సు, వ్యాకరణం గురించి రాయబడిన అతి ప్రాచీన గ్రంథం ఇదే. 'కావ్యాదర్శమ్' అనే సంస్కృత గ్రంథానికి ఇది అనుకరణ అని పరిశీలకులు భావిస్తారు. ప్రాచీన కర్ణాటక చరిత్ర, నాటి ప్రజల భాషా సంస్కృతులు తెలుసుకోవాలంటే 'కవిరాజమార్గ' చదవాలి. జైన కవులు రాసిన కవితలే కన్నడ భాషలోని తొట్టతొలి కవితలు. పదవ శతాబ్దానికి చెందిన కన్నడ ఆదికవి పంప కన్నడ కవులలో ఆద్యుడు. ఆ జైన కవులు రాసిన రచనలన్నీ యథాతథంగా నేటికీ నిలిచివున్న కారణంగా అవి కన్నడ భాష ప్రాచీనతకు స్పష్టమైన ఆధారాలుగా ఉన్నాయి.

అలా తమిళ సాహిత్యం, కన్నడనాట జైన కవుల రచనలు నేటికీ యథాతథంగా లభిస్తున్న కారణంగా ఆ భాషల ప్రాచీనతకు అవి తిరుగులేని ఆధారాలుగా నిలుస్తున్నాయి. మన తెలుగునాట కడప జిల్లాలో లభించిన సామాన్యశకం 575 నాటి రేనాటి చోడ పాలకుడు ధనంజయుడి పూర్తి తెలుగు శాసనమే అతి ప్రాచీనమైనది. గుంటూరు జిల్లా భట్టిప్రోలులోని బౌద్ధ క్షేత్రంలో లభించిన సామాన్యశక పూర్వం 400 నాటి శాసనంలో కొన్ని తెలుగు పదాలు ఉన్నాయి. అలాగే ఏలూరు సమీపంలోని గుంటుపల్లి దగ్గర ఉన్న కంఠంనేనివారి గూడెం, కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని గుమ్మడిదుర్రు, కృష్ణా జిల్లా దివిసీమలోని ఘంటసాల గ్రామంలోని బౌద్ధ క్షేత్రాలలో లభించిన శాసనాలలోనూ పలు తెలుగు పదాలున్నాయి. అయితే సంస్కృత మహాభారతాన్ని ఆంధ్రీకరించిన CE 11వ శతాబ్దానికి చెందిన నన్నయభట్టు తెలుగులో ఆదికవిగా భావించబడ్డాడు. అంతకు పూర్వపు సాహిత్యమేదీ తెలుగులో లభించకపోవడమే ఇందుకు కారణం. ప్రాచీన ఆంధ్రదేశం బౌద్ధ మతానికి పట్టుగొమ్మ. బౌద్ధులు తమ ధర్మ ప్రచారాన్ని స్థానిక భాషలలోనే చేసేవారు. ఆ కారణంగా బౌద్ధ ధర్మానికి సంబంధించిన ఎన్నో తెలుగు గ్రంథాలు ఒకప్పుడు ఉండే ఉంటాయి. అయితే ఆంధ్ర దేశంలో బౌద్ధం బలహీనపడిన దశలో మహాయాన తాంత్రిక శాఖ అయినట్టి వజ్రయానం పలు దురాచారాలకు లోనై ప్రజాభిమానం కోల్పోయింది. ఆ దశలో హైందవ పునరుజ్జీవనోద్యమంలో భాగంగా బౌద్ధ స్తూపాలు, చైత్యాలు విధ్వంసం చేయబడటమే కాదు, బౌద్ధ సాహిత్యం తగులబెట్టబడి ఉంటుందని చరిత్రకారుల అంచనా. అలా తెలుగు భాష ప్రాచీనతకు సాహిత్యాధారాలు లేకుండా పోయాయి. ఏమైనా తెలుగు భాష తమిళం కంటే ప్రాచీనమైనదని ఎవ్వరూ అనటం లేదు. కమల్ హాసన్ కన్నడ భాషను నిందించలేదు. కించపరచలేదు. కమల్ అభిప్రాయం నచ్చని వారు దానిని తగు ఆధారాలతో తిప్పికొట్టవచ్చు. అంతే కాని, రాజకీయ ప్రయోజనాలు ఆశించి, రెండు రాష్ట్రాలలో భావోద్వేగాలు రెచ్చగొట్టేవారి దుశ్చర్యలు కూడనివి.

మరో ముఖ్యమైన విషయం. త్రిమిలి శబ్దం నుంచే తమిళ, ద్రమిల, ద్రవిడ శబ్దాలు రూపొందాయని పరిశోధనలు రుజువుపరచాయి. మధ్యధరా సముద్రంలోని క్రీటు దీవి, త్రిమిలి ప్రాంతం నుంచి వలసవచ్చి భారతదేశంలో స్థిరపడిన మెడిటరేనియన్లను అందుకే ద్రావిడులు అన్నారు. ద్రావిడ శబ్దం తమిళ శబ్దానికి పర్యాయపదంగా స్థిరపడింది. తమిళుల అభ్యున్నతి కోసం పనిచేసే పార్టీల పేరులో ద్రావిడ శబ్దం అందుకే ఉంది. ద్రావిడ భాషా కుటుంబంగా ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద వంటి భాషలలో తమిళ భాష అత్యంత ప్రాచీనమైనదని ఇప్పటికి లభించిన సాహిత్య, శాసనాధారాలవల్ల రుజువైంది. తమిళ భాష నుంచే మిగిలిన ద్రావిడ భాషలు ఉద్భవించాయా? లేదా? అవి మొదటి నుంచీ వేరే భాషలుగానే ఉంటూ వచ్చాయా? అనే విషయం తగు శాస్త్రీయ ఆధారాలతో చేయాల్సిన విద్యావిషయకమైన చర్చ. అంతేగానీ, భాషా జాతుల మధ్య ద్వేషాలకు దారితీసేందుకు ఎవరు ప్రయత్నించినా వారు దేశ సమగ్రతకూ, సామరస్యానికీ హాని కలిగించినట్లే, అది రాజ్యాంగ విరుద్ధమైన చర్యే.

■ ముత్తేవి రవీంద్రనాథ్
చరిత్ర పరిశోధకులు

ఈ ఏడాది నినాదం.. ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

ప్లాస్టిక్‌తో కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. నేల, చెరువులు, నదులు, సముద్రాలన్నింటినీ ఇది కమ్మేస్తోంది. కాలువలు, నదుల ద్వారానే ఏటా 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 కల్లా 2.9 కోట్ల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సముద్రంలోకి చేరే ప్రమాదముంది.

కోయంబత్తూరు దగ్గర్లోని భారతీయార్ యూనివర్సిటీకి సమీపంలో 'మరుదామలై' అటవీప్రాంతం ఉంది. ఆ అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు మృతి చెందింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆ ఏనుగు కడుపులో 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్లు గుర్తించారు! సందర్శకుల ద్వారా అటవీప్రాంతంలోకి కూడా ప్లాస్టిక్ భూతం ఇంతగా చేరిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏనుగులే కాదు నిత్యం ఎన్నో జీవరాసులు ఈ ప్లాస్టిక్ భూతానికి బలవుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో వాటిల్లబోయే ప్రమాదాలకు ఈ ఘటనలను ముందస్తు హెచ్చరికగా భావించాలి.



'మరుదామలై' అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు మృతి చెందింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆ ఏనుగు కడుపులో 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్లు గుర్తించారు! సందర్శకుల ద్వారా అటవీప్రాంతంలోకి కూడా ప్లాస్టిక్ భూతం ఇంతగా చేరిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. కొన్నేళ్ల క్రితం ప్లాస్టిక్ ఉత్పత్తి ఏడాదికి 20లక్షల టన్నులు ఉండగా 2019లో ఇది 45 కోట్ల టన్నులకు పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే 2060 నాటికి మూడింతలు పెరిగే ప్రమాదముంది. ఈ కాలుష్య కట్టడికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాలి. ఆ వ్యర్థాలను పునర్వినియోగించే దిశగా అడుగులు వేయాలి. ప్రస్తుతం పది శాతం కంటే తక్కువగానే ప్లాస్టిక్ పునర్వినియోగం జరుగుతోంది. దీన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఇప్పటికే భూమ్మీద 600 కోట్ల టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పోగు పడ్డాయని లాన్సెట్ పత్రిక ఓ అధ్యయనంలో వెల్లడించింది. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలు చాలా వరకు జల వనరుల్లో చేరుతుండడం అతి పెద్ద సమస్యగా మారింది. అక్కడ అవి సూక్ష్మ రేణువులుగా విచ్ఛిన్నమవుతున్నాయి. వాటిలోని రసాయనాలు పర్యావరణానికి, సకల జీవులకూ హాని కలిగిస్తున్నాయి. ప్రధానంగా మానవ శరీరంలోని హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో పాటు క్యాన్సర్, మధుమేహం, సంతానలేమి వంటి ఇతర సమస్యలకు దారి తీస్తున్నాయంటున్నారు వైద్య నిపుణులు. ప్రపంచంలో ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో 5.2 కోట్ల టన్నులకు పైగా బహిరంగ ప్రదేశాలలో కాల్చివేస్తున్నారు. ఆ సమయంలో విడుదలయ్యే విష వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి జీవుల్లో అనేక రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఓ సర్వే ప్రకారం గాలి ద్వారా మనం నిత్యం 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులని పీలుస్తున్నాం.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా కొన్ని దేశాల్లోని కార్పొరేట్ సంస్థలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. 'ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండకూడదు అనుకుంటే.. దాని జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం' అనే నినాదంతో అడుగులు వేస్తున్నాయి. యూకేలో ఇప్పటికే పలు సూపర్ మార్కెట్లు కూల్‌డ్రింక్ టిన్స్, గ్రీటింగ్ కార్డ్స్, బెడ్‌షీట్స్ వంటి వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం మానేశాయి. ఉత్తర అమెరికాలోని వాల్‌మార్ట్ షాపింగ్ మాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం తగ్గించారు. స్వీడన్‌కు చెందిన ఐసీఏ రిటైల్ సంస్థ పండ్లు, కూరగాయలపై బ్రాండ్ల పేర్లను లేజర్‌తో ముద్రించే ప్రయత్నం చేస్తోంది. యూనీలివర్, జాన్సన్ వంటి సంస్థలు టూత్‌పేస్ట్, డిటర్జెంట్లను మందుబిళ్ళల రూపంలో తయారుచేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. అమెరికాలో పాల పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా సీసాలు, జగ్గుల్లో విక్రయించే విధానం ఇప్పటికే మొదలైంది. ఇది అన్ని దేశాలూ ఆచరించదగిన శుభపరిణామం.

అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మేము సైతం అంటూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే మార్గాలను అన్వేషించి ఆచరణలో పెట్టాలి. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వస్తున్న బయో ప్లాస్టిక్ వస్తువులతోపాటు సంప్రదాయ గుడ్డ సంచులు, జనపనార బ్యాగులు, విస్తళ్లు, పేపర్ గ్లాసులు తదితర ప్రత్యామ్నాయాలు వాడాలి. చాలా వరకు పట్టణ ప్రాంతాల్లో ఇంటిలో చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. గ్రామస్థాయిలో కూడా మార్పు రావాలి. ఇళ్లలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలి. తప్పని పరిస్థితుల్లో వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను క్రమపద్ధతిలో వేరు చేసి రీసైక్లింగ్‌కు ప్రోత్సహించాలి. పిల్లలకు ప్లాస్టిక్ డబ్బాల్లో భోజనం పంపకుండా స్టీల్ బాక్సుల్లో పెట్టడం అలవర్చుకుంటే అటు పిల్లలకీ ఆరోగ్యం, ఇటు పర్యావరణ హితం కూడా. ఇలాంటి సామాజిక అంశాల పట్ల పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలి. యువత కూడా రీసైక్లింగ్ రంగంలోకి అడుగుపెట్టాలి. ప్రభుత్వాలు ఆ దిశగా అంకుర పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

○ డా. పి కృష్ణయ్య, ఐఏఎస్ (రిటైర్డ్)
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

'అంబేడ్కర్ ఉంటే ఏం చేసే'వారంటే...!

'ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవారు?' అని 'డానీ' రాసిన వ్యాసం చూశాను (మే 24). అంబేడ్కరూ, రాజ్యాంగమూ, హింసామార్గమూ అనే విషయాల్లో, డానీ గమనించని సంగతులు కొన్ని ఉన్నాయనిపించి, ఇది రాస్తున్నాను.

(1) 'మావోయిస్టులది, ప్రకటిత హింసా మార్గం' అన్నారు డానీ. మావోయిస్టులు హింసని ప్రయోగించిన సందర్భాల్ని గమనించవలిసిందే గానీ, వారి మార్గాన్నంతా హింసా మార్గంగానే భావించరాదని నా అభిప్రాయం.

అసలు చరిత్రలో, శ్రామికుల వర్గాన్ని అన్యాయంగా, బల ప్రయోగంతో అణచడానికి దోపిడీ వర్గం ఏర్పర్చుకున్నదే రాజ్యాంగ యంత్రం! మానవ చరిత్రలో ప్రారంభం నించీ, శ్రమ దోపిడీ వర్గానిదే ప్రకటిత హింసామార్గం. అనాదిగా, బానిస యజమానుల కాలం నించీ ప్రారంభమైంది దోపిడీ వర్గ హింసా మార్గమే. ఆ హింసా మార్గాన్ని ఎదుర్కొని, పాలక వర్గాధికారాన్ని కూల్చివేసి, దోపిడీనించీ విముక్తి చెందడానికి, శ్రామిక వర్గానికి 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' చూపిన మార్గం 'బలప్రయోగం'! ఆ మార్గంలో, ఆ వర్గం ఎన్ని అపజయాలు పొందినా, అదే దానికి స్వయం రక్షణ మార్గం. చరిత్రని చూస్తే, హింసని ప్రారంభించింది, దోపిడీ పీడనలకు గురి అయ్యే శ్రామిక జనాలు అని చెప్పడానికి ఎక్కడా ఆధారాలు లేవు. ఈ కాలపు ఉదాహరణే తీసుకుంటే, చారెడైనా భూమిలేని కూలీలూ, కౌలు రైతులూ, 'దున్నేవాళ్ళకే భూమి' అనే నినాదంతో, కమ్యూనిస్టుల నాయకత్వంలో సిద్ధపడితే, ప్రభుత్వం ఊరుకోదు. బలప్రయోగంతో అణిచివేస్తుంది. అప్పుడు స్వయంరక్షణ కోసం కమ్యూనిస్టులు కూడా, తప్పనిసరై, హింసా మార్గాన్నే అనుసరిస్తారు. 'సాయుధ పోరాటమే ఏకైక మార్గం!', 'వర్గ శత్రువు రక్తంలో చేతులు ముంచనివాడు విప్లవకారుడే కాదు!' అనే తప్పుడు నినాదాల్ని, ప్రారంభకాలం నాటి మావోయిస్టు నాయకుడు చారుమజుందారు కూడా, మొదట్లోనే ఇవ్వలేదు. తెలంగాణ రైతాంగ పోరాటంలో గానీ, నక్సల్ బరీ పోరాటంలో గానీ, హింసని మొదట ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదని చరిత్ర చెబుతోంది. కాబట్టి, 'మావోయిస్టులది ప్రకటిత హింసా మార్గం' అనడం న్యాయం కాదు.



(2) 'భారత రాజ్యాంగం ఆధునిక పవిత్ర గ్రంథం' అనీ, ప్రభుత్వం చేసే హింస, ఆ పవిత్ర గ్రంథంలో ఉన్న 'ఆదర్శాలకూ, మార్గదర్శకాలకూ అనుగుణంగా' లేదనీ భావించారు డానీ. ప్రభుత్వం చేపట్టిన హింసామార్గాన్ని ఖండించడానికి, రాజ్యాంగాన్ని 'పవిత్ర గ్రంథం'గా వర్ణించనక్కరలేదు. వర్గాలుగా విడిపోయి వున్న ఏ దేశంలో అయినా, రాజ్యాంగం అనేది, అక్కడ ఉండే ప్రభుత్వాలకు, ప్రత్యర్థుల్ని, ముఖ్యంగా విప్లవకారుల్ని అణచడానికి రకరకాల చట్టాల్ని అందుబాటులో ఉంచుతుంది. అసలు, ఒక సమాజంలో సైన్యమూ, పోలీసూ, రకరకాల సాయుధ బలగాలూ, ఆయుధాలూ, గూఢచారి వ్యవస్థ ఉన్నాయంటే, అవసరమైనప్పుడు, ఆ ప్రభుత్వాలు హింసా మార్గం అనుసరించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అర్థం. అందుకే, ఇప్పటి సందర్భంలో, కగార్లనీ, బ్లాక్ ఫోరెస్టుల్నీ, డ్రోన్లనీ, రకరకాల పేర్లున్న అరడజను సాయుధ బలగాల్నీ ఉపయోగించడం! వీటిని ఉపయోగించకూడదని, డానీ చెప్పిన 'పవిత్ర రాజ్యాంగం'లో ఎక్కడా లేదు!

(3) 'ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమానత్వాన్ని' సాధించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించకపోతే, బాధితులైన ప్రజలు తిరగబడతారని రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్‌గా అంబేడ్కర్ హెచ్చరించారని డానీ అంటున్నారు. అవును, ఆయన అలా అన్న మాట నిజమే! మరి, ఆయన అలా హెచ్చరించిన సమయంలోనే, 1948 సెప్టెంబరులో, తెలంగాణ గ్రామాలలోకి, కమ్యూనిస్టుల నాయకత్వాన నడుస్తున్న రైతాంగ పోరాటం ఒక రకమైన సమానత్వాన్ని కోరుతూ జరుగుతున్నదే గదా? మరి అలాంటి బాధితుల పోరాటాన్ని అణచడానికి, 50 వేల సైన్యాన్ని పంపిన ప్రభుత్వంలో అంబేడ్కర్ ఒక మంత్రిగా ఎలా ఉండగలిగారు? ఇప్పటి ప్రభుత్వం అనుసరిస్తున్న హింసా మార్గాన్ని ఖండించడానికి, అణచివేత చట్టాలకూ, సాయుధ బలగాలకూ వీలునిచ్చిన రాజ్యాంగాన్ని తయారుచేసిన రచనా కమిటీలో ఉన్నవ్యక్తి మాటల్ని ఉటంకించడం వల్ల, పాఠకులు అటు రాజ్యాంగాన్ని గానీ, ఇటు ఆ వ్యక్తిని గానీ, సరిగా అర్థం చేసుకోవడం వీలు కాదు. ఆనాడే, రైతాంగం మీదా, వారి తరఫున పోరాడుతున్న కమ్యూనిస్టుల మీద, తన ప్రభుత్వమే హింసాకాండ జరుపుతున్నప్పుడు, ఏమి చెయ్యని అంబేడ్కరు, ఇప్పుడు జరుగుతున్న హింసని చూసి 'ఏమి చేసేవాడో' అని ప్రశ్నించడం తార్కికంగా లేదు.

కొన్ని విషయాల్ని గమనించకపోయినా, ఆదివాసీల పట్లా, వారిని సంఘటితం చేసి, వారి తరఫున పోరాడుతున్న మావోయిస్టుల పట్లా, సహృదయమైన ప్రేమతోనే సాగింది డానీ వ్యాసం. కానీ, అణచివేతకి ఆస్కారం ఇచ్చే రాజ్యాంగాన్ని 'పవిత్ర గ్రంథం' అనడం, అంబేడ్కరు ఉంటే ఏదో చేసే వారన్నట్టు రాయడం వల్ల, కొన్ని భ్రమల్ని కలిగించే ప్రమాదం ఉంది.

◆ నౌరోజీ

మేడిగడ్డపై అడ్డగోలు బుకాయింపులు!

మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ వాళ్ళే బాంబులు పెట్టి వుంటారేమో అంటున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అక్టోబర్ 21, 2023 తేదీన మేడిగడ్డ కుంగడానికి బాంబులు పెట్టారే అనుకుందాం. అక్టోబర్ 21 నుండి కొత్త ప్రభుత్వం ప్రమాణం చేసే డిసెంబర్ 23 వరకు, అంటే రెండు నెలలకు పైగా అధికారంలో ఉన్నది కేసీఆరే కదా? మరి పోలీసులతో దర్యాప్తు చేయించి బాంబులు ఎవరు పెట్టారో ఎందుకు తేల్చలేదు? నిర్మాణంలో వైఫల్యాల వల్లనే మేడిగడ్డ కుంగిందని మౌనంగా గ్రహించి, ఆనాడు మీరే కదా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఆదేశాల ప్రకారం మూడు బ్యారేజీలలో నిలువ నీళ్లన్నీ ఖాళీ చేసింది? 21వ శతాబ్దపు శాస్త్ర సాంకేతిక యుగపు సమాజాన్ని ఎందుకు ఇంకా వంచిస్తారు? బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ ఐటీ పరిశ్రమలు పట్టణ శాఖామంత్రి. సుదీర్ఘకాలం అమెరికాలో అత్యాధునిక ఐటీ సాంకేతిక పరిశ్రమలో పనిచేశారు. అలాంటి కేటీఆర్ బ్యారేజీ పగుళ్లపై ఇలాంటి భాష మాట్లాడటం చూసి వారి అభిమానులే విస్తుపోతున్నారు!

కేటీఆర్ అన్నట్లు మేడిగడ్డ బ్యారేజీలో బాంబు పెట్టారే అనుకుందాం. మరి, ప్రముఖ వైజ్ఞానిక సంస్థలతో మూడు బ్యారేజీల్లోనూ భూ అంతర్గత, సాంకేతిక పరీక్షలు చేయించాలని ఎన్‌డీఎస్ఏ ఎందుకు నిర్ణయించింది? మూడు బ్యారేజీలలోనూ మేడిగడ్డ లాంటి అతిప్రమాదకర పరిస్థితులే ఉన్నాయన్నది వాస్తవం కాదా?

ఎన్‌డీఎస్ఏ నివేదికను నిర్మాణ కంపెనీ ఎల్ అండ్ టీ తిరస్కరించడాన్ని కేటీఆర్ స్వాగతిస్తున్నారు. ఎల్ అండ్ టీ తిరస్కరించడంలోనూ, దాన్ని కేటీఆర్ స్వాగతించడంలోనూ పరస్పర ప్రయోజనం ఉన్నది. సరే, ఎల్ అండ్ టీ మేడిగడ్డ నిర్మాణంలో ఏ తప్పులూ చేయలేదనే అనుకుందాం. అలాంటప్పుడు నిర్మించిన నాలుగేండ్లకే మేడిగడ్డ ఐదు అడుగులు ఎందుకు కుంగింది? పునాది నుండి పై వరకు నిట్ట నిలువునా ఎందుకు చీలిపోయింది? అక్టోబర్ 21, 2023 తేదీన మేడిగడ్డ కుంగిపోయింది వాస్తవం కాదా? ఆ భౌతిక వాస్తవాన్ని కూడా ఎల్ అండ్ టీ తిరస్కరిస్తుందా? నిర్మాణమైన నాలుగేళ్లకే 25 వేల కోట్ల ప్రజాధనం ఎక్కడైనా ఇలా గంగలో కలిసిందా? ఇలా ఎందుకు జరిగిందని అత్యంత లోతుగా విశ్లేషించిన ఎన్‌డీఎస్ఏ నివేదికని హృదయపూర్వకంగా ఆహ్వానించి, నిపుణుల కమిటీ సూచనలను పాటించవలసింది పోయి, ఎల్ అండ్ టీ ఇలా రాజకీయాలను అనుసరించడం సరికాదు.




అక్టోబర్ 21, 2023 తేదీన సాయంత్రం 6:15 – 6:30 గంటల మధ్య మేడిగడ్డలోని ఏడో బ్లాక్‌లోని పియర్లు భూమిలోకి కుంగిపోతూ భారీ శబ్దం వచ్చింది. కేటీఆర్ అన్నట్లు అది బాంబు శబ్దంలా ఎందుకు వినిపించిందో, బ్యారేజీ భూగర్భంలో ఆ సమయంలో ఏమి జరిగిందో పరిశీలిద్దాం. బ్యారేజీలోకి నీరు వచ్చి, నిలువ నీటి హెడ్ లెవెల్ పెరుగుతుంది. గేట్ల గుండా సూపర్ క్రిటికల్ ఫ్లోతో (15 మీటర్స్ పర్ సెకండ్ వేగంతో) దిగువకు నీళ్ల వదిలి పెడుతున్నారు. భారీ శక్తితో నీరు సాండ్ బెడ్‌పై పడి భారీ స్కవర్ (కోత) ఏర్పడింది. ఈ సాండ్ బెడ్ కోత పునాది కంటే లోతుకు వెళ్ళినప్పుడు, 16 టీఎంసీల పూర్తి నీటిమట్టం ఉన్నప్పుడు, మహా ప్రకృతి శక్తితో బ్యారేజ్ పునాది కింద ఉండే ఇసుక గుండా నీరు పైపింగ్ జరిగి, నీటితోపాటు ఇసుక అంతా కొట్టుకుపోయి, బ్యారేజ్ పునాది కింద ఒక పెద్ద రంధ్రం, ఒక భారీ ఖాళీ ప్రదేశం ఏర్పడుతుంది. మేడిగడ్డ బ్యారేజీ పునాది అడుగున ఉండే రాఫ్ట్ ఫౌండేషన్, పై భాగాలన్నీ క్రిందకు భూమిలోకి కుంగాయి. రాఫ్ట్ రెండు చెక్కలై, పియర్ కూడా రెండు చెక్కలైంది. ఈ క్రాక్ బ్రిడ్జి వరకు పాకింది. దానిపైన ఉండే అనేక టన్నుల భారీ బ్యారేజీ రోడ్డు బ్రిడ్జి, భయంకరమైన మహా శక్తితో స్టీల్ గేట్లపై ఒకేసారి తటాలున పడింది. ఆ సమయంలో అది బాంబు శబ్దంలా వినిపిస్తుంది. ఆశ్చర్యపోయేదేమీ లేదు.

కేటీఆర్ అన్నట్లు ఒక్క మేడిగడ్డ బ్యారేజీలోనే బాంబు పెట్టారే అనుకుందాం. మరి ఎన్‌డీఎస్ఏ మూడు బ్యారేజీల్లోనూ ప్రముఖ వైజ్ఞానిక సంస్థలతో భూ అంతర్గత, భూ సాంకేతిక పరీక్షలు చేయించాలని ఎందుకు నిర్ణయించింది? మూడు బ్యారేజీలలోనూ మేడిగడ్డ లాంటి ప్రమాదకర పరిస్థితులే ఉన్నాయన్నది వాస్తవం కాదా? ఎన్‌డీఎస్ఏ తొమ్మిది రకాల పరీక్షలు చేయాలని సిఫారసు చేసింది. సీపేజిని గుర్తించడానికి జియో టెక్నికల్ సర్వే చేయాలని పేర్కొంది. రెండు పియర్స్ మధ్య నీటి ప్రవాహం వెళ్లే బే ప్రాంతంలో త్రీడీ స్ట్రెస్ ఎనాలసిస్ చేయాలి. సీస్మిక్ పరీక్షలు చేయాలి. రాఫ్ట్ దిగువన పడిన గుంతలను అంచనా వేయడానికి జియో ఫిసికల్ పరీక్షలు చేయాలి. సీపేజి ఎక్కడి నుంచి వస్తుందో కనుక్కోవాలి. ఇన్ని పరీక్షలు అన్ని బ్యారేజీలలోనూ ఎందుకు చేయమందో కేటీఆర్ చెప్పాలి.

బ్యారేజీ వైఫల్యానికి ఎన్‌డీఎస్ఏ ఆరు కారణాలను పేర్కొంది. వీటిలో ఐదు రకాల వైఫల్యాలతో మాకు సంబంధం లేదని ఎల్ అండ్ టీ అంటున్నది. ఎన్‌డీఎస్ఏ నివేదికను ఎల్ అండ్ టీ తిరస్కరించడాన్ని కేటీఆర్ సమర్థిస్తున్నారు. ఆరు వైఫల్యాలలో, ఐదు వైఫల్యాలకు కేసీఆర్ ప్రభుత్వమే దోషి అని ఎల్ అండ్ టీ అంటున్నట్టు. దీనికి కేటీఆర్ బదులేమి ఇస్తాడు? తక్కువ ఖర్చుతో పూర్తయ్యే తుమ్మిడిహెట్టి రాక్ బెడ్‌ను వదిలి కాళేశ్వరం మూడు బ్యారేజీల బలహీన ఇసుక బెడ్‌ను రీ ఇంజనీర్, రీ డిజైన్ చేయడమే ఈ విపత్తులకు ప్రధాన కారణం.

• నైనాల గోవర్ధన్



'సాదా బైనామా' సంగతి తేలేనా!?

భూ భారతి చట్టంపైనే రైతుల ఆశలు

- ఆరు పైలట్ మండలాల్లో 17,319 దరఖాస్తులు
- అత్యధికంగా సాదా బైనామా, అసైన్డ్ భూముల సమస్యలపైనే..
- ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో 1,66,784 సాదా బైనామా దరఖాస్తులు
- 2016 నుంచి క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం
- అసైన్డ్ భూముల సమస్యల కోసం రైతుల ఎదురుచూపులు
- రెవెన్యూ సదస్సుల్లో కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు
- ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలు
- 'భూ భారతి' పైనే రైతుల ఆశలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'ధరణి'.. భూ సమస్యలకు పరిష్కారం చూపకపోగా, అనేక చిక్కుముడులను ముందుకు తెచ్చింది. అర్జీల పరిష్కారం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగినా స్పందన లేకుండా పోయింది. ఈ క్రమంలో 'ధరణి' స్థానంలో తెరపైకి వచ్చిన 'భూ భారతి'.. రైతుల్లో అనేక ఆశలను రేకెత్తిస్తోంది. రైతుల ఫ్రెండ్లీగా రూపొందించినట్టు ప్రభుత్వం చెబుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో ఎంపిక చేసిన 6 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, రైతుల నుంచి 17,319 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఈ నెల 3 నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభం కాగా, రైతులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేస్తున్నారు. వీటిలో ఎక్కువభాగం సాదా బైనామా, అసైన్డ్ భూములకు సంబంధించినవే కావడం గమనార్హం. 2020 అక్టోబరులోనే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784 మంది రైతులు సాదా బైనామాల చట్టబద్ధత కోసం దరఖాస్తు చేసుకున్నారంటే.. సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజా భూ భారతి అయినా తమ సమస్యకు పరిష్కారం చూపుతుందనే ఆశతో రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఈ సారి సంఖ్య ఎంతమేర ఉంటుందో ఈ నెల 20 తర్వాత గానీ తెలియదు.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ధరణితో ఎదురైన సమస్యలన్నీ తొలగి, భూ భారతి చట్టం భరోసా కల్పిస్తుందనే ఆశతో రైతాంగం ఉంది. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలు ధరణిలో పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలు ముందుకు వచ్చాయి. దీంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్వోఆర్-2025 భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకవచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు విడతల్లో ఆరు మండలాలను ఎంపిక చేయగా, రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 17,319 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికం సాదా బైనామా, అసైన్డ్ భూములకు సంబంధించినవే ఉన్నాయి. తాజాగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లోనూ వస్తున్న దరఖాస్తుల్లో అత్యధికం సాదా బైనామావే.

భూ భారతిపైనే భారం

2020లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు భూ హక్కులను కల్పించే పట్టాదారు పాసు పుస్తకాల చట్టం- 1971ని రద్దు చేసి కొత్తగా పాసుపుస్తకాల చట్టం-2020 ధరణిని తీసుకవచ్చింది. అయితే ఈ విధానం ఆశించిన ఫలితలను చూపించకపోగా, కొత్త సమస్యలను తీసుకువచ్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు గత ఏప్రిల్ 14న ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి పోర్టల్‌ను తీసుకవచ్చింది. ఏప్రిల్ 17వ తేదీన రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, అందులో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని కూడా చేర్చారు. అలాగే మే 15వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా 28 మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం, హనుమకొండ జిల్లా నడికూడ, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ ఆరు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 17,319 దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 3వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నది. జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, ఆగస్టు 15వ తేదీ వరకు సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. దీంతో భూ చిక్కులకు భూభారతిలో పరిష్కారం దొరుకుతుందనే ఆశతో రైతులు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేస్తున్నారు.

సాదా బైనామాలపైనే ఆశలు

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒక్కటి సాదా బైనామా. గతంలో గ్రామాల్లో చాలమంది రైతులు రెవెన్యూ స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలపై భూములు క్రయవిక్రయాలు చేశారు. దీంతో గత ప్రభుత్వం సాదా బైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదా బైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్దత కల్పించాలని నిర్ణయించారు. 12 అక్టోబరు 2020లో కూడా జీవో నెంబరు 112ను

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల వివరాలు

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలు
వరంగల్	191	26,630
హనుమకొండ	163	27,057
జనగామ	176	10,350
మహబూబాబాద్	288	31,250
ములుగు	336	20,150
భూపాలపల్లి	223	51,347
మొత్తం	1,377	1,66,784



పేషంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..

- మౌలిక సదుపాయాలకు నివేదిక సమర్పించాలి..
- వైద్యులకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశం
- కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తనిఖీ 6

ఆలయ భూములను కబ్జా కానివ్వం

- అంగుళం జాగా ఆక్రమించినా ఊరుకోం : మంత్రి కొండా సురేఖ
- భద్రకాళి ఆలయంలో రూ.30 కోట్లతో మాడవీధుల నిర్మాణం
- రూ.3కోట్లతో వేద పాఠశాలకు భూమి పూజ

వరంగల్ కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆలయాల భూములను కబ్జా చేస్తే ఊరుకోబోమని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. బుధవారం భద్రకాళి దేవస్థానం ఆలయంలో నూతనంగా నిర్మించబోతున్న వేద పాఠశాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే వేలాది ఎకరాలు దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వేల కోట్ల ఆస్తులు కబ్జా చేశారని, వాటి వివరాలను సేకరించి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అన్నారు. ఇప్పటివరకు ఆలయ ఆస్తులను ఆక్రమించిన వారు తిరిగి అందజేసి తమ గౌరవాన్ని కాపాడుకోవాలనిని మంత్రి హితవుపలికారు. లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాలకు చెందిన భూములు ఎక్కడ ఉంటే అక్కడ వేద పాఠశాలలు, గోశాలలు, ధ్యాన మందిరాలు, ప్రవచన మండపాలు నిర్మిస్తామని, ఇందుకు తగిన నిధులు సైతం సమకూరుస్తామని అన్నారు. ఇందులో భాగంగానే భద్రకాళి దేవస్థానం భూమిలో వేద పాఠశాల నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. అంతేగాకుండా రూ.3కోట్లతో వేద పాఠశాల, రూ.30 కోట్లతో మాడవీధుల నిర్మాణం, నాలుగువైపులా రాజగోపురాల నిర్మాణం చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఉమ్మడి వరంగల్ జిల్లాను కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేస్తామని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా నగరాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కేఎల్.సంధ్యారాణి, సహాయ కమిషనర్ సునిత, దేవాదాయ శాఖ డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, ఈవో శేషు భారతి, వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ శివసుబ్రమణ్యం, అర్చకులు భద్రకాళి శేషు, చెప్పల నాగరాజు శర్మ, సత్యం, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రకాళి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం నియవింతులయ్యారు. ఈ మేరకు బుధవారం మంత్రి సురేఖ గెజిట్ విడుదల చేశారు.



వేద పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నెల రోజుల్లో పాలక మండలి

భద్రకాళి అమ్మవారి దేవస్థానానికి నెల రోజుల్లో పాలక మండలిని ఏర్పాటు చేస్తామని మంత్రి సురేఖ తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆలయానికి 12 సంవత్సరాలుగా పాలక మండలి లేదని, రెండుసార్లు గెజిట్ నోట్ విడుదల చేశారని, అయినా కమిటీ ఏర్పాటు కాలేదని మంత్రి దృష్టికి తీసుకురాగా నెలరోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

109 చలాన్లు.. రూ.26,310 జరిమానా

- ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారుడు
- పెండింగ్ రశీదులను అందజేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు



పెండింగ్ రశీదులతో వాహనదారుడిని చూపిస్తున్న సీఐ సీతారెడ్డి

వరంగల్ క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ... జరిమానాలను ఎగవేస్తున్న ఓ వాహనదారుడు 109 పెండింగ్ చలాన్లతో శుక్రవారం హనుమకొండ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అశోక జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన బిక్షపతి అనే వ్యక్తి ద్విచక్ర వాహనం (టీఎస్ 03 ఈఎస్ 9020)పై వస్తుండగా అతడిని ఆపి తనిఖీ చేశారు. ఆ వాహనంపై 109 పెండింగ్ చలాన్లు ఉన్నట్టు గుర్తించారు. 109 చలాన్లపై ఉన్న రూ.26,310 తక్షణమే చెల్లించాలని కోరుతూ పెండింగ్ చలాన్ల రశీదు పేపర్‌ను అందించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చలాన్లు చెల్లించిన అనంతరం వాహనం తీసుకవెళ్లాలని సదరు వాహనదారుడికి సూచించారు. కాగా, ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడంతో పాటు మరి కొన్ని ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘించినందుకు గాను పోలీసులు ఆన్‌లైన్‌లో విధించిన జరిమానాల మొత్తం రూ.26,310కు చేరడం విశేషం.



శరవేగంగా కొనసాగుతున్న ఎల్కతుర్తి చౌరస్తా సర్కిల్ పనులు

'ఎల్కతుర్తి'కి నయాలుక్

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు ముఖ ద్వారంగా ఉన్న ఎల్కతుర్తి కూడలికి మహర్దశ పడుతోంది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 'కుడా' రూ. 4.50 కోట్లతో జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టింది. హనుమకొండలో ఉన్న సర్కిల్‌లను తలదన్నేలా ఎల్కతుర్తి చౌరస్తా సర్కిల్ ఉండే విధంగా డిజైన్ చేసి పనులకు, ప్రణాళికలు సిద్ధం చేశారు. భారీ స్థాయిలో చేపడుతున్న పనులు అప్పుడే ఆకట్టుకుంటున్నాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పర్యవేక్షణలో నిత్యం 'కుడా' అధికారులు పనులను పరిశీలిస్తున్నారు. మరో వారం రోజుల్లో చౌరస్తా సర్కిల్ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. జంక్షన్ సిద్ధమైతే ఎల్కతుర్తి నయా లుక్‌తో అలరిస్తుంది.

-ఆంధ్రజ్యోతి, ఎల్కతుర్తి



ప్రమాదానికి గురైన కారు ముందు భాగం



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శివసాయి (ఫైల్)

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ● ఐనవోలు మండలం పంథినిలో ఘటన

ఐనవోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి పంథిని గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన చింతకింది శివసాయి(29) ఖమ్మంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గోదావరిఖనిలో శుభకార్యం ఉండగా మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నుంచి కారులో ఒక్కడే బయలుదేరాడు. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ పంథిని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపాడు. ఎదురుగా వాహనం రావడంతో లైట్ల వెలుతురులో ఆగి ఉన్న లారీ కనిపించని కారణంగా శివసాయి కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. కారు నడుపుతున్న శివసాయి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శివసాయి మృతదేహాన్ని బయటికి తీసి ఎంజీఎంకు తరలించి ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించారు. మృతుడికి తల్లిదండ్రులు రాజమణి-రమేష్‌బాబు, ఇద్దరు అక్కలు ఉన్నారు. యువకుడి మృతిని బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

ఎల్కతుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల సుధాకర్ (35) అనే కూలీ వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇల్లందుల సుధాకర్ గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తాను పెంచుకుంటున్న మేక పిల్లలకు గడ్డిని కోసుకు రావడానికి బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మేడుదుల భాస్కర్ వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మీ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతుడు ఇల్లందుల సుధాకర్

ఇరువర్గాలపై కేసులు

నల్లబెల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న శాయంపేట మండలానికి చెందిన ఓ ప్రేమ జంట మండలంలోని శనిగరం గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో తలదాచుకున్నారు. విషయం తెలుసుకున్న అమ్మాయి బంధువులు మంగళవారం సాయంత్రం శనిగరం గ్రామానికి చేరుకొని గొడవ చేయగా, శనిగరానికి చెందిన వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం అందరూ కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల మధ్యన మాటమాట పెరిగి కొద్దిసేపు తీవ్రమైన ఘర్షణ నెలకొంది. అనంతరం పోలీసులు శాంతింపజేసి ఇరువర్గాల వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా రెవెన్యూ సదస్సులు

● రెండో రోజు భారీ స్పందన ● పెద్ద ఎత్తున దరఖాస్తుల సమర్పిస్తున్న రైతులు ● హనుమకొండ జిల్లాలో 1220 స్వీకరణ

హనుమకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులు రెండోరోజు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో బుధవారం 1,220 దరఖాస్తులు దాఖలయ్యాయి. మంగళవారం 1,407 దరఖాస్తులు వచ్చింది తెలిసిందే. దీంతో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తులసంఖ్య 2,627కు పెరిగింది. కాగా వరంగల్ జిల్లాలో 13 మండలాలకు గాను పన్నెండింటిలోరి 23 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.



హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేస్తున్న రైతులు

హనుమకొండ జిల్లాలో..

భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌లో, ధర్మసాగర్ మండలం జానకీపూర్‌లో, ఎల్కతురి మండలం తిమ్మాపూర్‌లో, హనుమకొండ మండలం వడ్డెపల్లిలో, ఐనవోలు మండలం వనమాలకనపర్తిలో, కమలాపూర్ మండలం జూజునూరులో వేలేరు మండలం మల్లికుదుర్లలో కాజీపేట మండలం సోమిడిలో హసన్‌పర్తి మండలం నాగారంలో, దామెర మండలం సింగరాజుపల్లిలో, ఆత్మకూరు మండలం అక్కెంపేటలో, పరకాల మండలం వెంకటాపూర్‌లో, శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో రెవెన్యూ సదస్సులు జరిగాయి.

నేడు సదస్సులు జరిగే గ్రామాలు

మూడోరోజు గురువారం రెవెన్యూ సదస్సులు జరగనున్న గ్రామాలు. భీమదేవరపల్లి మండలంలో గట్లకానిపర్తి, ధర్మసాగర్ మండలంలో ముప్పారం. ఎల్కతుర్తి మండలంలో వీరనారాయణ పురం, హనుమకొండ మండలంలో లష్కర్ సింగారం, ఐనవోలు మండలంలో పంథిని, కమలాపూర్ మండలంలో అంబాల, వేలేరు మండలంలో సోడషపల్లి, కాజీపేట మండలంలో కాజీపేట, హసన్‌పర్తి మండలంలో ముచ్చర్ల, దామెర మండలంలో ల్యాదెల్ల, ఆత్మకూరు మండలంలో పెద్దాపూర్, పరకాలమండలంలో నాగారం, శాయంపేట మండలంలో నేరేడుపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి.

వరంగల్ జిల్లాలో ..

వరంగల్ జిల్లాలో కూడా రెండోరోజు 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 2,627 దరఖాస్తులు దాఖలయ్యాయి. రాయపర్తి మండలంలో కొండూరు, బుర్హాన్‌పల్లి, పర్వతగిరి మండలంలోని రావూరు, బూర్గుమడ్ల, ఖిలా వరంగల్ మండలంలోని ఉర్సు, అల్లిపూర్, వరంగల్ మండలంలో మట్టెవాడ, సంగెం మండలంలో కాట్రపల్లి, చింతలపల్లి, చెన్నారావుపేట మండలంలో చెన్నారావుపేట, జల్లి, దుగ్గొండి మండలంలో చలపర్తి, మందపల్లి, నర్సంపేట మండలంలో పసునూరు, కమ్మపెల్లి, నల్లబెల్లి మండలంలో గుండ్లపహాడ్, రామతీర్థం, గీసుకొండ మండలంలో బొడ్డుచింతలపల్లి, రామచంద్రాపూర్, నెక్కొండ మండలంలో గుండ్రపల్లి, పత్తిపాక, కూనూర్ మండలంలో రంగంపేట, కొత్తూరు గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు జరిగాయి.

నేడు సదస్సులు జరగనున్న గ్రామాలు

రాయపర్తి మండలంలో కేశవాపూర్, కొలన్‌పల్లి, పర్వతగిరి మండలంలో రోళ్లకల్, గోపనపల్లి, ఖిలా వరంగల్ మండలంలో రంగశాయిపేట, మామునూరు, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో కాపులకనపర్తి, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో లింగగిరి, కోనాపురం, దుగ్గొండి మండలంలో రేకనపల్లి, తొగర్రాయి, నర్సంపేట మండలంలో లక్నెపల్లి, మహేశ్వరం, మహిర, నల్లబెల్లి మండలంలో నారక్కపేట, రంగాపూర్, గీసుకొండ మండలంలో ధర్మారం, అనంతారం, నెక్కొండ మండలంలో సూరిపల్లి, చిన్నకోర్పోలు, ఖానాపూర్ మండలంలో ఐనపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి.

సమ్మెను విజయవంతం చేయాలి..

సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

హనుమకొండ చౌరస్తా, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీఐటీయూ బిల్డింగ్ యూనియన్ సమావేశంలో ఉప్పలయ్య పాల్గొని మాట్లాడారు. మే 20న జరగాల్సిన దేశవ్యాప్త కార్మిక, ప్రజా సార్వత్రిక సమ్మె కొన్ని అనివార్య కారణాల వలన జూలై 9న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ అన్ని వర్గాల కార్మికులను చైతన్యం చేస్తామన్నారు. అదే విధంగా 2025 నవంబరులో రాజస్థాన్ రాష్ట్రం శిఖార్‌లో కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ అఖిలభారత మహాసభల ఏర్పాటుతో పాటు సెప్టెంబర్‌లో భద్రాచలంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్న తరుణంలో హనుమకొండ జిల్లా మహాసభలు, మండల మహాసభల అడ్డా కమిటీలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేస్తామని ఉప్పలయ్య తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, సభ్యులు బండ్ల శ్రీనివాస్, వల్లెపు లింగమూర్తి, రాజు, మల్లయ్య, కుమారస్వామి, సాంబయ్య, మేషయ్య, మహిళా నాయకురాలు రాధ, అనిత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

ఉద్యోగ పరీక్షలకు ఉచిత శిక్షణ

హనుమకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏటూరు నాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన గిరిజన అభ్యర్థులను స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, ఎంపికైనవారికి కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు గ్రూప్స్, పోలీసు, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్‌సీ, ఇతర ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ఫౌండేషన్ శిక్షణను రెసిడెన్షియల్ పద్ధతిలో ఇవ్వనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గతంలో ఎలాంటి శిక్షణ పొందని ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి స్క్రీనింగ్ పరీక్ష ఎంపికకు studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తుల దాఖలుకు గడువు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అనుభవం కలిగిన నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7569951515, లేదా 8328546015 నెంబర్లకు ఫోన్ చేసి కనుగొనవచ్చునన్నారు.

రైళ్లకు అడ్డంగా రాళ్లు పెట్టిన వారిపై కేసు

కాజీపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైళ్లకు అడ్డంగా రైలు పట్టాలపై రాళ్లు పెట్టిన వారిని అదుపులోకి తీసుకుని వారిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసు నమోదు చేశారు.. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సి. చటర్జీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జూన్ 1న సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్ 320 గేట్‌వద్ద చత్తీస్‌గడ్‌కు చెందిన చంచల్ మార్కం, మల్లేశ్వర్ అనే ఇద్దరు వ్యక్తులు రైలు పట్టాలపై పెద్ద పెద్ద రాళ్లు పెట్టారు. సమయస్ఫూర్తితో లోకోపైలెట్ దూరంగానే గమనించి రైళ్లు ఆపారు. సమాచారం అందుకున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ బృందం ట్రాక్‌పై ఉన్న రాళ్లను తొలగించారు. కేసు నమోదు దర్యాప్తు చేసి ఈ నెల 2న నిందితులను హైదరాబాద్‌లో అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన మాలోతు శోభన్‌బాబు (35) కూలీ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

టీజీటీఎస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్

హనుమకొండ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిజిటల్ ప్రచారానికి, పార్టీ కార్యాచరణను సామాజిక మాధ్యమాల్లో సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర సోషల్ మీడియా విభాగం, టీజీటీఎస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్ కోరారు. బుధవారం వరంగల్ పశ్చిమ సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మార్గదర్శనంలో ఇన్సూరెన్స్, ఐడెంటిటీ కార్డులు, ప్రత్యేక డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోషల్ మీడియా అనేది ఈ కాలంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చేరవేసే ప్రధాన వేదికగా మారిందన్నారు. ఈ విభాగంలో పనిచేసే యువతను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి మహ్మద్ నేహాల్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, ఈవీశ్రీనివాస్‌రావు, బైరబోయిన రమేశ్ యాదవ్, బి.రమేశ్, రోషన్ గైక్వాడ్, సాయికృష్ణ, సురేందర్, భరత్, రమేశ్ పాల్గొన్నారు.

హరీష్‌రావుకు నేతల పుట్టిన రోజు శుభాకాంక్షలు

హనుమకొండ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీష్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌నేతలు బుధవారం హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో హరీష్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..

మౌలిక సదుపాయాలకు నివేదిక సమర్పించాలి..

వైద్యులకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశం

కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తనిఖీ

వరంగల్ మెడికల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శాశ్వత ప్రాతిపదికన అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నివేదిక సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. బుధవారం కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఆలస్యంగా విధులకు హాజరైన ఇద్దరు డాక్టర్లు, హెడ్ నర్సు నుంచి సంజాయిషీ కోరాలని ఆదేశించారు. ఆస్పత్రి మొత్తం డాక్టర్లు, అధికారులతో కలియ తిరిగారు. ఆస్పత్రికి కావాల్సిన అవసరాలు, అందుతున్న వైద్య సేవలను రోగులను నేరుగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో శానిటేషన్, సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ తదితర సమస్యలను అధిగమించేందుకు, వివిధ విభాగాల ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులతో నియమించిన బృందం, పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిలో శాశ్వత ప్రాతిపదికన అవసరమయ్యే అవసరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈనెల 6 నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఫార్మసీలో ఈ - ఔషధీ ప్రకారం మందుల నిల్వలను పరిశీలించి, హీటింగ్ వెంటిలేషన్ ఎయిర్ కండీషన్ సిస్టమ్ మరమ్మతులతోపాటు ఆపరేషన్ థియేటర్‌లో ఎయిర్ కండీషన్లు ఏర్పాటు చేయాలన్నారు. 5 అంతస్థులు గల ఆపరేషన్ థియేటర్ ఈనెల 10వ తేదీ లోగా రోగులకు అందుబాటులో తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మురళి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

రాహుల్ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మిల్స్‌కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతాడని జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కలలు కంటున్నారని, అవి ఎప్పటికీ నిజం కావని బీజేపీ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవా చేశారు. '11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం - సంకల్పంతో అభివృద్ధి సాకారం' అనే అంశంపై బుధవారం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 ఏళ్ల మోదీ పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. దేశంలో 60 ఏళ్ల కాలంలో జరగని ఎన్నో అభివృద్ధి పనులను 11 ఏళ్లలో చేసి చూపిన ఘనత మోదీదే అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిబుల్ తలాక్ రద్దు, వక్ఫ్ సవరణ, అయోధ్య రామమందిర నిర్మాణం తదితర సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలి

తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న తాడూరి శ్రీనివాస్

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కారు రావాలని తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు తాడూరి శ్రీనివాస్ అన్నారు. '11 ఏళ్ల మోదీ ప్రభుత్వం-సంకల్పంతో సాకారం' అనే అంశంపై హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 11 ఏళ్ల పాలనలో ఒక్క రూపాయి అవినీతి లేకుండా ప్రధాని మోదీ పాలన కొనసాగించారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.10లక్షల కోట్ల అప్పుల భారం మోపిందన్నారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ హామీ నెరవేర్చారో ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు విశ్వసిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను, అవినీతిని బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఎంపీ సీతారాంనాయక్, నాయకులు చాడ శ్రీనువాస్‌రెడ్డి, పగడాల కాళీప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, తదితరులు పాల్గొన్నారు.

చౌకగా పుస్తకాల బట్వాడా

మే నుంచి ప్రారంభమైన తపాలా శాఖ జ్ఞాన్ పోస్టు సర్వీస్

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ గత నెల 1వ తేదీ నుంచి జ్ఞాన్ పోస్టు సర్వీస్‌ను ప్రారంభించినట్లు హనుమకొండ డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ ద్వారా పుస్తకాలను, స్టడీ మెటీరియల్‌ను చాలా తక్కువ ధరకు పంపుకోవచ్చు. ప్రభుత్వం గుర్తించిన ఎడ్యుకేషనల్ బోర్డులు, యూనివర్సిటీలు, అటానమస్, స్టాట్యుటరీ బాడీస్‌కు చెందిన పుస్తకాలు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సంబంధించిన పుస్తకాలు, దేశ చట్టాలకు లోబడి ముద్రించిన, లేదా విడుదల చేసిన సాంఘిక, సామాజిక, ధార్మిక స్వభావం కలిగిన పుస్తకాలను ఈ జ్ఞాన్ సర్వీస్ ద్వారా పంపవచ్చు. ఇలాంటి పుస్తకాల ప్యాకెట్లపై జ్ఞాన్ పోస్టు అని పేర్కొనాలి. జ్ఞాన్‌పోస్టు ద్వారా పంపిన పుస్తకాలు, ఇతర ముద్రిత ఎడ్యుకేషన్ మెటీరియల్ ట్రాక్ చేయబడుతుంది. వీటిని తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా తపాలాశాఖ బట్వాడా చేస్తుంది. 300 గ్రాముల బరువు వరకు కనిష్ట చార్జి, 5 కిలోల బరువు వరకు గరిష్ట చార్జీ వసూలు చేస్తారు. పోస్టేజీ చార్జి రూ.20 నుంచి ప్రారంభమై గరిష్టంగా రూ.100వరకు ఉంటుంది (పన్నుల వర్తింపును బట్టి) అని సూపరింటెండెంట్ తెలిపారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ వాడకం



హనుమకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాతావరణ కాలుష్యం క్రమంగా పెరుగుతోంది. పదేళ్లకాలంలో ఈ క్షీణత రెండు నుంచి మూడింతలు పెరిగింది. పెరుగుతున్న జనాభా, శరవేగంగా పట్టణీకరణ, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం, ఎడాపెడా చెట్లను నరికివేడయం, అడవుల క్షీణత, అధ్వాన్నంగా డంపింగ్ యార్డుల నిర్వహణ, ఇష్టారాజ్యంగా క్వారీల నిర్వహణ, అస్తవ్యస్తమైన మురుగుపారుదల వ్యవస్థ మొదలైనవి ఇందుకు కారణం అవుతున్నాయి. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిస్థితిపై ప్రత్యేక కథనం.

జనాభా పెరుగుదల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దశాబ్దకాలంలో జనాభా గణనీయంగా పెరిగింది. పదేళ్లలో పట్టణ జనాభా కూడా గణనీయంగా పెరిగింది. పెరిగిన జనాభా ఫలితంగా వివిధ కాలుష్య కారకాల వల్ల పర్యావరణం క్షీణిస్తోంది. మానవ అవసరాలు ఎక్కువగా పర్యావరణం ద్వారా తీర్చుకుంటున్నందు వల్ల అన్ని సహజ వనరులు క్రమంగా ఒడిసిపోతున్నాయి. ఈ వనరులు ఎక్కువగా పునరుత్పాదకమైనవి అయినప్పటికీ, మానవ అవసరాలకు, పునరుత్పత్తికి మధ్య ఏర్పడుతున్న వ్యత్యాసంవల్ల సమతుల్యత దెబ్బతింటోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అదే జరుగుతోంది.



డంపింగ్ యార్డులు

పర్యావరణ క్షీణతకు డంపింగ్ యార్డులు కూడా కారణం అవుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ప్రతీరోజు సేకరించే చెత్తను శాస్త్రీయంగా తొలగించకపోవడం వల్ల అవి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు వెయ్యిమెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని అంచనా. ఒక్క వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోనే నిత్యం 450 మెట్రిక్ టన్నుల చెత్తపోగవుతోంది. ఇలా వెలువడే చెత్తను శివార్లలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మరికొంత చెత్తను శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ ఖాళీస్థలాల్లో, రహదారుల పక్కన పారవేస్తున్నారు. మడికొండ డంపింగ్ యార్డులో గుట్టల్లా చెత్త పేరుకుపోవడంతో ఆ చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలకు ఇదొక జీవన్మరణ సమస్యగా మారింది. ఈ డంపింగ్ యార్డుల నుంచి వెలువడే దుర్గంధం, ఆ ప్రాంతమంతా జరుగుతున్న వాయుకాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు.

అధ్వాన్నంగా డ్రైనేజీ వ్యవస్థ

ఉమ్మడి వరంగల్‌లో డ్రైనేజీ వ్యవస్థ అత్యంత అధ్వాన్నంగా ఉంది. పట్టణాలల్లో మరీ దారుణంగా ఉంది. పెరిగిన జనాభా వల్ల నీటివాడకం పెరిగి తద్వారా మురుగునీటి సమస్య అంతకంతకూ పెరుగుతోంది. గ్రామ పంచాయతీల్లో, పట్టణాల్లో కాలువలు సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంవల్ల మురుగునీరు రోడ్లపై పారుతోంది. రోజుల తరబడి శుభ్రం చేయకుండా ఉండడంతో కుళ్లిపోయి, వాటి నుంచి విషవాయువులు వెలువడి వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి.



క్వారీలతో కాలుష్యం

పర్యావరణ క్షీణతకు కారకాల్లో ప్రధానంగా క్వారీలు కూడా ఉన్నాయి. క్వారీల వల్ల వాతావరణం కలుషితమై త ద్వారా ఉమ్మడి వరంగల్‌లో పర్యావరణం దారుణంగా దెబ్బతింటోంది. ఉమ్మడి జిల్లాలో 860క్వారీలు నడుస్తున్నాయి. ఇవి కంకర, ఇతరత్రా ఉత్పత్తికి నిత్యం బాంబులతో గుట్టలను పేల్చివేస్తుండడంతో ధ్వని కాలుష్యంతో పాటు వాయికాలుష్యం కూడా కలుగుతోంది. జీవవైవిధ్యానికి నష్టం జరుగుతోంది. క్వారీల వల్ల పర్యావరణపై ప్రభావాలు దీర్ఘకాలంగా ఉంటాయి. క్వారీల వల్ల సహజ కార్బన్ సింక్‌ల నష్టానికి కూడా కారణమవుతున్నాయి. ఇవి వాతావరణ మార్పులకు దారితీస్తున్నాయి. కొం డలను పిండిచేస్తుండడంతో భూమి సహజ స్థితి దెబ్బతింటోంది. పేలుళ్ల వల్ల బండరాళ్లు ఎగిరి వచ్చి సమీపంలో ఉన్న పొలాల్లో పడి పంటలు దెబ్బతింటున్నాయి. రాళ్లదెబ్బలకు ప్రాణాపాయాలు కూడా సంభవిస్తున్నాయి.

కాలుష్య కాసారమవుతున్న నేల

- డంపింగ్ యార్డులతో వాయు కాలుష్యం
- క్వారీలతో జీవి వైవిధ్యానికి ముప్పు
- ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత
- రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం

అవగాహన కార్యక్రమాలు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛంద సంస్థలతో పాటు జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఈనెల 5న అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జనవిజ్ఞానవేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ములుగు జిల్లా అటవీ శాఖ సంయుక్తాధ్వర్యంలో గురువారం ఉదయం 6 గంటలకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపం నుంచి పర్యావరణ ప్రేమికులు ములుగుకు చేరుకుంటారు. అక్కడ ములుగు అటవీశాఖ భవనంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత 9గంటలకు కొత్తూరులోని దేవునిగుట్ట వద్ద ట్రెక్కింగ్ నిర్వహిస్తారు. అడవిలో చెట్ల పరిచయం, పక్షుల సందర్శన ఉంటాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతి థిగా జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ జాదవ్, పర్యావరణ పరిరక్షణ ఐక్య సమితి అధ్యక్షుడు జిల్లా పురుషోత్తం తదితరులు పాల్గొంటారు. కాగా సాయంత్రం 5గంటలకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్లవేణుమాధవ్ కళాప్రాంగణంలో జిల్లాకాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలు, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటాయి. కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత తెలిపారు. పర్యావరణ ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



చెట్ల నరికివేత

చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తుండడం వల్ల కూడా దాని ప్రభావం పర్యావరణంపై పడుతోంది. వనమహోత్సవాల పేరుతో ఒక పక్క చెట్లు నాటుతుండగా మరో పక్క కరెంట్ తీగలకు అడ్డు వస్తున్నాయని విద్యుత్‌శాఖ, భవన నిర్మాణాలకు ఆటంకంగా ఉందని బిల్డర్లు, వెంచర్ల నిర్వహణకు అటంకంగా ఉందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెట్లను ఎడాపెడా నరికి వేస్తున్నారు. కలప స్మగ్లర్లు అడవులును ఇష్టారీతిన నరికివేస్తున్నారు. పోడు వ్యవసాయంతోనూ అడవులు తరిగిపోతున్నాయి. ఇది కూడా పర్యావరణపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది పట్టణీకరణ సైతం పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది.

ప్లాస్టిక్ వాడకం

ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్‌ను ఇష్టారాజ్యంగా వాడుతున్నారు. పర్యావరణం క్షీణించడానికి ప్రధాన కారణాల్లో ప్లాస్టిక్ కాలుష్యం కూడా ఒకటి. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కాలుష్యం, జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పు అనే మూడు ప్రమాదాలు రోజు రోజుకూ తీవ్రం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 5వేల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ చెత్తను నీటి వాతావరణంలోకి వదులుతున్నారు. ఒక్క వరంగల్ నగరంలోనే 500 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వాడకం జరుగుతోంది. ఇదంతా పర్యావరణలో కలుస్తోంది. మైక్రోప్లాస్టిక్‌లు నేలలో పేరుకుపోయి పర్యావరణ నష్టాన్ని కలిగిస్తున్నాయి.



ప్లాస్టిక్ వాడ కాన్ని అరికట్టడంలో వరంగల్ నగర పాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు దారుణంగా విఫలమవుతున్నాయి.

'సాదా బైనామా' సంగతి తేలేనా!?

5వ పేజీ తరువాయి

జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన సాదా బైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తుందనే ఆశతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సాదా బైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. గత ప్రభుత్వం కేవలం జీవోలతోనే సరిపెట్టిందని, సాదాబైనామాలపై తహసిల్దార్‌లకు అధికారాలు ఇచ్చినప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు సరైన మార్గదర్శకాలను విడుదల చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

ఇక కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా రైతు సమస్యలు పరిష్కరించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు పైలట్ మండలాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 13,319 దరఖాస్తులు వస్తే వీటిలో సాదా బైనామాల కోసమే 8,860 దరఖాస్తులు పెట్టుకున్నారు. దాదాపు 65శాతం మంది రైతులు సాదా బైనామాల కోసమే ఆశతో ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు అసైన్డ్ భూముల కోసం 3,453 దరఖాస్తులు చేసుకున్నారు. ఈ రెండు దరఖాస్తులు 12,313 ఉన్నాయి. అంటే దాదాపు 90శాతంకు పైగా సాదా బైనామాలు, అసైన్డ్ భూముల సమస్యలే రైతులను వేధిస్తున్నాయని టాక్ వినబడుతోంది. 2020లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్వోఆర్ 2020 చట్టాన్ని తీసుకవచ్చినప్పుడు, సాదా బైనామాల పరిష్కారం కోసం మార్గదర్శకాలు విడుదల చేయలేదు. సాదా బైనామాల దరఖాస్తులపై కోర్టుకు చేరటంతో ప్రస్తుతం వాటిని పరిష్కరించే అవకాశం లేకుండా పోయింది.

పరిష్కారం.. తిరస్కారం

రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి భారీ మొత్తంలో దరఖాస్తులు వస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టుల్లో కూడా భారీగా దరఖాస్తులు వస్తున్నప్పటికి అంతేస్థాయిలో తిరస్కరణకు గురవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం దరఖాస్తుతో పాటు ఆధారాలు జత చేయకపోవటమేనని అధికారులు పేర్కొంటున్నారు. ఉదాహరణకు 2014కు ముందు తెల్లకాగితంపై రామయ్య అనే రైతు రెండు ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అయితే రెవెన్యూ సదస్సులో సాదా బైనామా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుతో పాటు కొనుగోలు సమయంలో రాసుకున్న తెల్ల కాగితం జిరాక్స్ జత చేయకుండా దరఖాస్తు చేశారు. ఏలాంటి ఆధారాలు లేకుండా దరఖాస్తులు చేస్తుండటంతో అధికారులు తిరస్కరిస్తున్నట్లుగా సమాచారం. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో 4,555 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా సాదాబైనామాలు, అసైన్డ్ భూముల సమస్యలపైనే దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు సమస్యలపైనే 3,568 దరఖాస్తులు రాగా, ఇతర సమస్యలపై కేవలం 987 దరఖాస్తులే వచ్చాయి. అయితే 4,555దరఖాస్తుల్లో 2,058 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా, 1,841 దరఖాస్తులు మాత్రమే పరిశీలనకు అర్హమైనవి గుర్తించారు. రెండవ విడతలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో మొత్తం 5,112 దరఖాస్తులు రాగా, ఇందులో అత్యధికంగా సాదా బైనామా దరఖాస్తులు 1,999, అసైన్డ్ భూముల దరఖాస్తులు 1,362 ఉన్నాయి. ఈ రెండు సమస్యలపైనే 3,361 దరఖాస్తులు వచ్చాయి. మిగతా దరఖాస్తుల్లో వివిధ కారణాలతో 409 దరఖాస్తులను తిరస్కరించారు. ఇప్పటి వరకు కేవలం 152 దరఖాస్తులనే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పైలట్ ప్రాజెక్టు మండలాల్లో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు

అంశం	వర్ధన్నపేట	నడికూడ	రేగొండ	ఘనపూర్(స్టే)	వెంకటాపూర్	దంతాలపల్లి
సాదా బైనామా	1,415	1,456	1,999	980	2,809	201
అసైన్డ్‌భూములు	746	481	1,362	45	759	60
వారసత్వ మార్పిడి	192	223	290	183	395	56
విస్తీర్ణంలో తేడాలు	155	134	338	102	101	51
డీఎస్ పెండింగ్	45	331	247	37	100	20
మ్యుటేషన్‌పెండింగ్	32	16	06	60	20	23
సర్వేనెంబర్లు మిస్సింగ్	30	08	23	268	100	37
ఇనామ్- ఓఆర్‌సీ జారీ	28	119	00	07	01	07
భూ వివరణ	22	00	01	17	203	02
భూ సేకరణ	05	14	08	26	03	29
పేరు సరి చేయడం	04	21	19	11	21	22
నిషేధిత జాబితా	01	07	03	38	24	10
38 ఈ ధ్రువపత్రం	01	00	00	00	19	00
ఇతర దరఖాస్తులు	241	88	816	158	00	108
మొత్తం	2,197	2,898	5112	1932	4,555	625

'రైతు నమోదు'తో ప్రయోజనాలెన్నో..

- అన్నదాతలకు చేకూరనున్న పలు పథకాలు
- నత్తనడకన కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- అవగాహన కల్పిస్తున్నామంటున్న వ్యవసాయాధికారులు

బచ్చన్నపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో విశిష్ట గుర్తింపు కార్డులను ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు నమోదు) పేరిట జారీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు సంబంధించిన లబ్ధి పొందాలంటే 11 అంకెల యూనిక్ నంబర్ ఉన్న కార్డును రైతులకు జారీ చేస్తున్నారు. కాగా జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నత్తనడకన కొనసాగుతుందనే విమర్శలు వస్తున్నాయి. రైతులకు పూర్తిస్థాయిలో నమోదు ప్రక్రియపై అవగాహన లేకపోవడం, భూముల వివరాలు ఇస్తే, ఏదైనా సమస్య ఉత్పన్నం అవుతుందోననే భయంతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,96,768 మంది రైతులుండగా, ప్రారంభించి 25 రోజులు దాటినా ఇప్పటి వరకు 30,380 మంది రైతులు మాత్రమే వివరాలు అందించి పేర్లు నమోదు చేసుకున్నారు. కేంద్ర పథకాలకు ఇదే కార్డు ప్రామాణికం కావడంతో వ్యవసాయాధికారులు మరింత విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాసు పుస్తకంలోని వివరాల నమోదు ద్వారా అధికారులు కార్డులను జారీ చేస్తున్నారు.



బచ్చన్నపేటలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏవో

ప్రధానమంత్రి కిసాన్ పథకం, పంటల బీమాతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ కార్డు ఉపయోగపడనుంది. రైతులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవడం ద్వారానే ప్రయోజనం పొందగలుగుతారని వ్యవసాయాధికారులంటున్నారు. రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణాధికారులను కలవాలంటున్నారు. నమోదు అనంతరం ఫోన్‌కు వచ్చే ఓటీపీని ధ్రువీకరించుకుని విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో బచ్చన్నపేటలో 19,270 మంది రైతులకు 3,878, లింగాలఘనపురం 17,674 రైతులకు 3,486, నర్మెట 11,198 మందికి 2,175, తరిగొప్పుల 8,795 రైతులకు 1,606, పాలకుర్తి 24,118 మందికి 3,729, కొడకండ్ల 10,609 మందికి 1,576, రఘునాథపల్లి 22,348 రైతులకు 3,302, స్టేషన్‌ఘన్‌పూర్ 15,443 మంది రైతులకు 2,268, చిలుపూర్ 13,920 రైతులకు 1,952, దేవరుప్పుల 18,127 రైతులకు 2,346, జనగామ 18,778 రైతులండగా 2,307, జఫర్‌గడ్ 16,488 రైతులకుగాను 1,755 మంది రైతులు రిజిస్ట్రీ చేయించుకున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరి చేయడంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు దీనికి గడువు నిర్ణయించలేదు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఏఈవోల ద్వారా రిజిస్ట్రీ చేయిస్తున్నాం. పీఎం కిసాన్‌తో పాటు పలు పథకాలకు లబ్ధి పొందాలంటే వెంటనే రిజిస్ట్రీ చేయించుకోవాలి.

- రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి

ఇలా కడితేనే.. ఇందిరమ్మ ఇళ్లు

- సామాన్యుడి సొంతింటి కలకు తూట్లు
- అర్హుల మెడపై నిబంధనల కత్తి
- డిజైన్ మార్చడంతో పునరుద్ధరణ పనుల్లో దరఖాస్తుదారులు
- ప్రభుత్వ నిబంధనలతో చాలా శాతం అనర్హులుగా మిగిలే అవకాశం



నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దరఖాస్తుదారులపై నిబంధనల కత్తి వేలాడుతోంది. ఇలా కడితేనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో సామాన్యుడి సొంతింటి కలకు తూట్లు పడినట్లయింది. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం గతంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట రూ.50 వేలు నగదు, రూ.25వేలు విలువ చేసే సిమెంటు బస్తాలు ఇచ్చి ఎంతో మందికి ఇండ్ల నిర్మాణాలను చేయించి అందించాడు. కానీ, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తున్న సంబురమే తప్ప, ప్రభుత్వ విధించిన నిబంధనలతో చాలామంది అనర్హులుగా మిలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హుల మెడపై నిబంధనల కత్తి..

సొంతింటిని నిర్మించుకుని తన కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలనే అర్హులు.. ప్రభుత్వం పెట్టిన నిబంధనలు పాటించాల్సిందే. తన ఇష్టానుసారంగా ఇంటిని నిర్మించుకుంటానంటే కుదరదు. బాత్‌రూమ్ ఎక్కడుండాలి.. గది వైశాల్యం ఎంతుండాలి.. పూర్తి స్లాబ్ విస్తీర్ణం ఎంతుండాలి.. అనేవి అంతా ప్రభుత్వ అధికారుల ఇష్టానుసారమే. ఆదమరిచి ఒక్క ఫీటు జరిగినా అనర్హుడిగా ఎంపిక చేస్తారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ తీసుకువచ్చిన యాప్ ద్వారా ముగ్గు పోసినపుడు ఫొటో తీసుకుని, బేస్‌మెంట్ వేసిన తర్వాత యాప్ ద్వారా ఫొటో, కొలత తీసుకుని ల్యాండ్ ట్యూడ్, ల్యాట్యూటూడ్ చూసి జనరేట్ చేస్తారు. ఇలా యాప్ తీసుకుంటేనే బిల్లు జనరేట్ జరిగిన లబ్ధిదారుడికి పథకం వర్తించి, డబ్బులు ఖాతాలో జమయ్యేలా నిబంధన తీసుకొచ్చారు. ఇలా 400-600లోపు చదరపు అడుగులకు మించకుండా ఇంటిని నిర్మిస్తున్నట్లు యాప్ గుర్తిస్తేనే అర్హుడిగా ఎంపికవుతారు.

నిబంధనలు ఇలా..

రూ.50వేల కంటే ఎక్కువ క్రాప్‌లోన్ ఉంటే అనర్హులు. కుటుంబం మొత్తం రెండున్నర ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉంటే అనర్హులు. కుటుంబంలో ట్రాక్టర్ ఉన్న, ఐటీ రిటర్స్ కట్టినా, స్లాబ్ ఇంట్లో ఇప్పటికే నివాసమున్న, 60 గజాలకు మించి ఇంటిని నిర్మించిన అనర్హులుగా పరిగణింపబడతారు. దీనికి తోడు గతంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను సైతం ఆధార్ కార్డు ఆధారంగా గుర్తిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి ప్రభుత్వ నిబంధనలతో చాలా శాతం అనర్హులుగా మిగిలే అవకాశం లేకపోలేదు. దీంతో తమ సొంతింటిని ఎంతో అందంగా నిర్మించుకుందామని అనుకున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇదో శాపంగా మారిందని స్థానికులు చెపుతున్నారు. మరో పక్క అధికారులు మాట్లాడుతూ.. పారదర్శకంగా అసలైన వారిని గుర్తించాలని, గతంలో అవకతవకలు జరిగిన విషయాలను ఆలోచించే ఇలాంటి నిబంధనలు పెట్టారని అభిప్రాయపడుతున్నారు.

పునరుద్ధరణ పనుల్లో దరఖాస్తుదారులు

ప్రభుత్వం మొదటగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పలు నిబంధనలు పెట్టి ఇంటిని నిర్మించుకుంటే రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించింది. దీంతో అర్హులైన కొందరు వ్యక్తులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఇంటి నిర్మాణానికి ముందడుగేశారు. కానీ, మళ్లీ ప్రభుత్వం డిజైన్ మార్చడంతో దరఖాస్తుదారులు పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వస్తుందనే ఆశతో తన ఇష్టానుసారంగా ఇంటిని నిర్మించేందుకు పునాదులు తీసుకుని, పిల్లర్లు వేసేందుకు ప్రయత్నించాడు. నిబంధనల సడలడంతో వాటిని పునరుద్ధరించే పనిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా ఇంకా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తాత్సారం జరుగుతుండడంతో పనులకు బ్రేక్ పడింది. తమ పేరు మంజూరయ్యాక పనులు ప్రారంభించేలా లబ్ధిదారులు వేచి చూస్తున్నారు.

ఆర్టీసీ కండక్టర్లకు టార్గెట్

- నగదు డబ్బుల కోసం అధికారుల వేధింపులు
- మహిళా కండక్టర్లకు అర్ధరాత్రి డ్యూటీలు
- ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలోని 9డిపోలలో కండక్టర్లకు ఉన్నతాధికారులు టార్గెట్లు విధిస్తున్నారు. అదనపు డబ్బులు తీసుకురావాలని టార్గెట్‌లు పెట్టడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసికంగా కుంగిపోతున్నారు. ఈ మేరకు అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారని పలువురు కండక్టర్లు కన్నీరు పెట్టుకుంటున్నారు.

మహాలక్ష్మితో తగ్గిన నగదు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి విషయం తెలిసిందే. దీంతో కండక్టర్లు ఆధార్ కార్డులు చూపిస్తే జీరో టికెట్ కొట్టిస్తున్నారు. దీంతో మహిళల బస్సు ప్రయాణం పెరిగింది. పలు రూట్లల్లో మహిళలు అధిక సంఖ్యలో రావడంతో బస్సులో సీట్లు దొరకక నిల్చొని వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. పురుషులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే సీట్లు సరిపోకపోవడంతో నగదు ఆదాయం తగ్గుతోందని ఆర్టీసీ కండక్టర్లు పేర్కొంటున్నారు. మహిళలకు జీరో టికెట్ కొడుతున్నప్పటికీ ఎక్కువ నగదు డబ్బులు ఎందుకు తీసుకురావడంలేదని వరంగల్ రీజినల్‌లోని డిపోల అధికారులు కండక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోతున్నారు. కొంతమంది అధికారులు మహిళలను ఎక్కించుకోవద్దని బాహటంగానే చెబుతున్నారని కండక్టర్లు వాపోతున్నారు.

కండక్టర్ల అసహనం

వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోలలో పనిచేస్తున్న ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు.. అధికారులు పెడుతున్న టార్గెట్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో మహిళా కండక్టర్లకు డ్యూటీలు వేస్తుండడంతో పలుమార్లు అధికారులతో వాగ్వాదం జరుగుతోందని కండక్టర్లు వాపోతున్నారు. నాలుగు రోజుల కిందట ఓ మహిళా కండక్టరును రాత్రి 8.30గంటలకు హనుమకొండ నుంచి ఖమ్మం రూట్‌లో బస్సు సర్వీస్‌లు నడిపించగా సదరు కండక్టర్ వెళ్లనని చెప్పినా వినకుండా గొడవ చేసి బలవంతంగా రాత్రివేళల్లో డ్యూటీలు వేస్తున్నారని కండక్టర్లు వాపోతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

మహాలక్ష్మి పథకం ద్వారా జీరో టికెట్‌తో ఒక వైపు ఆదాయం తీసుకొస్తున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాత్రం అధికారులు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. నగదు రూపకంగా టార్గెట్లు పెడుతూ కండక్టర్లను బెదిరిస్తున్నారని, మహిళలు ఉన్నచోట బస్సు ఆపకుండా వెళ్లాలని ఆదాయం వచ్చే మార్గాలను చూసుకోవాలని అధికారులు చెబుతున్నారని అలాంటి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని పలువురు కండక్టర్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

టైల్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

న్యూశాయంపేట, జూన్4(ఆంధ్రజ్యోతి) : టైల్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని టైల్స్ అసోసియేషన్ కార్యాలయంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గుండేటి నరేందర్, అధ్యక్షుడిగా షేక్ రాయిసుద్దీన్, ఉపాధ్యక్షుడిగా చెన్నూరి కిరణ్‌రెడ్డి, కార్యదర్శిగా అంబాల శ్రావణ్, ట్రెజరర్‌గా వడ్లమూడి యాకనారాయణ, సహాయ కార్యదర్శి గా పిట్ట భరత్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు షేక్ రాయిసుద్దీన్ మాట్లాడుతూ.. అసోసియేషన్ పురోగతికి శాయశక్తులా పనిచేస్తానన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

మహిళలకు స్వయం ఉపాధికి ఊతం

- రూ.483.50కోట్లు అందించేలా ప్రణాళిక
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో మహిళలు నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 12మండలాల్లో ఉన్న సుమారు 10వేలకుపైగా మహిళా సంఘాల్లోని ఎంపిక చేసిన సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.483కోట్ల 50లక్షలను అందించేందుకు ప్రణాళికా సిద్ధం చేశారు. ఈ యేడు ప్రణాళికలో ఇప్పటివరకు జిల్లాలోని 205సంఘాలకు రూ.29కోట్ల 10లక్షలు రుణాలు ఇచ్చారు. బ్యాంకు లింకేజీ స్త్రీనిధి ద్వారా అందించే ఈ రుణం మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అయ్యేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. టైలర్ షాపు, దుస్తుల విక్రయ షాపు, పాడిపశువుల పెంపకం, కిరాణా దుకాణం, తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు, అలాగే తమ పిల్లలను చదివించేందుకు ఉపయోగించుకుంటున్నారు.

జిల్లాకు మూడు అవార్డులు

జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరనికి రూ.482కోట్ల 66లక్షలు అందించేందుకు ప్రణాళికా సిద్ధం చేయగా లక్ష్యానికి మించి అందించారు. 2024-25లో స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ లక్ష్యం 7,685 సంఘాలకు 482కోట్ల 66లక్షలు.



శాయంపేట మండల సమాఖ్య సమావేశం (పాతచిత్రం)

అందుకుగాను సాధించింది 5,040 సంఘాలకు రూ.509కోట్ల 8లక్షల కాగా, 105.56శాతం సాధించింది. ఇందుకుగాను జిల్లాకు ఓవరాల్ పర్ఫార్మెన్స్ కింద జిల్లా కేటగిరిలో ఒక అవార్డు రాగా, మండల కేటగిరిలో 100కోట్లు లింకేజీ ఇప్పించినందుకు జిల్లాలోని కమలాపూర్ మండలానికి రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది. ఈ అవార్డును ఇటీవల మంత్రి సీతక్క చేతుల మీదుగా హైదరాబాద్ లోని ప్రగతిభవన్‌లో కమలాపూర్ మండల మహిళా సమాఖ్య మహిళలతో కలిసి డీఆర్‌డీఓ మేన శ్రీను అందుకున్నారు. బ్యాంకు కేటగిరిలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఐనవోలు బ్రాంచ్ శాఖకు మరో అవార్డు వచ్చింది.

రుణాలు ఇలా..

మహిళా సంఘాల్లోని సభ్యులు పాడి పరిశ్రమ, క్యాంటీన్లు, దుస్తుల షాపులతోపాటు ఇతర వ్యాపార యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా ఎదిగేందుకు సంఘాల్లోని ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. ఈ అవకాశం మహిళలకు తక్కువ వడ్డీకే రావడంతో సొంతంగా వారికి నచ్చిన వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము బతుకుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. యేటా బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం. స్వయం సహాయక సంఘాలకు యేటా లక్ష్యం నిర్ణయించుకుని రుణాలు అందిస్తాం. ప్రతీనెల రుణాలు చెల్లించడంలో మహిళలు ఆదర్శంగా ఉంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో 100శాతం దాటడంతో రికార్డు సాధించడంతో 3అవార్డులు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం కూడా 100శాతం రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- మేన శ్రీను, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

నేడు కేయూలో వన మహోత్సవం

కేయూ క్యాంపస్ జూన్ 4, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్5న గురువారం వన మహోత్స వం నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లోని కె-హబ్ ప్రాంగణంలో కేయూ ఎన్ఎస్ఎస్, అవెన్యూ ప్లాంటేషన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వన మహోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. వర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగులు, స్కాలర్స్‌తో పాటు విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

అంధకారంలో వడ్డెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి

- వెలగని వీధి దీపాలు..
- ఆందోళనలో వాహనదారులు



వడ్డెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెలగని వీధి దీపాలు

వడ్డెపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్షం రోజుల నుంచి ప్రజలు అంధకారం లోనే మగ్గుతున్నారు. హ నుమకొండ వడ్డెపల్లి- నిరూప్‌నగర్ తండా మధ్య గల రైల్వే ట్రాక్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగకపోవడంతో వివిధ గ్రామాలు, తండాలకు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో ఉన్న గణేష్‌నగర్, నిరూప్‌నగర్, మధు, ఆల్ఫా, పూరిగుట్ట తండాతోపాటు ఆర్టీసీ కాలనీ, నవభారత్ కాలనీ, అన్సార్ కాలనీల ప్రజలు రాత్రివేళల్లో బ్రిడ్జిపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. బల్దియా అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు అమర్చాలని వివిధ కాలనీల ప్రజలు వేడుకుంటున్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం

హనుమకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం 7.30గంటలకు హనుమకొండ సుబేదారిలోని జిల్లా కోర్టుల సముదాయం ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ ఆథారిటీ సెక్రెటరీ ఒక ప్రకటనలో తెలిపారు.



అరకల సాయికుంట వాకర్స్‌తో మాట్లాడుతున్న కొంకా హరిబాబు

అరకల సాయి కుంట ఆధునికీకరణకు కృషి

వడ్డెపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు సహకారంతో హనుమకొండ గోపాల్‌పూర్‌లోని అరకల సాయి కుంటను ఆధునీకీకరణకు కృషి చేస్తానని 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు అన్నారు. బుధవారం అరకల సాయికుంట వాకర్స్ ఆధ్వర్యంలో చెరువుకట్టపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుకట్టపైఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపుతోపాటు చెరువు శుద్ధీకరణ పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపాల్‌పూర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లాల రాజ్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఇతర వాకర్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం హనుమకొండ కలెక్టరేట్ సబ్‌స్టేషన్ రామాలయం ఫీడర్ పరిధిలో ఉన్న ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూకాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

కాజీపేట శ్వేతార్కలో మాసపూజలు



కాజీపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో బుధవారం ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయంలో కొలువై ఉన్న అయ్యప్ప దేవాలయంలో అభిషేక క్రతువు నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు తాంత్రిక వి ధానంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు. దేవాలయం ఇన్‌చార్జి చొక్కారపు శ్రీనివాస్, గొళనకొండ శ్రీనివాస్, ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో దేవాలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాల పరిశోధనలు మార్గదర్శనంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ జూన్ 4, (ఆంధ్రజ్యోతి): సామాజిక శాస్త్రాల పరిశోధనలు భవిష్యత్తరాలకు సరైన మార్గదర్శనం చేయాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. బుధవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో పరిశోధకులకు వారంపాటు నిర్వహించే పరిశోధన తరగతులను ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణ తరగతులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశోధనలు నాణ్యమైనవిగా ఉండలన్నారు. పీహెచ్‌డీ థీసెస్ భవిష్యత్‌తరాలకు మార్గదర్శకంగా నిలవాలని చెప్పారు. థీసెస్ రూపకల్పనలో సీనియర్ ప్రొఫెసర్లు, సామాజిక వేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డు ప్రొఫెసర్ పింగళి నరసింహరావు మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాల పరిశోధనలకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిధుల కేటాయింపు తగ్గిందని, సామాజిక శాస్త్రాలను సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో గడ్డం కృష్ణయ్య, మామిడి లింగయ్య, డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేదపల్లి నాగరాజు, స్కాలర్లు కళ్ళేపల్లి ప్రశాంత్, శంకర్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కరపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్‌తో కలిసి బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పింగిళి కళాశాలలోని సైన్స్, ఆర్ట్స్, కామర్స్ మొదలైన అన్ని విభాగాల్లో బోధనను అందిస్తున్న అధ్యాపకులకు నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ తదితర అత్యధిక విద్యార్హతలు కలిగిన బోధన అనుభవం ఉన్న వారే బోధిస్తున్నారని అన్నారు. విద్యార్థినులు పింగిళి కళాశాలలో ప్రవేశం పొంది తమ భవితకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ లక్ష్మణ్‌సింగ్, డాక్టర్ బండి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పింగిళి డిగ్రీ, పీజీ కళాశాల ప్రవేశాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిరుపయోగకరంగా చేతి పంపులు

- నీటి ఎద్దడితో బోరుమంటున్న కాలనీవాసులు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



నిరుపయోగకరంగా ఉన్న చేతి పంపు

హనుమకొండ చౌరస్తా, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 8, 9, 10 డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో వందల సంఖ్యలో చేతి పంపులు ఉన్నప్పటికీ అందులో సగానికి పైగా చెడిపోయి పని చేయకుండా మూలన పడి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తాగునీటి ఎద్దడితో ప్రజలు గొంతెండిపోతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల చేతి పంపులు విరిగిపోయి, తుప్పుపట్టి పనిచేయకుండా మారడంతో కాలనీవాసులు అరిగోస పడుతున్నారు. నగరవాసులకు నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తితే చేతిపంపులను వద్దకు బారులు తీరేవారు. కానీ చేతిపంపులు తుప్పుపట్టి చెడి పోయి ఉండటంతో చేసేదేమీ లేక సమీపంలోని కిరాణం షాపులకు వెళ్లి వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ డివిజన్లలో మూలనపడ్డ చేతి పంపులను మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. హనుమకొండ 8, 9, 10 డివిజన్ ఇందిరానగర్, గుడిబండల్ కుమార్‌పల్లి, రాయపుర, కాకతీయకాలనీ, గణేష్‌నగర్, మచిలీబజార్, పద్మాక్షి, కాలనీ, గుండం, కాపువాడ ప్రాంతాల్లో చేతి పంపులు ఏళ్ల తరబడి మూలనపడ్డ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

మూడేళ్లుగా నిరుపయోకరంగా ఉంది..



10వ డివిజన్ మచిలీబజార్ రోడ్డు గుండం సమీపంలోని చేతి పంపు పూర్తిగా దెబ్బతిని మూడేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూలనపడ్డ చేతి పంపులకు మరమ్మతులు చేయించి స్థానిక ప్రజలకు నీటి కష్టాల నుంచి కాపాడాలి.

- బోడకుంట్ల వెంకటేశ్వర్లు, 10వ డివిజన్ వాసి



షాపులను తనిఖీ చేస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కాజీపేటలో విత్తనాల షాపుల తనిఖీ

కాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో బుధవారం పలు విత్తనాల షాపులను ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తనిఖీలు చేశారు. షాపులలో ఉన్న స్టాకు, రిజిస్టర్‌లను పరిశీలించారు.కల్తీ విత్తనాలను, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షాపు యజమానులకు చెప్పారు. సీఐ వెంట ఎస్సై నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- 6, 9 డివిజన్లలో పర్యటించి స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. 100రోజుల ప్రణాళిక అమలుతీరు, అవగాహన సదస్సులో భాగంగా బుధవారం 6వ డివిజన్ కిషన్‌పుర, 9వ డివిజన్ కాకతీయ కాలనీలో ఏర్పాటు చేసిన స్వచ్ఛర్యాలీలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్థానిక డివిజన్లకు చెందిన కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్యంపై అవగాహనలో భాగంగా వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి జీడబ్ల్యూఎంసీ స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. అదే విధంగా ప్రతీరోజు నగర వ్యాప్తంగా పరిశుభ్రమైన నీటిని అందజేయడానికి సంబంధిత సిబ్బంది క్లోరిన్ పరీక్షలు నిర్వహించి నీటిలో పీపీఎం స్థాయిలను నిర్ధారించిన తరువాతే సరఫరా చేస్తామన్నారు. నగరంలో పలు వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారులు తప్పకుండా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని తెలిపారు. జీడబ్ల్యూఎంసీపరిధిలోని ప్రాం తాలను నివాస యోగ్యమైన, స్థిరమైన కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కొనసాగుతుందని కమిషనర్ అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉం చడానికి స్థానిక ప్రజలను భాగస్వాములుగా చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞలను నిర్వహిం చి, అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది గోడ ప్రతులు, కరపత్రాల ద్వారా శానిటేషన్ తీరుపై అవగాహన కల్పించి, దానికి సంబంధించిన స్టిక్కర్లను డివిజన్లలోని గృహాలకు అతికించారు.ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఏఈ దొడ్డిపాటి హరికుమార్ పాల్గొన్నారు.



9వ డివిజన్ కాకతీయకాలనీ లో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కాజీపేట తహసీల్దార్ బావుసింగ్

కాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట తహసీల్దార్ బావుసింగ్ అన్నారు. కాజీపేట సోమిడి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బావుసింగ్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని ప్రతీ రైతు వినియోగించుకోవాలన్నారు. బుధవారం సోమిడిలో భూ సమస్యలపై 37దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో ఎక్కువగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సులో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ వి.ప్రణయ్‌కుమార్, ఆర్ఐలు ఎం.శివ, జె.కృష్ణారావు, సర్వేయర్ ఎం.దశరథ్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

● వడ్డెపల్లి : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని హనుమకొండ తహసీల్దార్ కె.శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతులు దరఖాస్తులతో పాటు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్నా భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 60వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నంచందర్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్ర కమిటీ మెంబర్ మండల సమ్మయ్య, రైతులు అల్లం హరిమహేందర్ పటేల్, గూటం సంపత్‌రెడ్డి, ఎనుకొంటి కుమారస్వామి, అల్లం ఉమాదేవి, ఎనుకొంటి భిక్షపతి, మిడిదొడ్డి బుచ్చన్న, కృష్ణమూర్తి, అశోక్, బుస్స నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ఫిల్టర్ల ప్రారంభంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, రాజేశం

కామర్స్ రిటైర్డు ప్రొఫెసర్ల దాతృత్వం గొప్పది..

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జూన్ 4, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు చింతకింది రాజేశం, జీవీ భవానీ ప్రసాద్, వి.కృష్ణమాచారిల దాతృత్వం గొప్పదని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి కొనియాడారు. బుధవారం కేయూ క్యాంపస్ కళాశాలలో ముగ్గురు కామర్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు విరాళంతో కామర్స్ విద్యార్థులకు పరిశుద్ధమైన తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి నేతృత్వంలో జరిగిన సమావేశంలో వాటర్ ఫిల్టర్లను రిబ్బన్ కట్ చేసి వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు.

నకిలీ బంగారం పెట్టి టోకరా

- రూ.43 లక్షలు కాజేసిన బ్యాంకు ఉద్యోగులు
- వరంగల్ స్టేషన్ రోడ్‌లోని బ్యాంకులో ఘటన

వరంగల్ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ఓ బ్యాంక్‌లో నకిలీ బంగారం పెట్టి ముగ్గురు వ్యక్తులు నగదు తీసుకున్నారు. బుధవారం ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకుర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లో పనిచేసే బ్రాంచ్ మేనేజర్, జాయింట్ కస్టోడియన్స్, ఇంకా గోల్డ్ అప్రైజర్స్ కలిసి ముగ్గురు కస్టమర్ల పేరిట ఖాతాలు ఓపెన్ చేసి నకిలీ బంగారం పెట్టి రూ.43లక్షలు తీసుకున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెందిన పైఅధికారులు ఆడిట్ సమయంలో నకిలీ బంగారాన్ని గుర్తించారు. దీంతో మోసపూరితంగా లోన్ తీసుకున్న ముగ్గురు బ్యాంకు సిబ్బంది, గోల్డ్ అప్రైజర్‌లపై బ్యాంకు డిప్యూటీ మేనేజర్ చంద్రప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షుకుర్ తెలిపారు.

కౌన్సెలింగ్

హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవచ్చా?

డాక్టర్! నాకు 42 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలున్నారు. ఇప్పుడు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా టీకా తీసుకోవచ్చా?

- ఒక సోదరి, హైదరాబాద్

హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సోకుతుంది. ఈ వ్యాధి లైంగిక క్రీడ ద్వారా సంక్రమిస్తుంది. తీవ్రమైన లక్షణాలు కనబరచని ఈ వ్యాధిని మన సహజసిద్ధ రోగనిరోధక వ్యవస్థ సమర్థంగానే అడ్డుకోగలుగుతుంది. అయితే 16 నుంచి 18 ఏళ్ల వయసున్న యువతుల్లో ఈ ఇన్ఫెక్షన్ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇందుకు 3 నుంచి 7 సంవత్సరాల సమయం పట్టవచ్చు. హెచ్‌పివి వైరస్ వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌తో పాటు యోని క్యాన్సర్, జననాంగ, మలద్వార క్యాన్సర్లు, నోటి, గొంతు, పురుషాంగ క్యాన్సర్లు కూడా రావచ్చు. జెనైటల్ వార్ట్స్ కూడా తలెత్తవచ్చు. హెచ్‌పివి వ్యాక్సిన్ ఈ క్యాన్సర్లన్నింటినీ సమర్థంగా అడ్డుకుంటుంది. ఈ వ్యాక్సిన్‌ను తొమ్మిదేళ్ల బాలికల నుంచి 45 ఏళ్ల మహిళల వరకూ అందరూ తీసుకోవచ్చు. 9 - 14 ఏళ్ల బాలికలు ఈ టీకా రెండుసార్లు తీసుకోవాలి. మొదటి టీకా తీసుకున్న ఆరు నుంచి 12 నెలల లోపు రెండో టీకా తీసుకోవాలి. 15 - 45 ఏళ్ల యువతులు, మహిళలు మూడు సార్లు తీసుకోవలసి ఉంటుంది. మొదటి టీకా తీసుకున్న రెండు నెలలకు రెండవ టీకా, తర్వాత ఆరు నెలలకు మూడవ టీకా తీసుకోవాలి.



టీకా తీసుకున్నప్పటికీ...

ఈ టీకాలు పెళ్లికి ముందే తీసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుంది. ఈ వ్యాక్సిన్‌లో అన్ని రకాల హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ దక్కదు. కాబట్టి సురక్షితమైన లైంగిక పద్ధతులు పాటిస్తూ, కండోమ్స్ వాడుకోవడం వల్ల అన్ని విధాలా రక్షణ దక్కుతుంది. అలాగే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను కనిపెట్టే పాప్‌స్మియర్ పరీక్ష కూడా క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉండాలి. 45 ఏళ్ల మహిళలు కూడా నిర్భయంగా మూడు డోసుల హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడంతో పాటు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. 50 ఏళ్ల వయసు వరకూ ప్రతి మూడు సంవత్సరాలకోసారి, ఆ తర్వాత ప్రతి ఐదేళ్లకోసారి... ఇలా 60 వరకూ పరీక్ష చేయించుకుంటూ ఉండాలి. పిల్లలు కలిగిన మహిళలు, భవిష్యత్తులో పిల్లలను వద్దనుకుంటే ఇన్‌ఫెక్షన్లను అడ్డుకునే కండోమ్స్ వాడుకోగలిగితే హెచ్‌పివి నుంచి శాశ్వత రక్షణ పొందే వీలుంటుంది.

- డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, సికింద్రాబాద్

చెర్రీ టమాటాలతో ప్రయోజనాలెన్నో..!

చెర్రీ టమాటాలు గుండ్రంగా ఉండి చిన్న సైజు టమాటాల్లాగే కనిపిస్తాయి. మామూలు టమాటాల్లో కంటే వీటిలో విటమిన్లు, ఇతర పోషకాలు రెండు రెట్లు అధికంగా ఉంటాయి. వీటిని అలాగే తినవచ్చు. లేదంటే చిన్న ముక్కలుగా కోసి గ్రీన్‌సలాడ్, పాస్తా సలాడ్‌లాంటి వాటిలో కలుపుకోవచ్చు. పలుచని చక్రాల్లా కోసి బర్గర్, శాండ్‌విచ్‌ల మధ్య పెట్టుకుని తినవచ్చు. రకరకాల వంటకాల్లో కూడా వాడుకోవచ్చు. చెర్రీ టమాటాలు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.....



- వీటిలో ఆర్గానిక్ ఆమ్లం, ఆస్కార్బిక్ ఆమ్లం, లైకోపీన్, బీటా కెరోటిన్లు పుష్కలంగా ఉంటాయి. చెర్రీ టమాటాలను తరచూ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు రావు. క్యాన్సర్ కారకాల నుంచి రక్షణ లభిస్తుంది. ఎముకలు బలోపేతమవుతాయి.
- చెర్రీ టమాటాల్లో ఎ, సి, ఇ, కె విటమిన్లతోపాటు పీచు పదార్థాలు, కెరోటినాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అంటువ్యాధులను దరిచేరనివ్వవు. కంటి సమస్యలు, దృష్టి దోషాలను నివారిస్తాయి. చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణాశయ సమస్యలు, మలబద్ధకం రాకుండా కాపాడతాయి. శరీర బరువును నియంత్రణలో ఉంచుతాయి. శరీరంలో క్రొవ్వు నిల్వలను కరిగించి రక్త ప్రసరణ సజావుగా జరిగేలా చేస్తాయి.

స్ఫూర్తి



అది ఒక అటవీ ప్రాంతం... వసతులేమీ లేని కుగ్రామం.. ఆ ప్రాంతంలో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే! అక్కడి ప్రజలకు పూట గడవటమే గగనం. అలాంటి దుర్భర పరిస్థితులలో పెరిగిన ఆదివాసి అమ్మాయి రజిత. ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఆమె తల్లి భద్రమ్మను 'నవ్య' పలకరించింది.

ఆ స్వర్ణం వెనుక అమ్మ సంకల్పం

"అవునా.. నా బిడ్డ బంగారం గెలిచిందా.." భద్రమ్మకు రజిత స్వర్ణం గెలిచిందని చెప్పినప్పుడు ఆమె అన్న తొలిమాటలు. అక్కడే ఉన్న ప్లాస్టిక్ ఫ్రేమ్‌లో రజిత ఫొటో చూసినప్పుడు ఆమె కళ్లలో ఒక గర్వం. తాను ఎంతో కష్టపడి పెంచిన చిన్నతల్లి ఏదో సాధించిందనే ఆనందం. భద్రమ్మకు ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ గురించి తెలియదు. ఒలింపిక్స్ గురించి తెలియదు. కేవలం తన చిట్టి తల్లి ఏదో ఒక గొప్ప పని చేసిందని మాత్రమే తెలుసు. రజిత స్వర్ణం వెనక భద్రమ్మ కృషి ఎన్నడూ మరవలేనిది. వాస్తవానికి భద్రమ్మ, ఆమె భర్త మారయ్యలది చత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలోని బుసరాస్ గ్రామం. కరువు కాటకాలు రావటంతో ఆమె కుటుంబం అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండంలో రామచంద్రాపురం అనే గ్రామానికి వలస వచ్చింది. రామచంద్రాపురం చుట్టూ అడవులు. రోజూ అడవిలోకి వెళ్లి ఆహారాన్ని సంపాదించుకోవాల్సిన పరిస్థితి. రజిత పుట్టిన రెండేళ్లకు మారయ్య మరణించారు. దీంతో కుటుంబ భారమంతా భద్రమ్మపైనే పడింది.

దిన దిన గండం...

రోజూ కూలికి వెళ్లి సంపాదిస్తే కానీ పిల్లలకు కనీసం భోజనం కూడా పెట్టలేని పరిస్థితి. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఇతరులైతే బెంబేలు పడిపోతారు. కుదేలవుతారు. కానీ భద్రమ్మ వేటికీ తలవంచలేదు. జీవితంతో పోరాడాలనుకుంది. రోజూ కూలికి వెళ్లేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఫలసాయం సంపాదించుకు వచ్చేది. వాటితో తాను తిన్నా.. తినకపోయినా పిల్లలకు పెట్టేది. ఆ సమయంలోనే తన పిల్లలను బాగా చదివించుకోవాలనే భావన భద్రమ్మలో బలంగా పడింది. దీనితో పిల్లలను స్కూలుకు పంపాలనుకుంది. వలసగ్రామం కావటంతో రామచంద్రపురంలో స్కూలు లేదు. దూరంగా ఉన్న ప్రాంతాలకు పంపి చదివించాలనే డబ్బులు లేవు. ఈ సమయంలో సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అరూపే ఉన్నత పాఠశాల ఆమెకు ఆసరా అయింది.

జిల్లా స్థాయిలో 100 మీటర్ల రేసులో గెలిచిన రజిత ఆదివాసీ పిల్లలలో ఒక స్టార్‌గా మారింది. ఆ తర్వాత కాలంలో జాతీయ స్థాయిలో ఆమెకు అనేక బహుమతులు వచ్చాయి. కానీ ఆమెను పేదరికం వెంటాడుతూనే ఉండేది. కాళ్లకు వేసుకోవటానికి సరైన షూలు ఉండేవి కావు. తన వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులను రజితకు భద్రమ్మ అప్పుడప్పుడు ఇస్తూ ఉండేది.



చిన్ననాటి నుంచే...

చిన్నప్పటి నుంచి రజిత ఇతరులతో పోలిస్తే అలసట లేకుండా వేగంగా పరుగెట్టేది. పరుగులో ఆమెకు సహజమైన ప్రతిభ ఉందని ఎవరికీ తెలియదు. చిన్నప్పుడు రజిత "చటుక్కున ఊరంతా పరిగెత్తి వచ్చేసేది.." అంటారు భద్రమ్మ. స్కూలులో చేరిన తర్వాత రజితకు పాఠ్యాంశాల కన్నా ఆటలలోనే ఎక్కువ ఆసక్తి కనబరిచేది. ఆమెకు పరుగులో ప్రతిభ ఉందని తొలిసారి గుర్తించి ప్రొత్సహించినది అరూపే పాఠశాలకు చెందిన ఫాదర్ ఏసురత్నం. ఆయన ఇచ్చిన ప్రొత్సాహంతో... జిల్లా స్థాయిలో 100 మీటర్ల రేసులో గెలిచిన రజిత ఆదివాసీ పిల్లల్లో ఒక స్టార్‌గా మారింది. ఆ తర్వాత కాలంలో జాతీయ స్థాయిలో ఆమెకు అనేక బహుమతులు వచ్చాయి. కానీ ఆమెను పేదరికం వెంటాడుతూనే ఉండేది. కాళ్లకు వేసుకోవటానికి సరైన షూలు ఉండేవి కావు. తనవద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులను రజితకు భద్రమ్మ అప్పుడప్పుడూ ఇస్తూ ఉండేది. ఈ సమయంలో రజిత పరుగు ప్రస్థానంలో భద్రమ్మతో పాటు, సోదరుడు జోగయ్య సహకారం వెలకట్టలేనిది. ప్రస్తుతం 2026లో జరగనున్న కామన్వెల్త్ పోటీలకు శిక్షణ పొందుతున్న రజిత 2028లో జరగబోయే ఒలింపిక్స్ అథ్లెటిక్స్ జట్టుకు కూడా ఎంపిక అయింది. మన్యం ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన అథ్లెట్‌గా రజిత పేరు చరిత్రలో నిలిచిపోతుంది. ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించి మన దేశానికి.. తెలుగు వారికి ఖ్యాతి తీసుకువస్తుందని ఆశిద్దాం.

• మంత్రి సత్యనారాయణ
చింతూరు



క్రీడా పోటీల్లో మన క్రీడాకారులు పతకాలు సాధించినప్పుడు ఎంతో ఉప్పొంగిపోతాం. ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి క్రీడాకారులను ఎంతో ప్రశంసిస్తాం. మరి మైదానంలోని ఆ క్రీడాకారులను ఫొటోలను మనకు అందించిన ఫొటోగ్రాఫర్లు మాత్రం చాలామందికి తెలియదు. అలాంటి ఓ ఫొటోగ్రాఫర్... గీతికా తాలుక్‌దర్. ఒలంపిక్స్‌ను కవర్ చేసే అవకాశం పొందిన తొలి భారతీయ మహిళా ఫొటోగ్రాఫర్ అయిన ఆమె గురించి ఆసక్తికర విషయాలు...



విజయ గీతిక

అస్సోం గువహటికి చెందిన గీతిక తన తాతయ్య స్ఫూర్తితో చిన్నప్పటి నుంచే ఫొటోగ్రఫీపై ఇష్టం పెంచుకుంది. చదువు పూర్తి చేసుకుని 2006లో ఫొటో జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించింది. పలు మీడియా సంస్థల్లో ఫొటో జర్నలిస్ట్‌గా పని చేసింది. ఫొటో జర్నలిజం అనగానే మనకు ఎక్కువగా కనిపించేది మగవారే. ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగుపడినప్పటికీ ఎక్కడో కానీ మహిళా ఫొటోగ్రాఫర్లను చూడలేం. "ఇక నేను కెమెరా పట్టుకుని, దాన్నే కెరీర్‌గా ఎంచుకొనే నాటికి పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉండేవి. ఎక్కడకు వెళ్లినా నేను తప్ప మరొక మహిళా ఫొటోగ్రాఫర్ కనిపించేది కాదు. అడుగడుగునా ఎన్నో సవాళ్లు ఎదురయ్యేవి. బంధువులు, సన్నిహితులు కూడా... 'ఈ ఫొటోగ్రఫీ నీకు అవసరమా' అంటూ నిరుత్సాహపరిచేవారు" అంటూ నాటి జ్ఞాపకాలను పంచుకున్న గీతిక ఏ రోజూ వెనకడుగు వేయలేదు. ఎవరు ఏమన్నా తనకు నచ్చిన రంగంలోనే కొనసాగాలని బలంగా నిర్ణయించుకుంది. తనను తాను నిరూపించుకోవడానికి, ఫొటోగ్రాఫర్‌గా నిలదొక్కుకోవడానికి అహర్నిశలూ శ్రమించింది. ఫొటోగ్రాఫర్ అంటే ఎన్నో ప్రాంతాలు తిరగాలి. గంటలకొద్దీ నిలబడే ఉండాలి. రాత్రీ, పగలూ అనే తేడా లేకుండా పనిచేయాలి. వీటిలో దేనికీ ఆమె భయపడలేదు. అందుకే ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, తొలి భారతీయ మహిళా క్రీడా ఫొటోగ్రాఫర్‌గా చరిత్రలో స్థానం దక్కించుకున్నారు.

> **పనిని ప్రేమిస్తా...**
>
> అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మహిళా ఫొటోగ్రాఫర్లలో నేను కూడా ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. పారిస్ ఒలంపిక్స్ కవర్ చేసేందుకు ఒలింపిక్స్ కమిటీ నుంచి అక్రిడేషన్ పొందడం నా జీవితంలోనే మరిచిపోలేని రోజు. నేను నా పనిని ప్రేమిస్తాను. పని చేస్తున్నప్పుడు ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తాను.

ఎన్నో క్రీడలు.. చిత్తరువులు...

ఎన్నో జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నీల్లో గుర్తుండిపోయే అపురూప క్షణాలను గీతిక తన కెమెరాలో బంధించారు. 2007లో నేషనల్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, పలు ఐపీఎల్, ఐఎస్‌ఎల్ (ఇండియన్ సూపర్ లీగ్) టోర్నీలు, ఫిఫా మహిళల ప్రపంచకప్‌లు, ఫిఫా ప్రపంచ కప్‌లు, సౌత్ ఏషియన్ గేమ్స్, ఐసీసీ వరల్డ్ కప్ వంటి ఎన్నో క్రీడా కార్యక్రమాలను ఆమె కవర్ చేసి పేరు తెచ్చుకున్నారు. 2020 టోక్యో ఒలంపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఎన్నో చిత్తరువులు తీశారు.

సమాజం ఆధునికత వైపు వేగంగా అడుగులు వేస్తున్నా... కొన్ని ప్రాంతాల్లో గిరిజనులు ఇంకా వెనుకబడే ఉంటున్నారు. అలాంటివారి కోసం చిన్న వయసులో పోరాటం మొదలుపెట్టింది నిహారిక నాయర్. గిరిజనులకు ఆధార్ కార్డులు అందేలా, వారి కోసం వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక చొరవ చూపింది. గిరిజన కళాకారులకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్న నిహారిక నాయర్ కథ ఇది.

గిరిజనుల కోసం... ప్రాజెక్ట్ ట్రైబలి

బెంగళూరుకు చెందిన నిహారిక 8వ తరగతి చదువుకునేటప్పుడు గిరిజనులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి తెలుసుకుంది. దాంతో వారి కోసం ఏదైనా చేయాలనే తపన ఆమెలో కలిగింది. అలా 17 ఏళ్ల వయసులోనే గిరిజనులకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో 2020లో ప్రాజెక్ట్ ట్రైబలి ప్రారంభించింది. దాని ద్వారా కర్ణా



టక, కేరళలలోని గిరిజనులు ప్రాథమిక హక్కులు పొందేలా, ఆదాయం సంపాదించుకునేలా తన వంతు సహాయం చేస్తోంది. వారి సంస్కృతి, వారసత్వం అంతరించిపోకుండా అండగా నిలుస్తోంది.



12 వేల మందికి ఆధార్

చాలా చోట్ల గిరిజనులు ప్రభుత్వం పథకాలను అందుకోరు. ఎందుకంటే కనీసం వారి పేర్లు ఓటరు జాబితాలో కూడా ఉండవు. అందుకే అలాంటి వారికి ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు అందించాలని భావించింది. నిహారిక. అందుకోసం వేలాది మంది గిరిజనులు ఆధార్ కార్డులు పొందేలా చేసి, వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేసింది. అంతేకాకుండా గిరిజన వర్గాల్లో పోషకాహార లోపం ప్రబలంగా ఉంటుందని తెలుసుకుని ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంలోనూ చొరవ చూపింది. చాలామంది గిరిజనులు తమ కళలను మర్చిపోయి ఏదో ఒక పని చేసుకుంటూ ఉండడంతో, వారి కళలు, సంస్కృతి అంతరించి పోకూడదని గిరిజన కళాకారులకు శిక్షణ ఇప్పించి, వారి కళాకృతుల అమ్మకాన్ని సులభతరం చేసింది. వారికి జీవనోపాధి కలిగించింది. అవసరంలో ఉన్న గిరిజనులకు చేయూత అందించేందుకు నిధులు కూడా సేకరించింది నిహారిక. గతేడాది ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన 1ఎం1బి యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో 'ప్రాజెక్ట్ ట్రైబలి'ని నిహారిక ప్రదర్శించి అలా గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలను అంతర్జాతీయ వేదిక మీద చూపించింది.

అవినీతి వలన అన్యాయం

ప్రభుత్వాలు గిరిజనుల కోసం ప్రతీ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ అవినీతి కారణంగా వారికి ఓ ప్రయోజనాలు అందట్లేదని ఓ సందర్భంలో నిహారిక అన్నది. ఇక్కడ మరో ప్రధాన సమస్య గిరిజనులకు సరైన అవగాహన లేకపోవడమని ఆమె అభిప్రాయపడింది. పాఠశాలలకు ఉన్నప్పటికీ అవగాహన, ప్రేరణ లేకపోవడం వల్లనే చాలా మంది గిరిజన పిల్లలు, యువత చదువుకు దూరంగా ఉంటున్నారని పేర్కొంది. గిరిజనులకు చదువు లేకపోయినా, వారు చాలా పాత పద్ధతులను అనుసరించి జీవిస్తున్నప్పటికీ వారి నుంచి మనం చాలా నేర్చుకోవచ్చని ఆమె అన్నారు. మొక్కలు, వాటి ఔషధ గుణాలను అర్థం చేసుకోవడంలో వారికి చాలా ప్రావీణ్యం ఉందని అన్నది. తాను ఓ కుగ్రామానికి వెళ్లినప్పుడు వారు మూలికలు, మొక్కల్లో ఔషధాల గురించి మలయాళంలో రాసిన 300 పేజీల పుస్తకాన్ని తనకు చూపించారని వెల్లడించారు.

ఫ్లాస్క్ శుభ్రం చేయకపోతే...

మనం కార్యాలయాలకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పాలు, కాఫీ, టీ లాంటి వాటిని ఫ్లాస్క్‌లో పోసుకుని తీసుకువెళుతూ ఉంటాం. ఈ ఫ్లాస్క్ మూత బిగుతుగా ఉండి లోపలి పానీయం ఎక్కువ సమయం వేడిగా లేదా చల్లగా ఉండేలా చేస్తుంది. ఇలా ఉపయోగించుకున్న తరవాత ఆ ఫ్లాస్క్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. లేని పక్షంలో దాని లోపల హానికారక ఫంగస్ పెరిగి దుర్వాసన వస్తుంది. కనుక...



- ముందుగా ఫ్లాస్క్‌లో నీళ్లు పోసి వంచేయాలి. తరవాత దాని నిండా గోరువెచ్చని నీళ్లు పోసి ఉంచాలి. అరగంట తరవాత ఈ నీళ్లు వంచేసి పొడవాటి బ్రష్‌తో సున్నితంగా రుద్ది కడగాలి. అలాగే మూతను కూడా కడిగి రెంటినీ పూర్తిగా ఆరనివ్వాలి. తరవాత ఫ్లాస్క్‌కు మూత బిగించి భద్రపరచుకోవాలి.
- ఫ్లాస్క్ నుంచి కాఫీ లేదా టీ వాసన ఎక్కువగా వస్తూ ఉంటే దాని నిండా గోరువెచ్చని నీళ్లు నింపాలి. అందులో రెండు చుక్కల డిష్ వాషింగ్ లిక్విడ్, అర చెంచా బేకింగ్ సోడా, చెంచా వెనిగర్‌లలో ఏదో ఒకటి వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరవాత ఆ నీళ్లు వంచేసి బ్రష్‌తో రుద్దాలి. వెంటనే మంచినీళ్లతో కడిగి ఆరబెడితే ఎలాంటి వాసనైనా తొలగిపోతుంది.
- రాత్రి పడుకునే ముందు ఫ్లాస్క్‌లో వాడేసిన టీ బ్యాగ్ లేదా ఒక చెంచా బియ్యం లేదా ఒక చెంచా ఉప్పు వేసి దాని నిండా నీళ్లు నింపి మూత పెట్టాలి. ఉదయాన్నే ఫ్లాస్క్‌ను రెండు నిమిషాలపాటు వేగంగా అటూ ఇటూ ఊపాలి. తరవాత ఆ నీళ్లు వంచేసి మంచినీళ్లతో కడిగి ఆరబెట్టాలి. లేదంటే వెంటనే వాడుకోవచ్చు.
- ఫ్లాస్క్ మూతకి రబ్బర్ సీల్ ఉంటే దాన్ని తీసి లిక్విడ్ సోప్‌తో శుభ్రం చేయాలి. మెత్తని స్పాంజ్‌తో రుద్ది కడగాలి.

నల్లటి వలయాలు ఇలా మాయం

నిద్రలేమి, కంప్యూటర్లు, ఫోన్లు ఎక్కువ సేపు చూడడం, ఒత్తిడి, హార్మోన్ల ప్రభావం, మారిన జీవన విధానం వంటి కారణాలతో కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. వీటిని ఎలా తగ్గించుకోవచ్చంటే...

- చెంచా టమాటా రసంలో కొంచెం నిమ్మరసం కలిపి కళ్ల కింద రాయాలి. రోజుకు రెండు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- బంగాళాదుంప రసంలో దూది ముంచి నల్లటి వలయాల మీద పెట్టి పదినిమిషాల తరువాత చల్లటి నీటితో కడగాలి. లేదా బంగాళాదుంప ముక్కను కళ్ల కింద 10 నిమిషాల పాటు రుద్ది నీటితో కడగవచ్చు.
- గ్రీన్ టీ సంచులను నీటిలో ముంచి తీసి కొంచెం సేపు ఫ్రిడ్జిలో ఉంచాలి. వాటిని 10 నిమిషాల పాటు కళ్ల మీద పెట్టాలి.
- రాత్రి బాదం నూనెను కళ్ల కింద రాసి మసాజ్ చేసి, ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- కలబంద గుజ్జును రాత్రి కళ్ల కింద రాసి కొంచెం సేపు సున్నితంగా మర్దన చేసి ఉదయాన్నే కడిగేయాలి.
- నారింజ రసంలో కొంచెం గ్లిజరిన్ కలిపి కళ్ల కింద రాయాలి. దీని వల్ల నల్ల వలయాలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.
- కీరదోసను గుండ్రటి ముక్కలు చేసి వాటిని కళ్లపై ఉంచాలి.
- పుదీనా ఆకులను పేస్టు చేసి కళ్ల కింద రాసి ఓ పది నిమిషాలు ఆగి కడిగాలి. రోజు రాత్రి ఇలా చేస్తే నల్లటి వలయాలు తగ్గుతాయి.
- గులాబీ నీళ్లలో దూదిని ముంచి నల్లటి వలయాలపై ఉంచాలి. పావుగంట తరువాత చల్లటి నీటితో కడగాలి.
- మజ్జిగలో పసుపు కలిపి పేస్టులా చేసి దానిని కళ్ల కింద రాయాలి. పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో కడగేసుకోవాలి.



చిత్రజ్యోతి

SINCE 1965

లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి...



మలయాళ చిత్రం 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాలీ ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. తాజాగా, ఆయన లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి ఎంటరయ్యారు. ఎల్‌సీయూలో భాగమైన 'బెంజ్' సినిమాలో 'వాల్టర్' అనే కీలక పాత్రను పోషిస్తున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో ద్వారా వెల్లడించారు. "ఈ పాత్రను పోషిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. చాలా రోజులుగా ఈ అద్భుతమైన అప్‌డేట్‌ను మీతో పంచుకోవడానికి ఎదురుచూస్తున్నాను. ఈ పాత్ర ఎంతో ప్రత్యేకం" అని పేర్కొన్నారు. ఈ వీడియో చూస్తుంటే ఆయన సినిమాలో క్రూరమైన విలన్ ఛాయలున్న 'వాల్టర్' పాత్రతో పాటు మరో భిన్నమైన రోల్‌లోనూ కనిపించనున్నట్లు తెలుస్తోంది. లోకేశ్ కనగరాజ్ కథ అందించడంతో పాటు సమర్పిస్తున్న చిత్రం 'బెంజ్'. రాఘవలారెన్స్ కథానాయకుడిగా నటిస్తున్నారు. బక్కియరాజ్ కన్నన్ దర్శకత్వంలో లోకేశ్ కనగరాజ్, సుదాన్ సుందరమ్, జగదీష్ పళనిస్వామి నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక.

అనుష్క పోస్టర్... 40కి పైగా ప్రమాదాలు!



అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన 'వేదం' 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు అల్లు అర్జున్. "వేదం'కు 15 ఏళ్లు. నా కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిది. ఇతర సినిమాలతో పోలిస్తే నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. దర్శకుడు క్రిష్‌కు రుణపడి ఉంటాను. ఎంతో నిజాయితీగా సినిమా తీశారు. ఈ చిత్రంలో మంచు మనోజ్, అనుష్క వంటి సహనటులతో ప్రయాణించడం ఓ గొప్ప జ్ఞాపకం. ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు శోభు, ప్రసాద్ దేవినేనిలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.



ముందు అనుకున్న సినిమా వేరు

ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు ఓ సందర్భంలో పంచుకున్నారు క్రిష్. "గమ్యం' తరువాత ఓ పూర్తి స్థాయి కమర్షియల్ చిత్రానికి ప్లాన్ చేశాను. అయితే ఆ సమయంలో అమరావతికి వెళ్లినప్పుడు జరిగిన ఓ సంఘటన 'వేదం' కథ సిద్ధం చేసేలా చేసింది. ఓ చిన్న పిల్లాడు వృద్ధుడిని వేలు పట్టుకుని లాక్కెళ్తున్న దృశ్యం నన్ను కదిలించింది. 'ఒక చిన్న పిల్లాడు వెట్టిచాకిరీ చేస్తాడు. వాడిని విడిపించుకోవడానికి వాళ్లమ్మ కిడ్నీలు అమ్ముతుంది' ఇలాంటి ఓ లైన్‌తో మొదలైంది 'వేదం' కథ. అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క భాగం కావడంతో ఈ సినిమా పెద్ద సినిమాలా మారింది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా అనుష్క వెనక్కి తిరిగి కొంటెగా చూస్తున్న పోస్టర్‌ను పెద్ద హోర్డింగ్‌గా చేసి పంజాగుట్ట సర్కిల్‌లో పెట్టారు. ఆ సమయంలో 40కి పైగా ప్రమాదాలు జరిగాయి. పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఆ తర్వాత పోస్టర్‌ను తొలగించారు. అంతలా అనుష్క ఆకట్టుకున్నారు" అని అన్నారు దర్శకుడు క్రిష్.

పారితోషికం తిరిగిచ్చేసిన పవన్‌కల్యాణ్

● అదే బాటలో సిద్ధు జొన్నలగడ్డ



సినిమాల కోసం కోట్లల్లో పారితోషికాలు తీసుకుంటుంటారు స్టార్ హీరోలు. కథ నచ్చి, పారితోషికం తీసుకోకుండా సినిమాలు చేసిన హీరోలు కొందరైతే.. చిత్రం విడుదలయ్యాక నష్టాలొస్తే తాము తీసుకున్న రెమ్యునరేషన్‌ను వెనక్కి ఇచ్చిన వారు మరికొందరు. అయితే చిత్రసీమలో ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. కానీ, సినిమా విడుదలకు ముందే తన పారితోషికాన్ని నిర్మాతకు తిరిగిచ్చేశారు ఏపీ డిప్యూటీ సీఎం, హీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి ఏ.ఎమ్.రత్నమ్ నిర్మాత. క్రిష్ దర్శకత్వంలో 2020లో మొదలైన ఈ చిత్రం పలు కారణాలతో సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లోనే ఉండిపోయింది. ఎట్టకేలకు చిత్రీకరణ పూర్తిచేసుకుని ఈ నెల 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. సినిమాకు తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికాన్ని నిర్మాతలకు తిరిగి ఇచ్చేశారు. ఇంతకాలం ఈ సినిమా సెట్స్ పైనే ఉన్నందుకు నిర్మాతపై పడ్డ అదనపు భారాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిర్మాతల గురించి ఆలోచించే నటుల్లో ముందు వరుసలో ఉంటారని నిరూపించుకున్నారు. మరో కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ కూడా తన పారితోషికాన్ని తిరిగి ఇచ్చేశారు. ఆయన కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'జాక్' ఏప్రిల్ 10న విడుదలైంది. సినిమా హిట్ టాక్ తెచ్చుకోవడంలో విఫలమైంది. దీంతో పారితోషికంగా తాను తీసుకున్న మొత్తంలో సగం(రూ. నాలుగు కోట్లు) తిరిగిచ్చేసి తన సహృదయాన్ని చాటుకున్నారు.

షూటింగ్‌కు సిద్ధం

పవన్‌కల్యాణ్ మరోసారి పోలీస్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. హరీశ్ శంకర్ దర్శకుడు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌ను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా షూటింగ్ ఈ నెల రెండో వారం నుంచి మొదలవుతోందని మంగళవారం తిరుమలలో వెల్లడించారు ఆయన. త్వరలోనే పవన్‌కల్యాణ్ కూడా సెట్స్‌లోకి అడుగుపెడతారని తెలిపారు.

బాలీవుడ్‌లో మళ్లీ రష్మిక

హీరోయిన్ రష్మిక మంచి జోరు మీదున్నారు. తెలుగులోనే కాదు బాలీవుడ్‌లో కూడా ఆమె బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నారు. సల్మాన్ ఖాన్ సరసన నటించిన 'సికిందర్' చిత్రం ఇటీవల ఫ్లాప్ అయినా ఆ ప్రభావం ఆమె మీద లేదనే చెప్పాలి. హిందీలో ఆమెకు ఆఫర్లు వస్తునే ఉన్నాయి. ఇంతవరకూ రష్మిక ఐదు హిందీ చిత్రాల్లో నటించారు. వాటిల్లో 'యానిమల్', 'చావా' చిత్రాలు పెద్ద హిట్ . మిగిలిన మూడు సినిమాలు అనుకున్నంతగా ఆడలేదు. తాజాగా ఇప్పుడు మరో హిందీ సినిమాకు రష్మిక కమిట్ అయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. 2012లో వచ్చిన 'కాక్‌టైల్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'కాక్‌టైల్ 2' చిత్రంలో షాహిద్ కపూర్ సరసన రష్మిక నటించనున్నారు. క్రితీ సనన్ మరో కీలక పాత్ర పోషించనున్నారు. యూరప్‌లో సినిమాలోని కొన్ని కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. అలాగే మనదేశంలో కూడా విభిన్న ప్రాంతాల్లో షూటింగ్ చేస్తారట. వచ్చే ఏడాది 'కాక్‌టైల్ 2' చిత్రం విడుదలవుతుంది.



షూటర్ వస్తున్నాడు



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'షూటర్'. సుమన్, రాశి, ఆమని, ఎస్తేర్ ప్రధాన తారాగణం. ఎస్. శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. విభిన్న కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని అన్నారు.

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా...



శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించిన చిత్రం 'బద్మాషులు'. మహేశ్ చింతల, విద్యాసాగర్ కీలకపాత్రలు పోషించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సరికొత్త తరహాలో కామెడీ థ్రిల్లర్‌గా 'బద్మాషులు' చిత్రాన్ని రూపొందించారు' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన వినోదాత్మక చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిదని నిర్మాత తెలిపారు.

వంద శాతం వినోదం



యువతను మెప్పించే కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'డేంజర్ బాయ్స్'. అభిజీత్ తీర్థహళి దర్శకుడు. వికాస్, రాధాభగవతి, అశ్విని హాసన్ ప్రధాన తారాగణం. నిర్మాత శ్రీరంగం సతీశ్ కుమార్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు మలిచారు. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. హీరో పాత్ర చిత్రణ మునుపెన్నడూ చూడని విధంగా సాగుతుంది' అని చెప్పారు.



రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నారాయణ, జానారెడ్డి, వినోద్‌కుమార్, కూనంనేని, కోదండరాం తదితరులు

మావోయిస్టులు తీవ్రవాదులు కాదు

అమిత్‌షా శీర్షాసనమేసినా ఆ సిద్ధాంతాన్ని తుడిచిపెట్టలేడు

రావి నారాయణరెడ్డి జయంతి సభలో కె.నారాయణ

హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులను తీవ్రవాదులుగా బీజేపీ దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని, వారు తీవ్రవాదులు కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ యోధుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి జయంత్యుత్సవాలు జూబ్లీహిల్స్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియం వేదికగా బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి నారాయణతో పాటు మాజీమంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దేశంలో అసమానతలు పోవాలన్న లక్ష్యంతో ఒక సిద్ధాంతానికి నిబద్ధులై పోరాడుతున్న వారిని చంపడం అన్యాయమని దుయ్యబట్టారు. వచ్చే ఏడాదికల్లా నక్సల్ రహిత దేశంగా మారుస్తామని ప్రకటించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శీర్షాసనమేసినా ఆ పని చేయలేరని ఉద్ఘాటించారు. మనుషులను చంపినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని అంతం చేశామనుకోవడానికి మించిన అవివేకం మరొకటి లేదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వానికి దమ్ముంటే మావోయిస్టులను కాదు, ఈ దేశంలోని పేదరికం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలను నిర్మూలించాలి అని నారాయణ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర పాఠాలను మరోసారి అధ్యయనం చేసైనా, మావోయిస్టులు సాయుధ మార్గాన్ని వీడాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులంతా ఒక్కటి కావాలన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. రావి నారాయణరెడ్డి జీవితంపై సమగ్రంగా అధ్యయనం జరగాలని, అలాంటి గొప్ప వ్యక్తుల జీవతగాథలు బయో పిక్‌లుగా రావాలని అభిలషించారు. కొత్తపేటలో నిర్మిస్తున్న అతిపెద్ద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి నారాయణరెడ్డి పేరు పెట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జానారెడ్డి మాట్లాడుతూ... రావి నారాయణరెడ్డి మహోన్నత మానవతామూర్తి, త్యాగశీలి, ఆదర్శనేత అంటూ కొనియాడారు. ఆ మహనీయుడు 60 ఏళ్లు దాటాక రాజకీయాలు వదిలి పూర్తిస్థాయి సామాజిక కార్యకర్తగా జీవించారని, ఆయన స్ఫూర్తితో తాను కూడా రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. నారాయణరెడ్డి చొరవ వల్లే నిజాం వ్యతిరేక, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని భారత ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమంగా గుర్తించిందని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి తదితరులు నారాయణరెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు.

ఆ రాజకీయ కుటుంబం ఎస్టీలు కాదు

» ఆదిలాబాద్ కలెక్టర్ ఉత్తర్వులు

ఇచ్చోడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 20 ఏళ్లుగా ఎస్టీ రిజర్వుడ్ స్థానంలో రాజకీయం చేసిన చౌహాన్ దేవానంద్ కుటుంబీకులు ఎస్టీలు కాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ఏజెన్సీ కేంద్రమైన ఇచ్చోడ మేజర్ పంచాయతీ సర్పంచ్‌లుగా దేవానంద్ కుమార్తెలు చౌహాన్ ప్రమీల, చౌహాన్ సునీత మూడుసార్లు (15 ఏళ్లు), దేవానంద్ ఎంపీటీసీగా(5 ఏళ్లు) రాజకీయాల్లో ఉన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బంజారా సంఘం నాయకులు దేవానంద్ కుటుంబీకులు ఎస్టీ కాదని మూడు నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు ఇటీవలే నివేదికను అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా చౌహాన్ దేవానంద్ కుటుంబీకులు ఎస్టీలు కాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గత నెల 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేయగా.. బుధవారం వెలుగులోకి వచ్చింది. చౌహాన్ దేవానంద్‌తో పాటు ఆయన కుటుంబంలోని ప్రమీల, సునీత, అనిత, గోవింద్, అనిల్, అశోక్.. మొత్తం ఏడుగురు నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు పొందారని, వీరు ఎస్టీలు కాదని కలెక్టర్ తెలిపారు. ఏజెన్సీ పేరిట చౌహాన్ దేవానంద్ భూముల క్రయవిక్రయాలు చేసినందు వల్ల ఆయా భూములపై కూడా విచారణ చేపట్టి రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. 30 రోజులలో దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు కలెక్టర్ వారికి అవకాశం కల్పించారు.

10.07 మీటర్ల లోతులో భూగర్భ జలాలు

» గణాంకాలు వెల్లడించిన భూగర్భ జలశాఖ

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సరాసరిగా భూ ఉపరితలం నుంచి 10.07మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయని భూగర్భ జలశాఖ ప్రకటించింది. మే మాసానికి గాను గణాంకాలను వెల్లడించింది. 17 జిల్లాల్లో భూఉపరితలం నుంచి 5-10మీటర్ల లోతులో నీళ్లు ఉండగా...13 జిల్లాల్లో 10-15 మీటర్ల లోతులో నీళ్లున్నాయని, 3 జిల్లాల్లో 15 మీటర్ల కింద నీళ్లు ఉన్నాయని పేర్కొంది. 2024 మే మాసంతో పోల్చితే రాష్ట్ర సరాసరి భూగర్భ జలమట్టంలో 0.30 మీటర్ల మేర పెరుగుదలను గమనించామని తెలిపింది. 19 జిల్లాల్లో పెరుగుదలను గమనించగా... ఆ జాబితాలో గద్వాల జిల్లాలో 0.05 మీటర్లు, సిద్దిపేట 2.30 మీటర్లు ఉందని పేర్కొంది. 14 జిల్లాల్లో తరుగుదలను గుర్తించగా... ఖమ్మం 0.01 మీటర్ల నుంచి ఆదిలాబాద్ 3.02 మీటర్ల దాకా ఉందని తెలిపింది. భూఉపరితలం నుంచి 5 మీటర్ల లోతులో నీళ్లున్న ప్రాంతం రాష్ట్రంలో 11 శాతంగా ఉండగా.. 45 శాతం భూ భాగంలో 5-10 మీటర్ల లోతులో నీళ్లున్నాయని పేర్కొంది.

ఫోన్ పే ద్వారా లంచం.. ఏసీబీకి చిక్కిన సర్వేయర్, చైన్‌మెన్

మంచిర్యాల క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో భూమి సర్వే చేయడానికి యజమాని వద్ద రూ.లక్ష లంచం అడిగిన మండల సర్వేయర్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌లను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి తన భూమిని సర్వే చేయాలని మండల తహసీల్దార్ కార్యాలయంలోని సర్వేయర్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌లను కోరితే, రూ.లక్ష లంచం కావాలని మంజుల డిమాండ్ చేసింది. తొలుత సదరు బాధితుడు ఫోన్‌పే ద్వారా రూ.16,500.. కొద్ది రోజులకు రూ.10 వేల నగదు చెల్లించినా భూమి సర్వేకు నిరాకరించారు. మొత్తం రూ.లక్ష చెల్లిస్తేనే సర్వే చేస్తామని మంజుల కొద్ది రోజులుగా ఇబ్బందుల పాల్జేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ విజయ్ సారథ్యంలో మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సిబ్బంది.. సర్వేయర్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌ను విచారించారు. భూసర్వే కోసం ఫోన్‌పే ద్వారా నగదు తీసుకున్నట్లు రుజువు కావడంతో వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

డొనేషన్లు వసూలు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి డిమాండ్


హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మేనేజ్‌మెంట్ సీట్లను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా సీట్లు అమ్ముకుంటూ డొనేషన్లు వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీట్లను బహిరంగంగా విక్రయిస్తున్నా అధికారులు స్పందించడం లేదని, విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే కలుగజేసుకోవాలని ఆయన కోరారు.

ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజయంతో

గ్రేటర్ రోడ్లపై అభిమానుల హల్‌చల్

పలుచోట్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు.. లాఠీచార్జి చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ/ కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్‌లో ఆర్‌సీబీ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు) జట్టు విజయం సాధించడంతో.. గ్రేటర్ హైదరాబాద్‌లో అభిమానులు మంగళవారం రాత్రి హల్‌చల్ చేశారు. విరాట్ కోహ్లీ ప్లకార్డులు పట్టుకుని, విజయం సాధించారంటూ నినాదాలు చేశారు. సచివాలయం ఎదురుగా ఉన్న ప్రాంతానికి వేలమంది క్రికెట్ అభిమానులు చేరుకొన్నారు. స్టీల్ పళ్లాలను మోగిస్తూ, బాణసంచా పేల్చుతూ సంబురాలు చేసుకున్నారు. మాదాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ కమాన్, కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ ప్రాంతాల్లోనూ అభిమానులు రోడ్లపైకి వచ్చి బాణసంచా కాల్చారు. వేలాది మంది రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పలుచోట్ల పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టారు.



సచివాలయం వద్ద సంబురాల్లో క్రికెట్ అభిమానులు

కూతురికి బాల్య వివాహం..

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

» తండ్రి మృతి.. తల్లి పరిస్థితి విషమం

శివ్వంపేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పోతులబోగుడ గ్రామానికి చెందిన శివకుమార్, శోభ దంపతులు తమ 13 ఏళ్ల కుమార్తెకు ఇటీవల బాల్య వివాహం జరిపించారు. స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు బాలిక తల్లిదండ్రులతో పాటు పెళ్లి కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను బాలికల సంరక్షణ కేంద్రానికి పంపించారు. మంగళవారం తమ కూతురును చూడడానికి వెళ్లిన తల్లిదండ్రులకు అక్కడి అధికారులు బాలికకు 18 సంవత్సరాలు పూర్తయ్యాకే పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. మనోవేదనకు గురైన తల్లిదండ్రులు పురుగుల మందు తాగారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శివకుమార్ బుధవారం మృతి చెందగా, శోభ పరిస్థితి విషమంగా ఉంది.

డైట్ కాంట్రాక్టర్ తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యతల నుంచి తప్పించారు. ఆమెను ప్రజారోగ్య సంచాలకుడికి రిపోర్టు చేయాలని వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా ఆదేశించారు. పద్మజ స్థానంలో ఉస్మానియాలో ఇన్‌చార్జి సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా పనిచేస్తున్న బి.శంకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో కలుషిత ఆహారం తిని, ఒక రోగి మృతి చెందడంతో పాటు 92 మంది అస్వస్థతకు గురవడంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఆస్పత్రిని సందర్శించారు. వంట గదిని, వార్డుల్లో బాధిత రోగులను పరిశీలించారు. డీఎంఈ నరేంద్ర కుమార్, సూపరింటెండెంట్ అనితను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని, ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని ప్రకటించారు. ఆస్పత్రి వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనపై విచారణకు కమిటీని నియమించామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సచివాలయంలో మంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

డైట్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

ఈ నెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ ఆస్పత్రిలో రోగులకు పరమాన్నం చేసి పెట్టారు. అలాగే అన్నం, కూర, గుడ్లు, అరటి పండ్లు ఇచ్చారు. సాయంత్రం డిశ్చార్జి వార్డులో 71 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఆ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన సర్కారు డైట్ కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిపై చర్యలకు ఆదేశించింది. ఆయనపై బోరబండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



ఎర్రగడ్డ ఆస్పత్రిని సందర్శించి, వైద్యాధికారులను ఆరా తీస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఇటీవల సర్కారీ దవాఖానాల్లో రోగులకు ఇస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేసేందుకు విజిలెన్స్ బృందాలు హైదరాబాద్‌లో అన్ని ఆస్పత్రులకూ వెళ్లాయి. నగరంలో డైట్ సక్రమంగా ఇవ్వడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించే ఆస్పత్రులు రెండే ఉన్నట్లు తెలిపాయి. అందులో ఒకటి ఎర్రగడ్డ ఆస్పత్రి కాగా, మరొకటి ఛాతీ ఆస్పత్రి. కానీ, ఎర్రగడ్డ ఆస్పత్రిలో కలుషితాహార ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఎర్రగడ్డ ఆస్పత్రిలో రోగులు తాగిన నీటి నమూనాలను పరీక్షలకు పంపారు. అస్వస్థతకు కారణమైన ఆహార నమూనాలను కూడా పరీక్షించాలని అనుకున్నా.. అవి లేకపోవడంతో రోగుల మలం సేకరించి టెస్టులు చేశారు. అందులో క్లోస్ట్రిడియంతో పాటు ఈకోలి బ్యాక్టీరియాను గుర్తించినట్లు సమాచారం. ఈ బ్యాక్టీరియా కలుషితాహార కేసుల్లోనే మలంలో కనిపిస్తుంటుందని వైద్యవర్గాలు వెల్లడించాయి. మరింత కచ్చితత్వం కోసం నిమ్స్ ఆస్పత్రిల్లోనూ నమూనాలకు మరోమారు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి.

ఉస్మానియాలో 18 మందికి చికిత్స

కలుషిత ఆహార ఘటనలో బాధితుల సంఖ్య బుధవారం 92కు చేరింది. తీవ్ర అస్వస్థతకు గురైన 18 మందికి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి, చికిత్స అందిస్తున్నట్లు ఉస్మానియా సూపరింటెండెంట్ రాకేశ్ సహాయ్ తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు. కాగా, మరణించిన కరణ్(35)కి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది: పొన్నం

ఎర్రగడ్డ ఆస్పత్రిలో కలుషిత ఆహార ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఘటనపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పర్యవేక్షణలో ఉన్నతాధికారులతో విచారణ జరిపించామని, ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కలెక్టర్ చెప్పడంతోనే తేలిన సంఖ్య

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పడంతోనే ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనలో బాధితుల సంఖ్య బయట పడింది. సోమవారం ఆస్పత్రిలో ఓ రోగి మృతి చెందడంతో విషయం బయటకొచ్చింది. ఆస్పత్రిలో మంగళవారం 30-40 మంది మాత్రమే బాధితులు ఉన్నారని, కలుషిత ఆహారం వల్ల ఎవరూ చనిపోలేదని, అనారోగ్య కారణంగానే మృతి చెందాడని అధికారులు వివరించారు. మంగళవారం రాత్రి కలెక్టర్ అనుదీప్ ఆస్పత్రిని పరిశీలించి, బాధితుల సంఖ్య 71 అని చెప్పారు. అంతకుముందు ఆస్పత్రి అధికారులు ఈ ఘటనను చిన్నదిగా భావించి, నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మీడియాకు కూడా వివరాలు వెల్లడించలేదు. మరోవైపు బుధవారానికి బాధితుల సంఖ్య 92కు చేరింది. కాగా, ఎర్రగడ్డ ఆస్పత్రిలో కలుషితాహారం కారణంగా ఓ రోగి చనిపోవడం బాధాకరమని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చికిత్స పొందుతున్న రోగులను బుధవారం ఆయన పరామర్శించారు.

మహిళా సమాఖ్యలకు రోగుల 'డైట్' బాధ్యత

» మెనూ అమలు చేయని వారిపై వేటు

» బోధనాస్పత్రుల అంశంలో

ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో రోగులకు ఆహారం అందించే విషయంలో సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రోగులకు మెనూ ప్రకారం ఆహారం సరఫరా చేయని కాంట్రాక్టర్లపై వేటు వేయనుంది. ఆ కాంట్రాక్టర్ల స్థానంలో మెనూ అమలు చేసే బాధ్యతను జిల్లా మహిళా సమాఖ్యలకు అప్పగించనుంది. రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ప్రభు త్వ ఆస్పత్రుల్లో డైట్ అమలుపై విజిలెన్స్ నివేదికలు, ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి ఘటన నేపథ్యంలో ప్రభు త్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వైద్యవర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని 110 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరీక్షించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కొద్దిరోజుల క్రితం 10 విజిలెన్స్ బృందాలను రంగంలోకి దించింది. ప్రభుత్వం సూచించిన మెనూ పాటించకపోవడం, అపరిశుభ్రమైన వంట గదులు వంటివి విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూశాయి. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విజిలెన్స్ బృందాలు డైట్ కాంట్రాక్టర్లను మూడు విభాగాలుగా విభజించాయి. రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించేవారు, అసలు మెనూ పాటించని వారు, కాంట్రాక్టు ముగిసినా పొ డిగింపుపై కొనసాగుతున్నవారు అని వేరు చేశాయి. మెనూ పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టు ముగిసిన వారి స్థానాలను కొత్తవారితో భర్తీ చేయాలని విజిలెన్స్ బృందాలు సిఫారసు చేశాయి. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు డైట్ అమలు చేయని కాంట్రాక్టర్లను తక్షణమే తొలగించబోతున్నారు. డైట్ కాంట్రాక్టు కాల పరిమితి ముగిసినా.. కొన్ని ఆస్పత్రుల్లో ప్రస్తుతం పాతవారే ఇంకా కొనసాగిస్తున్నారు. అలాంటి వారిని కూడా వెంటనే తొలగించాలని డీఎంఈ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. డైట్ కాంట్రాక్టులు ముగిసిన చోట, తొలగించిన చోట స్థానిక మహిళా సమాఖ్యలకు బాధ్యతలు అప్పజెప్పాలని సూచించారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లు హరీశ్ మాటలు

రాజన్న కోడెల మరణంపై రాజకీయం చేస్తున్నారు: ఆది శ్రీనివాస్

కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. అంతా జైలుకెళ్లడం ఖాయం: మధు యాష్కీ

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబంలో కలహాలు అర్థం కాక హరీశ్‌రావు తనకు తోచింది మాట్లాడుతున్నారని.. ఆయన మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. వేములవాడ గోశాలలో కోడెల మరణంపై మాట్లాడే నైతిక అర్హత హరీశ్‌కు లేదన్నారు. పాలు మరవని లేగ దూడలు, అనారోగ్యంతో ఉన్న కోడెలను కొందరు భక్తులు వదిలివెళ్తుండటంతో కొన్ని మృత్యువాత పడ్డాయని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. వేములవాడ గోశాల దుస్థితికి బీఆర్ఎస్ సర్కారే కారణమని.. రాజన్న గుడికి రూ.వంద కోట్లు ఇస్తానని మాట ఇచ్చి మోసం చేసింది కేసీఆర్ కాదా..? అని ప్రశ్నించారు. కమీషన్లు తినే అలవాటు ఉన్నోళ్లకు.. కాళేశ్వరం కమిషన్ విలువ తెల్వదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌మధు యాష్కీగౌడ్ విమర్శించారు. అధికారులు ఇచ్చిన ఆధారాలతోనే జ్యుడిషియల్ కమిషన్ కేసీఆర్, హరీశ్, ఈటలకు నోటీసులిచ్చినట్టు తెలిపారు. మిడి మిడి జ్ఞానంతో కవిత మాట్లాడుతున్నారని.. ఆమె ఎన్నాళ్లు మళ్లీ జైల్లో ఉంటుందో ఆమెకే తెలియదని ఎద్దేవా చేశారు. త్వరలో ఆమె నాన్న.. అన్న, ఆ తర్వాత బావ జైలు కెళ్లడం ఖాయమన్నారు. మధు యాష్కీ నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.జానారెడ్డి, కె.కేశవరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ విజయశాంతి భేటీ అయ్యారు. అనంతరం యాష్కీ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆనాడు కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎంపీలుగా పార్లమెంట్‌లో తాము చేసిన పోరాటాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రజల్లోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. కవిత ధర్నాను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కూలిపోయే కాళేశ్వరం కట్టి తెలంగాణ ప్రజల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. కుటుంబంలో ఏర్పడిన విభేదాలతో దూరమైన కవిత తిరిగి తండ్రికి దగ్గరయ్యేందుకు ధర్నా ముసుగు వేసుకున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు నోటీసులిచ్చింది రాష్ట్ర ప్రభుత్వం కాదు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ అని స్పష్టం చేశారు. చందాలు, దందాల కోసమే జాగృతి నిర్మాణమని విమర్శించారు. రాహుల్ గాంధీని అవమానిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఎక్కడా రాహుల్ వ్యతిరేకించలేదని.. ట్రంప్ ఒత్తిడికి లొంగి ప్రధాని మోదీ పాకిస్థాన్‌తో యుద్ధం ఆపేశారని మాత్రమే అన్నారన్నారు. దానికి రాహుల్‌ను పాకిస్థాన్ ఏజెంట్ అంటూ బీజేపీ నేతలు విమర్శించడం దారుణమని మండిపడ్డారు. రాహుల్.. భారత ప్రజల ఏజెంట్ అని అభివర్ణించారు.

ప్రజలతో మమేకమే.. ప్రజాసేవ సారాంశం

» ట్రైనీ ఐఏఎస్‌లతో గవర్నర్

హైదరాబాద్, జూన్4 (ఆంధ్రజ్యోతి): 'ప్రయాణం చేయండి, ప్రజలను కలవండి, వారితో సన్నిహితంగా ఉండండి. వారి సమస్యలను అర్థం చేసుకోండి. ఇదే ప్రజాసేవ సారాంశం' అని తెలంగాణ కేడర్ ట్రైనీ ఐఏఎస్ అధికారుల (అసిస్టెంట్ కలెక్టర్ల)కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేయడం వల్ల ఉన్న ఉపయోగాలను వివరించారు. బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నూతన ఆవిష్కరణలు, అభివృద్ధికి సానుకూల కృషికి అపార అవకాశాలున్నాయని అన్నారు. ఎంసీఆర్‌హెచ్‌డీ వైస్ ఛైర్మన్ శాంతికుమారి, కోర్సు డైరక్టర్ ఉషారాణి శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులతో కలిసి రాజ్‌భవన్‌కు వచ్చారు. పాలనలో రాజ్‌భవన్ పాత్ర, గవర్నర్ బాధ్యతలను గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ వారికి వివరించారు. కాగా, సివిల్ సర్వీసెస్‌లో ఈ విజయం మీ క్రమశిక్షణ, సంకల్పం, పట్టుదలకు ఫలితమని సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్టు సర్వీసుకు ఎంపికైన అభ్యర్థులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్‌లో విజేతలైన అభ్యర్థులను బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ సన్మానించారు. ప్రజాసేవలో దీపస్తంభాలుగా నిలవాలని, నీతి, కరుణతో ప్రజలకు సేవచేయాలని గవర్నర్ సూచించారు. మీరు కేవలం అధికారులు మాత్రమే కాదని, భారతదేశ భవిష్యత్తుకు రూపశిల్పులని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సుపరిపాలనపై ట్రైనీ ఐఏఎస్‌లకు సీఎం దిశానిర్దేశం

ట్రైనీ ఐఏఎస్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ యంత్రాంగాన్ని పటిష్టం చేసే దిశగా నిబద్ధత, పారదర్శకతతో పనిచేయాలని ఈ సందర్భంగా సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా, వారి సమస్యలను అర్థం చేసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పరిపాలనలో సంస్కరణలు తీసుకురావడానికి, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఐఏఎస్‌ల పాత్ర కీలకమని సీఎం చెప్పారు. సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశంగా ఈ బాధ్యతలను భావించాలని అన్నారు.

రోగం నయమైనా ఇంటికి తీసుకెళ్లరే..!!

మానసిక సమస్యలతో వచ్చి అనాథలుగా మిగులుతున్న అభాగ్యులు

» రోగులను ఆస్పత్రిలో చేర్పించి చేతులు దులుపుకొంటున్న కుటుంబసభ్యులు

» తమ వారి కోసం ఎర్రగడ్డ ఆస్పత్రి డీసీ వార్డులో 80 మంది దాకా ఎదురుచూపు

» ఇటీవల మరణించిన కరుణ్ ఆ వార్డులోని వ్యక్తే

హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన చాలా మంది అనాథలు మారిపోతున్నారు. రోగులను ఆస్పత్రుల్లో చేర్పించిన తర్వాత కుటుంబసభ్యులు చేతులు దులుపేసుకుంటున్న ఘటనలు చాలా ఉంటున్నాయి. కొందరు రోగుల విషయంలో.. చికిత్స ఎలా జరుగుతుంది ? తమ వారి ఆరోగ్యం ఎలా ఉంది ? అనే కనీస వాకబు చేసే వారు కూడా ఉండరు. అంతేకాదు. చికిత్స పూర్తయి, రోగం నయమై మామూలు మనిషిగా మారిన వారిని ఇంటికి తీసుకెళ్లే వారు ఉండరు. దీంతో మానసిక అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన చాలామంది చివరికి ఎవరూ లేని అనాథలుగా మిగులుతున్నారు. ఇలా అనాథలుగా మారిన వారు హైదరాబాద్, ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలోనూ చాలా మందే ఉన్నారు. ఆస్పత్రిలో చేరిన రోగుల్లో చికిత్స అనంతరం మామూలు మనుషులుగా మారిన వారిని ఆస్పత్రిలోని డిశ్చార్జి కమిటీ(డీసీ) వార్డులోకి మారుస్తారు. డీసీ వార్డులో ఉన్న వారిని.. కుటుంబసభ్యులు, బంధువులకు అప్పజెప్పి డిశ్చార్జి చేస్తుంటారు. ఎవరూ రాకపోతే రోగం నయం అయినా సరే వారు ఆ వార్డులో ఉండాల్సిందే. ఇలా.. ఎర్రగడ్డ ఆస్పత్రి డీసీ వార్డులో ప్రస్తుతం 80 మందికి పైగా రోగులు ఉన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలో సోమవారం మరణించిన కరుణ్ కూడా ఏడాదిగా డీసీ వార్డులోనే ఉంటున్నాడు. 2023లో ఆస్పత్రిలో చేరిన కరుణ్‌ను చికిత్స అనంతరం డీసీ వార్డుకు మార్చారు. కానీ, కుటుంబసభ్యుల ఆచూకి లేకపోవడంతో కరుణ్ ఆస్పత్రిలోనే ఉండిపోయి చివరికి కన్నుమూశాడు. డీసీ వార్డులో ఉన్నవారిని వారి స్వస్థలాలకు, అయినవారి దగ్గరకు చేర్చడానికి ఆస్పత్రి వర్గాలు కూడా నానా తంటాలు పడుతున్నాయి. రోగుల కుటుంబసభ్యులకు లేఖలు రాసి, వారి ఆచూకీ కోసం ప్రయత్నించి విసిగిపోతున్నాయి. డీసీ వార్డులో ఉన్నవారి సంఖ్య పెరిగిపోతుండడం కూడా ఆస్పత్రి వర్గాలకు సమస్యగా మారుతోంది. చివరికి కొందరిని అనాథ ఆశ్రమాలకు తరలిస్తున్నారు. కాగా, మానసిక ఆస్పత్రిలో మౌలిక వసతులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోగులకు రక్త, మూత్ర వంటి పరీక్షలతో అత్యవసర వైద్య పరీక్షలు చేసేందుకు ఆస్పత్రిలో ల్యాబ్ లేదు. అలాగని రోగులను బయటికి తరలించాలంటే అంబులెన్స్ కూడా లేదు. ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కుగా ఉన్నాయి. ఇక, రోగులకు అందించే ఆహారం విషయంలో తగిన పర్యవేక్షణ కూడా లేదు. రోగులకు భోజనంతో పాటు రెండు గుడ్లు వడ్డించాలి. కానీ, ఒక గుడ్డును రెండు ముక్కలు చేసి వడ్డిస్తున్నారంటే.. అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. మరోపక్క, ఎర్రగడ్డ ఆస్పత్రికి కట్టుదిట్టమైన ప్రహరీ లేకపోవడంతో బయటి వ్యక్తులు ఆవరణలో తిష్ట వేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో రోగుల భద్రత ఆందోళనకరంగా మారింది. ఆస్పత్రిలో వసతుల లేమి, సిబ్బంది కొరత, వారి పని తీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జాతీయ మానవ హక్కుల సంఘం బృందం 2010 జూలైలో ఆస్పత్రిలో పర్యటించింది. ఆస్పత్రిలోని పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చినా ఇప్పటి దాకా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



చిన్నస్వామి స్టేడియంలో ట్రోఫీతో ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్

ఇంత జరిగినా..?

తొక్కిసలాట, మరణాల తర్వాతా వేడుకలా..

ఆర్‌సీబీపై విమర్శల వెల్లువ

బెంగళూరు : చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు ఫ్యాన్స్ ప్రాణాలు కోల్పోయి, భారీ సంఖ్యలో గాయపడినా సంబరాలలో పాల్గొన్నదంటూ ఆర్‌సీబీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క అభిమానులు చనిపోయినా మరో పక్క సన్మానం కొనసాగడమా..అని నెటిజన్లు ధ్వజమెత్తుతున్నారు. 'ఒక పరేడ్. తెలివిహీనులు, పెను విషాదం, బారీకేడ్లు లేకుండా, ప్రణాళిక లేకుండా ఇంత భారీ స్థాయిలో వేడుక నిర్వహించడమా? మూర్ఖులు మాత్రమే ఇలా చేస్తారు. పాలనా యంత్రాంగం మెదడు మొద్దుబారిపోయిందా' అని ఓ నెటిజన్ దుయ్యబట్టాడు. 'మృతదేహాలు అలా పడి ఉన్నా విజయోత్సవం కొనసాగడం దిగ్భ్రాంతికరం. ఉత్త పుణ్యానికి యువ కన్నడిగులు ప్రాణాలు కోల్పోయారు. అంత అమానవీయంగా ఎలా వ్యవహరించారు? అంత ఉదాసీనంగా ఎలా ఉండిపోయారు ? ఇది క్షమించరానిది. బాధ్యులను నేరస్తులుగా పరిగణించాలి' అని మరో యూజర్ ఏకిపారేశాడు. తొక్కిసలాట నేపథ్యంలో భద్రతా కారణాలు చూపుతూ విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ పరేడ్‌ను కర్ణాటక ప్రభుత్వం రద్దు చేసింది.

ప్రణాళికా లోపంవల్లే

బీసీసీఐ కార్యదర్శి సైకియా

న్యూఢిల్లీ: ప్రణాళికా లోపంవల్లే చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుందని బీసీసీఐ పేర్కొంది. 'ఈ సంఘటన చాలా దురదృష్టకరం. క్రికెట్‌కున్న పాపులారిటీలో ఇది ప్రతికూల కోణం. క్రికెటర్లపట్ల ప్రజలకు ఎంతో క్రేజ్ ఉంది. అందువల్ల ఈ కార్యక్రమాన్ని మెరుగైన ప్రణాళికతో నిర్వహించాల్సింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా పేర్కొన్నాడు. 'ఈస్థాయిలో విజయోత్సవాలను నిర్వహిస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి. ఎక్కడో కొన్ని లోపాలు జరిగాయి. అద్భుతంగా జరిగిన ఐపీఎల్‌కు ఇది విషాద ముగింపు' అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా..గత ఏడాది టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియాకు ముంబైలో చక్కగా నిర్వహించిన విజయోత్సవాన్ని సైకియా గుర్తు చేశాడు. 'గతంలోనూ ఐపీఎల్ విజయోత్సవాలు జరిగాయి. గత ఏడాది కోల్‌కతా నైట్‌రైడర్స్ కప్ గెలిచినప్పుడు కోల్‌కతాలో సంబరాలు సాఫీగా నిర్వహించారు' అని అన్నాడు.

అంతా గందరగోళం..

బెంగళూరు: కోహ్లీకి ఉన్న అభిమాన గణాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కర్ణాటక క్రికెట్ సంఘం తక్కువగా అంచనా వేయడం ఈ తొక్కిసలాటకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంచనాలకు అందని రీతిలో దేశ వ్యాప్తంగా విరాట్‌కు ఫ్యాన్స్ ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

ప్రేక్షకుల హాజరుపై అంచనా లేకపోవడం: సన్మాన సభకు ఎంత మంది అభిమానులు వస్తారనే విషయంలో అంచనాలే లేకపోవడానికి తోడు ప్రణాళికా లోపం స్పష్టంగా కనిపించింది. స్టేడియం సామర్థ్యం 35వేలు కాగా..రెండు నుంచి మూడు లక్షల మంది ఫ్యాన్స్ పోటెత్తారు.

కార్యక్రమ వివరాలపై గందరగోళం: చివరి నిమిషందాకా విజయోత్సవ ర్యాలీ రద్దు గురించి తెలియకపోడంతో అభిమానులు గందరగోళానికి లోనయ్యారు. పరేడ్‌లో ఓపెన్ టాప్ వాహనంలో క్రికెటర్లు స్టేడియంలోకి రావాల్సి ఉంది. కానీ అది రద్దు కావడంతో ఆటగాళ్లు బస్సులో వచ్చారు. దాంతో వారిని చూడాలనే ఆత్రుతతో స్టేడియంలోకి అభిమానులు ఒక్కసారిగా చొచ్చుకు వచ్చారు. దీంతో గేట్లు విరిగిపోయాయి.

డ్రెయిన్ కూలి: పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఒక్కసారిగా స్టేడియంలోకి ప్రవేశించడంతో డ్రెయినేజీపై ఉన్న శ్లాబ్ కూలిపోయింది. దాంతో అభిమానులంతా భయాందోళనకు లోనయ్యారు. పైగా ఫ్యాన్స్ చెట్లు, స్టేడియం గేట్లు ఎక్కడంతో గందరగోళం మరింత పెరిగింది. కొద్ది సంఖ్యలో ఉన్న పోలీసులు అభిమానులను నియంత్రించలేక పోయారు.

అప్పుడు 16.. ఇప్పుడు 11

భారత క్రీడా చరిత్రలో విషాద ఘట్టాలు





ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ట్రోఫీ గెలవడంతో నగరమంతా ఉత్సాహంలో మునిగిపోయిన వేళ.. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరగడం.. 11 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేస్తోంది. ఈ దుర్ఘటనలో 33 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మన దేశంలో క్రీడాలో కొన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన రెండో విషాదాంతం ఇది. అంతకుముందు 1980లో కోల్‌కతాలో ఈడెన్‌గార్డెన్స్ స్టేడియంలో రెండు ఫుట్‌బాల్ జట్ల అభిమానుల మధ్య చెలరేగిన ఘర్షణకు 16 మంది బలయ్యారు.

1980, ఆగస్టు 16.. ఆరోజు కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్‌గార్డెన్స్ స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్ల మధ్య కోల్‌కతా ఫుట్‌బాల్ డెర్బీ మ్యాచ్. అందరిలోనూ ఎంతో ఆసక్తి రేకెత్తించే ఈ పోరును వీక్షించేందుకు 70వేల మంది తరలివచ్చారు. మ్యాచ్ మొదలైంది.. కొన్ని నిమిషాల అనంతరం మ్యాచ్‌లో మోహన్ బగాన్ ఆటగాడు బిదేశ్ బసును ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాలర్ దిలీప్ పాలిత్ తోసేశాడు. అంతే.. ఒక్కసారిగా స్టేడియంలో గోల మొదలైంది. ప్రేక్షకుల్లో నుంచి కొందరు మైదానంలోకి రాళ్లు రువ్వారు. గొడవ పెద్దదైంది. ఇరుజట్ల అభిమానులు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు తోసుకుంటూ చేతికి దొరికిన వాటితోనే పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసులు స్పందించేలోపే పరిస్థితి చేయి దాటిపోయింది. ఈ ఘటనలో ఏకంగా 16 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతా, 18 నుంచి 60 ఏళ్ల లోపు వారే. ఈ విషాదకరమైన ఘటన జరిగి 45 ఏళ్లు కావస్తోంది. ఇప్పటికీ ఆ ఘటనను గుర్తుచేసుకుంటే భయానకంగా ఉంటుందంటారు నాటి ఉదంతంలో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న కొందరు సాకర్ అభిమానులు. మళ్లీ ఇన్నాళ్లకు ఆ తరహా ఘటనను తలపిస్తూ బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయోత్సవ యాత్ర విషాదాంతమైంది. చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తిన అభిమానుల్లో 11 మంది అసువులు బాశారు. నాటి ఈడెన్ గార్డెన్స్ ఉదంతం తర్వాత భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద విషాద ఘటనగా ఆర్‌సీబీ యాత్ర మిగిలిపోయింది. కాగా, ఇప్పటిదాకా ఫుట్‌బాల్ మ్యాచ్‌ల సందర్భంగా ఇలాంటి సంఘటనలు జరగగా.. ఓ క్రికెట్ ఈవెంట్ సందర్భంగా దుర్ఘటన జరగడం ఇదే తొలిసారి.

ప్రపంచ క్రీడా చరిత్రలో మరికొన్ని విషాదాంతాలు..

అక్టోబరు 2022, ఇండోనేసియా

ఇటీవలికాలంలో అతిపెద్ద క్రీడా విషాద ఘటనగా దీన్ని చెప్పుకోవచ్చు. తూర్పు జావా ప్రావిన్స్‌లోని కంజురుహన్ స్టేడియంలో జరిగిన ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా 174 మంది చనిపోయారు. పెర్సెబాయ సురబాయ జట్టు చేతిలో అరెమా జట్టు ఓడిపోయింది. ఈ క్రమంలో స్టేడియంలోనే ఇరుజట్ల అభిమానులు ఘర్షణకు దిగడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీ చార్జ్ చేశారు. దీంతో జరిగిన తొక్కిసలాటలో భారీఎత్తున అభిమానులు దుర్మరణం పాలయ్యారు. ఏకంగా 320మందికిపైగా గాయపడ్డారు.

మే 2001, ఘనా

ఆఫ్రికా సాకర్ చరిత్రలో అత్యంత విషాదకర ఘటన ఇది. అక్రా ప్రధాన స్టేడియం వద్ద అభిమానులు ఘర్షణకు దిగడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 126 మంది దుర్మరణం పాలయ్యారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

చావుతో స్వాగతం

ఐపీఎల్ చాంపియన్లకు చావుతో స్వాగతం లభించినట్టయింది. మృతుల కుటుంబాలకు నా సానుభూతి. **- మాజీ కీపర్ కిర్మాణీ**

క్రికెట్‌కు ఇది విచారకరమైన రోజు. హృదయం తరుక్కుపోతోంది. **-అనిల్ కుంబ్లే**

మృతుల కుటుంబాలకు నా సానుభూతి. **- సచిన్ టెండూల్కర్**

స్నేహితురాలితో కుల్‌దీప్ నిశ్చితార్థం



న్యూఢిల్లీ: టీమిండియా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ నిశ్చితార్థం తన బాల్య స్నేహితురాలు వన్షికతో బుధవారం జరిగింది. లఖ్‌నవూలో అతికొద్ది మంది బంధు మిత్రుల సమక్షంలో ఈ వేడుక జరిగింది. రింకూ సింగ్‌తో పాటు ఉత్తరప్రదేశ్ క్రికెటర్లు పలువురు ఈ నిశ్చితార్థానికి విచ్చేశారు.

ఈ కప్పు మీదే: కోహ్లీ



కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌తో కోహ్లీ

బెంగళూరు: భారీ స్థాయిలో హాజరైన ఆర్‌సీబీ ఫ్యాన్స్‌ను చూసి విరాట్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. అతడి కనులు చెమర్చాయి. దాంతో మైక్ అందుకొన్న వెంటనే కోహ్లీ ప్రసంగించ లేకపోయాడు. ఎట్టకేలకు తేరుకొని 'ఇకపై మనం ఈసారి కప్పు మనదే అంటూ మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈసారి కప్పు మనది కాబట్టి' అని అన్నాడు. అంతే..అభిమానుల హోరుతో చిన్నస్వామి స్టేడియం దద్దరిల్లింది. కోహ్లీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'అభిమానులూ..ఈ కప్పు మీది. ఎంతో అద్భుతమైన ఈ నగరానిది. ఈ 18 ఏళ్లలో మాకు మీరు అండగా నిలిచారు. ప్రపంచంలో ఎక్కడా..ఏ జట్టుకు ఇంత ఫ్యాన్ బేస్ ఉండడం నేను చూడలేదు' అని అన్నప్పుడు అభిమానులు కేరింతలు కొట్టారు. 'తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా తనేమిటో రుజువు చేసుకున్న పటీదార్‌కు జేజేలు పలకండి' అని కోహ్లీ పిలుపునిచ్చాడు.

'వైల్డ్‌కార్డ్' సంచలనం

- క్వార్టర్స్‌లో ఆండ్రీవాకు బోయిసన్ షాక్
- ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌కు అల్కారజ్, సినర్



బోయిసన్

పారిస్: క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో స్థానిక క్రీడాకారిణి లోయిస్ బోయిసన్ సంచలన ప్రదర్శన కనబరచింది. వైల్డ్‌కార్డ్‌తో టోర్నీలో ఆడుతున్న ఈ ఫ్రెంచ్ భామ క్వార్టర్‌ఫైనల్లో అదరగొట్టింది. బుధవారం జరిగిన సింగిల్స్ పోరులో ప్రపంచ 361 ర్యాంకరైన బోయిసన్ 7-6(6), 6-3తో ఆరోసీడ్ మిర్రా ఆండ్రీవా (రష్యా)ను కంగుతినిపించింది. 1989లో మోనికా సెలెస్, జెన్నిఫర్ కాప్రియాటి తర్వాత తన ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్‌లో సెమీస్ చేరిన తొలి క్రీడాకారిణిగా 22 ఏళ్ల బోయిసన్ రికార్డు సృష్టించింది. అంతేకాదు.. 1999లో అమేలీ మౌరెస్మో (వింబుల్డన్‌లో) తర్వాత గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్ చేరిన పిన్నవయసు ఫ్రెంచ్ క్రీడాకారిణిగానూ ఘనత వహించింది. గురువారం జరిగే సెమీఫైనల్లో రెండోసీడ్ కొకొ గాఫ్ (అమెరికా)తో బోయిసన్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో గాఫ్ 6-7 (8), 6-4, 6-1తో తన దేశానికే చెందిన ఏడో సీడ్ మాడిసన్ కీస్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ జానిక్ సినర్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. క్వార్టర్స్‌లో సినర్ 6-1, 7-5, 6-0తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)పై, అల్కారజ్ 6-0, 6-1, 6-4తో 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా)పై అలవోకగా గెలుపొందారు.

ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి జంట 21-14, 22-20తో పాలినా-కాంటెమిర్ (ఉక్రెయిన్) ద్వయంపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్-ఆద్య జోడీ 15-21, 21-16, 21-17తో యి హంగ్ వీ-నికోల్ గొంజాలెస్ చాన్ (తైపీ) జంటపై నెగ్గింది.

అగ్రస్థానంలో హంపి

స్టావంజర్ (నార్వే): కోనేరు హంపి ఎనిమిదో రౌండ్‌లో విజయం సాధించి నార్వే చెస్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. 8వ రౌండ్‌లో సరసాడాట్ ఖాడెమ్ అల్ షరీహ్ (ఇరాన్)పై నెగ్గిన హంపి.. ప్రస్తుతం 13.5 పాయింట్లతో ప్రథమ స్థానానికి చేరుకుంది. వెన్‌జున్ (చైనా)ను ఓడించిన వైశాలి 9.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల్లో కరువానా (అమెరికా)కు చెక్ చెప్పిన అర్జున్ 10.5 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు. కార్ల్‌సన్‌పై వీ యి (చైనా) గెలిచాడు. గుకేష్, నకముర చేతిలో ఓడాడు. కురవానా (12.5) టాప్‌లో, కార్ల్‌సన్ (12) ద్వితీయ స్థానంలో, నకముర, గుకేష్ చెరో 11.5 పాయింట్లతో 3, 4స్థానాల్లో కొనసాగుతున్నారు.

ఆర్థిక నారీమణులు



శాంతి ఏకాంబరం



రాధా వెంబు



సంగీతా రెడ్డి



రోష్నీ నాడార్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రంగంలో అత్యంత ప్రభావవంతమైన, స్ఫూర్తిదాయక మహిళల వివరాలతో కాడెరే, హురున్ ఇండియా సంయుక్తంగా ఓ జాబితాను విడుదల చేశాయి. ఈ తరహా లిస్ట్‌ను రూపొందించడం ఇదే తొలిసారి. కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్న నారీమణుల విభాగంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ డిప్యూటీ ఎండీ శాంతి ఏకాంబరం అగ్రస్థానంలో నిలిచారు. 62 ఏళ్ల శాంతి ఏకాంబరం.. రూ.3.82 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన కోటక్ బ్యాంక్ కీలక సారథుల్లో ఒకరుగా ఉన్నారు. ఇక తొలి తరం సంపద సృష్టికర్తల విషయానికొస్తే, జోహో సహ వ్యవస్థాపకురాలు రాధ వెంబు రూ.55,300 కోట్ల నెట్‌వర్త్‌తో నం.1గా ఉన్నారు. తొలి తరం సంపద సృష్టికర్తల విభాగంలోని టాప్ -10 నారీమణుల మొత్తం ఆస్తి రూ.2 లక్షల కోట్ల పైమాటే. వారి సారథ్యంలో నడుస్తున్న కంపెనీల మార్కెట్ విలువ రూ.12 లక్షల కోట్ల పైనే. రెండో తరం మహిళా సారథుల విభాగంలో రూ.4.87 లక్షల కోట్ల విలువైన హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి నలుగురు కూతుళ్ల ప్రీత, శోభన, సునీత, సంగీతా రెడ్డి కూడా నెక్స్ట్ జెనరేషన్ లీడర్ల విభాగం టాప్-10లో చోటు దక్కించుకున్నారు. రూ.97,600 కోట్ల మార్కెట్ విలువ కలిగిన అపోలో హాస్పిటల్స్ నెట్‌వర్క్ నిర్వహణలో ఈ నలుగురూ కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా ఇన్వెస్టర్లలో అడ్వెంట్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్వేత జలాన్, దాతృత్వంలో రోహిని నీలేకని, అత్యధిక మంది ఫాలో అవుతున్న సెలబ్రిటీ ఇన్వెస్టర్లలో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ అగ్రగామిగా నిలిచారు.

ఎన్‌విడియా మళ్లీ ప్రపంచ నం.1

అమెరికాకు చెందిన ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా.. మైక్రోసాఫ్ట్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. మంగళవారం అమెరికా మార్కెట్లో ఎన్‌విడియా మార్కెట్ విలువ 3.45 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అదే సమయంలో మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.44 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది. ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్‌విడియా అగ్రస్థానానికి చేరడం ఈ జనవరి 24న తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. గడిచిన నెలరోజుల్లో కంపెనీ షేరు 24 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది.

బిజినెస్

మదుపరులూ పారాహుషార్

కేటుగాళ్ల మోసాలపై జర జాగ్రత్త

న్యూఢిల్లీ : తమ పేరుతో సోషల్ మీడియాలో వచ్చే నకిలీ సమాచారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సెబీ మరోసారి మదుపరులను హెచ్చరించింది. తమ పేరు మీద కేటుగాళ్లు పంపించే నకిలీ సమాచారం నమ్మి వ్యక్తిగత సమాచారం షేర్ చేయడంగానీ, డబ్బులు పంపడంగాని చేయవద్దని కోరింది. కొంత మంది మోసగాళ్లు సెబీ లోగో, లెటర్‌హెడ్, అధికారుల పేర్లతో మదుపరులకు తప్పుడు సమాచారం పంపిస్తూ మోసం చేస్తుండడంతో సెబీ ఈ హెచ్చరిక చేసింది. తాము పంపించే ప్రతి ఉత్తర్వు లేదా జారీ చేసే ప్రతి లెటర్‌కు ప్రత్యేక నంబరు ఉంటుందని తెలిపింది. మదుపరులు తమ అధికారిక వెబ్‌సైట్‌లో తమకు వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే ముందుకు వెళ్లాలని సెబీ కోరింది.

సేవల రంగంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: సేవల రంగం మే నెలలో నిలకడ వృద్ధిని సాధించింది. ఈరంగానికి చెందిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ సూచీ 58.8 పాయింట్లకు చేరింది. ఏప్రిల్‌లో ఇది 58.7 పాయింట్లుంది. డిమాండు పుంజుకోవడం, కొత్త ఆర్డర్లు రావడం ఇందుకు దోహదపడింది.

అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్‌కు రూ.6,400 కోట్ల నిధులు



న్యూఢిల్లీ: తదుపరి దశ విస్తరణ కోసం వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల కన్సార్షియం నుంచి 75 కోట్ల డాలర్ల (రూ.6,400 కోట్లు) నిధులు సమీకరించినట్టు అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఏఏహెచ్ఎల్) ప్రకటించింది. కన్సార్షియంలో ఫస్ట్ అబూ దబీ బ్యాంక్, బార్క్లేస్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులున్నాయి. 40 కోట్ల డాలర్ల (రూ.3,400 కోట్లు) ప్రస్తుత రుణభారం తగ్గించుకోవడంతో పాటు విమానాశ్రయాల వ్యాపారం, ఈ వ్యాపారానికి అనుబంధంగా గల నాన్ ఏరో వ్యాపారాల విస్తరణకు ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా అహ్మదాబాద్, లఖ్‌నవ్, మంగళూరు, జైపూర్, గువాహటి, తిరువనంతపురం విమానాశ్రయాలను విస్తరించనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం తమ నిర్వహణలోని విమానాశ్రయాల వార్షిక ప్రయాణికుల రవాణా సామర్థ్యం 9.4 కోట్లుండగా దాన్ని 11 కోట్లకు పెంచుతామని తెలియచేసింది. 2040 నాటికి దశలవారీగా ఈ సామర్థ్యాన్ని 30 కోట్లకు పెంచడం తమ లక్ష్యమని కంపెనీ సీఈఓ అరుణ్ బన్సల్ తెలిపారు. త్వరలోనే ప్రారంభం కానున్న నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం సామర్థ్యం తొలి దశలో రెండు కోట్లుంటుందని, దశలవారీగా దాన్ని 9 కోట్లకు చేర్చాలనుకుంటున్నామని ఆయన చెప్పారు.

వడ్డీ రేటు మరింత తగ్గేనా?

రేపే ఆర్‌బీఐ పాలసీ

న్యూఢిల్లీ: దేశంలో కీలక వడ్డీ రేట్లు మరింత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన బుధవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం, శుక్రవారం దీనిపై నిర్ణయం ప్రకటించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమావేశాల్లో ఎంపీసీ కీలక రెపోరేటును పావు శాతం చొప్పున అర శాతం మేర తగ్గించింది. మరోవైపు ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందా..లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి దిగివచ్చింది.

ఎంత తగ్గొచ్చు: ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ఆర్థిక, ద్రవ్య సమీక్షలో ఎంపీసీ రెపో రేటును ప్రస్తుత ఆరు శాతం నుంచి మరో పావు శాతం లేదా అర శాతం కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది ఒకే విడతగా ఉంటుందా, లేక రెండు విడతలుగా ఉంటుందా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

10న ఎఫ్‌ఎస్‌డీసీ భేటీ


న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఆర్థిక స్థిరత్వ, అభివృద్ధి మండలి (ఎఫ్‌ఎస్‌డీసీ) ఈ నెల 10న ముంబైలో సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సహా పలు రెగ్యులేటరీ సంస్థల చీఫ్‌లు ఈ సమావేశానికి హాజరవుతారు. 2024-25 ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.5 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో సీతారామన్ ఉన్నతాధికారులతో ఆర్థిక వ్యవస్థపై సమీక్షించనున్నారు.

7 సీస్ నుంచి కొత్త ఆన్‌లైన్ గేమ్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆన్‌లైన్ గేమింగ్‌లో అగ్రగామి అయిన 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ విశేష జనాదరణ ఉన్న మూడు కొత్త గేమ్‌లను ప్రవేశపెట్టింది. అవి వరల్డ్ క్రికెట్ చాంపియన్ లీగ్, ప్రపంచ గుర్రపు స్వారీ, కేక్ మ్యాచ్:పజిల్ తరహా గేమ్. అలాగే www.onlinerealgames.com సైట్‌ను పునః ప్రారంభించింది. కొత్తగా ప్రవేశపెట్టినవన్నీ దేశీయంగానే అభివృద్ధి చేసిన ఉచిత గేమ్‌లని తెలిపింది. వాటిని ప్లేస్టోర్, యాప్ స్టోర్, ఇండస్ యాప్ స్టోర్ల నుంచి దిగుమతి చేసుకోవచ్చునని తెలియచేసింది. గేమర్లకు అత్యుత్తమమైన మొబైల్ గేమింగ్ అనుభవం అందించడం తమ లక్ష్యమని 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ఎండీ ఎల్ఎం శంకర్ తెలిపారు.

జీఎంఆర్ ఏరోసిటీలో హిల్టన్ హోటళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): న్యూఢిల్లీలోని జీఎంఆర్ ఏరోసిటీలో రెండు అంతర్జాతీయ శ్రేణి హోటళ్ల ఏర్పాటుకు అంతర్జాతీయ ఆతిథ్య రంగ దిగ్గజం హిల్టన్ ముందుకు వచ్చింది. ఇందుకోసం జీఎంఆర్ గ్రూప్ సారథ్యంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌తో (డయల్) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఈ ఒప్పందం కింద వాల్‌డార్ఫ్ అస్టోరియా, హిల్టన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ బ్రాండ్ల కింద జీఎంఆర్ ఏరోసిటీలో హోటళ్లు ప్రారంభించనున్నట్టు పేర్కొంది. ఇందులో అస్టోరియా హోటల్ 150 గదులు, సూట్లు కలిగి ఉంటుంది. హిల్టన్ హోటల్ 350 గదులతో ఏర్పాటవుతుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,170 ▲	90,900 ▲	1,13,000 ▲
విజయవాడ	1,00,000 ▼	94,000 ▲	1,00,350 ▲
విశాఖపట్నం	1,00,080 ▲	90,900 ▲	1,13,000 ▲
రాజమండ్రి	99,160 ▲	90,900 ▲	1,04,100 ▲
ప్రొద్దుటూరు	96,700 ▼	88,960 ▼	1,00,010 ▼
ముంబై	96,750 ▼	88,620 ▼	1,00,980 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	530
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	101	అనంతపురం	107
గోదావరి	114		

మూడు రోజుల తర్వాత లాభాల్లోకి..

260 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: వరుసగా మూడు రోజులు నష్టపోయిన ఈక్విటీ సూచీలు బుధవారం మళ్లీ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతోపాటు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఒకదశలో 350 పాయింట్ల వరకు పెరిగి 81,000 స్థాయిని దాటిన సెన్సెక్స్. చివరికి 260.74 పాయింట్ల లాభంతో 80,998.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77.70 పాయింట్ల వృద్ధితో 24,620.20 వద్దకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 రాణించాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 26 పైసల నష్టంతో రూ.85.87 వద్ద ముగిసింది. ముడిచమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.
- ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ఏబీఎఫ్ఆర్ఎల్) నుంచి ఈ-కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ అనుబంధ విభాగమైన ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ పూర్తిగా వైదొలిగింది. ఏబీఎఫ్ఆర్ఎల్‌లో తనకున్న 6 శాతం వాటాను బ్లాక్ డీల్స్ ద్వారా రూ.583 కోట్లకు విక్రయించింది.

ఐపీఓకు ఏకస్

బెలగావీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ఏకస్ లిమిటెడ్ ఐపీఓకు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,700 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని సమాచారం.

అపోలో మైక్రోసిస్టమ్స్ రూ.416 కోట్ల సమీకరణ

హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రోసిస్టమ్స్ ప్రిఫరెన్షియల్ పద్ధతిన ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా రూ.416 కోట్లు సమీకరించింది. ప్రమోటర్ గ్రూప్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్య కుమార్, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్‌కు వీటిని జారీ చేసినట్లు కంపెనీ తెలిపింది.

2030 నాటికి సెన్సెక్స్ 1,50,000

వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) బీఎస్ఈ సెన్సెక్స్ 1,50,000 పాయింట్లకు చేరుకోవచ్చని ప్రముఖ ఇన్వెస్టర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అంచనా వేశారు. 2035 నాటికి సూచీ 3,00,000 పాయింట్లకు చేరుకోవచ్చని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. బలమైన దేశ ఆర్థిక మూలాలతోపాటు మార్కెట్ స్థితిస్థాపకత ఇందుకు దన్నుగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు. "గత 45 ఏళ్ల చరిత్రను గమనిస్తే, మార్కెట్ 15 శాతం సంచిత వృద్ధితో (సీఏజీఆర్) పెరుగుతూ వచ్చింది. ఈ లెక్కన, ప్రస్తుతం 80,000 స్థాయిలో ఉన్న సెన్సెక్స్ వచ్చే ఐదేళ్లలో 1.5 లక్షల పాయింట్లకు ఎగబాకవచ్చు" అన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు: మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనిసవాసరెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఏదులాపురం మునిసిపాలిటిలోని ఓ ఫంక్షన్‌హాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన కబుర్లు చెపితే ప్రజలు నమ్మరన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వారు కట్టుకున్న ప్యాలెలు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇళ్ల మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఖర్చు పెట్టే రూపాయి పేదవారికి చెందుతుందా లేదా అని ఆలోచించాలనే ఇంగితజ్ఞానం కేసీఆర్‌కు లేదని విమర్శించారు. మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్న ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ మీడియాలో పిట్ట కథలు రాసుకుంటే ఒరిగేది ఏమిలేదన్నారు.

త్వరలో 14 వేల అంగన్‌వాడీ పోస్టుల భర్తీ:సీతక్క



హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పని ఒత్తిడిని తగ్గించడానికి త్వరలో 14 వేల పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకమైన సరకులు సరఫరా చేస్తే ఆ సరఫరాదారులను బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, చిన్నారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమథన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ లబ్ధిదారులకు అందిస్తున్న కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారులకు అందించే ఆహారాన్ని మరింత రుచికరంగా మారుస్తామని, వారంలో ఒకటిరెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూ మారుస్తామని ప్రకటించారు. చిన్నారుల ప్రవేశాలను పెంచడానికి 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరెంటు కోతలుండొద్దు

- ఆటోమేటెడ్ జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలి: దామోదర



హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో వైద్య, విద్యుత్ శాఖల అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్‌ల పనితీరు, వాటి సామర్థ్యంపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా జనరేటర్ సౌకర్యం లేని ఆస్పత్రుల్లో ఆటోమేటెడ్ జనరేటర్‌లను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లను నియమించుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకొని పార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా-2025' పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంత్రి దామోదర ఆ శాఖ డైరెక్టర్ హైమావతితో కలిసి ఆవిష్కరించారు.

స్వచ్ఛ నగరానికి కాంగ్రెస్ తెగులు: కేటీఆర్

స్వచ్ఛనగరం హైదరాబాద్‌కు కాంగ్రెస్ తెగులు తగిలిందని.. వారి పాలనావైఫల్యం తెలంగాణ ప్రగతికి శాపంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అందాల పోటీలతో నగరానికి అందం రాదని, నగరం అందంగా ఉంటేనే రాష్ట్రానికి శోభ వస్తుందన్న విషయాన్ని కాంగ్రెస్ సర్కార్ గుర్తించాలని 'ఎక్స్' వేదికగా ఆయన సూచించారు. హోం శాఖ, పురపాలక, వైద్యం, వ్యవసాయం, విద్య, నీటిపారుదల.. ఇలా అన్ని శాఖలూ విఫలమయ్యాయని, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందని ఆరోపించారు. గురుకులాల్లో విద్యార్థులకే కాకుండా.. ఆసుపత్రుల్లోని మానసిక రోగులకూ కలుషిత ఆహారం అందిస్తూ.. వారి ప్రాణాలను హరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు.

బీ ట్యాక్స్ 20 శాతానికి పెరిగింది: ఏలేటి

రాష్ట్రంలో 10 శాతం ఉన్న బీ ట్యాక్స్ 20 శాతానికి పెరిగిందని, అది చెల్లించకపోతే బిల్లులు ఇవ్వడం లేదని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పరిస్థితి దయనీయంగా ఉందంటూ కాంట్రాక్టర్లు తమతో మొర పెట్టుకుంటున్నారని చెప్పారు. కాలేజీలు మూతపడుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయరా? అని ప్రశ్నించారు. తల్లిదండ్రులు బంగారం తాకట్టు పెట్టి పిల్లల ఫీజులు కడుతున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7500 కోట్లు దాటాయన్నారు. దీంతో కాలేజీలు సహకరించక డిగ్రీ, పీజీ వార్షిక పరీక్షలు ఆలస్యంగా జరిగాయని తెలిపారు. విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై క్యాబినెట్‌లో చర్చించి, ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాగులో యువతి మృతదేహం!

- పూర్తిగా కుళ్లిన స్థితిలో.. 10రోజుల క్రితం హత్య?
- కట్టుబొట్టు ఆధారంగా ఉత్తరాది యువతి అని అనుమానం
- బాచుపల్లిలో ఘటన.. సీసీపుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంపేట/హైదరాబాద్ సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆ హతురాలు ఎవరు? హంతకులెవరు? ఆమెను ఎందుకు చంపారు? బాచుపల్లి విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీలో ఓ బ్యాగులో కుక్కిఉన్న స్థితిలో లభ్యమైన గుర్తుతెలియని యువతి మృతదేహం విషయంలో ఇవే అనుమానాలు కలుగుతున్నాయి. బ్యాగులోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారొచ్చి దాన్ని తెరిచిచూస్తే 25-30 ఏళ్ల వయసున్న యువతి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. సీఐ ఉపేందర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హతురాలి ఒంటి మీద మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్, చున్నీ ఉన్నాయి. చేతికి మట్టిగాజులున్నాయి. ఆమె మెడకు నవారు వైరు చుట్టి ఉంది. ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా కట్టుబొట్టు ఆధారంగా హతురాలిని ఉత్తరాది యువతిగా భావిస్తున్నారు. బొల్లారం పరిధిలో భారీ సంఖ్యలో ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచీ ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఇక్కడికి వస్తుంటాయి. ఈ క్రమంలో దుండగులు, యువతిని చంపి.. బ్యాగులో కుక్కి.. వాహనంలో తెచ్చి ఇక్కడ పడేసి ఉంటారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యాచారం చేసి.. చంపి ఉంటారని భావిస్తున్నారు. పదిరోజుల క్రితం హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈమేరకు ఆ సమీప ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఆలయ గోశాలలు జాగ్రత్త!

జీవాల ఆరోగ్యాన్ని పర్యవేక్షించండి

- ఈవోలకు దేవాదాయ శాఖ ఆదేశం
- రాష్ట్రంలో 69 ఆలయాల్లో గోశాలలు
- 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహణ

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో కోడెల మూగరోదన నేపథ్యంలో.. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో నిర్వహిస్తున్న గోశాలలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఆలయాల్లో ఉన్న గోశాలల నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయాల ఈవోలను ఆదేశించారు. జీవాల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతోపాటు అవసరమైన చికిత్స అందించాలని నిర్దేశించారు. గోగ్రాసం విషయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జీవాలు ఎక్కడైనా అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యుల్ని సంప్రదించాల్సిందిగా ఈవోలకు ఆదేశాలు జారీ చేశామని దేవాదాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని 69 ఆలయాల్లో గోశాలలు నిర్వహిస్తున్నారు. అన్ని ఆలయాల్లో కలిపి సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో గోశాలలు కొనసాగుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆలయ గోశాలల్లో మొత్తం 3,009 జీవాలు ఉండగా.. వాటిలో 1089 ఆవులు, 1526 కోడెలు, 394 దూడలు ఉన్నాయి. మొత్తం జీవాల్లో సగానికి పైగా వేములవాడ రాజన్న ఆలయంలోనే ఉండడం గమనార్హం. ఈ గోశాలలో 1230 కోడెలు, 44 ఆవులు, 8 దూడలు ఉన్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి పరిధిలోని ఆలయాల్లో 25 గోశాలలు నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో కాకుండా ప్రైవేటు ట్రస్టులు నిర్వహిస్తున్న గోశాలల్లో 23,468 ఆవులు, కోడెలు, దూడలు ఉన్నాయి. కాగా, ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల నిమిత్తం పరిమిత సంఖ్యలో ఆవులు, దూడలను గోశాలలో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్క వేములవాడలోనే వందల సంఖ్యలో ఆవులు, దూడలు ఉంటాయని వాటి నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నప్పటికీ తీవ్ర అనారోగ్యం కారణంగా మృతి చెందుతున్నాయని తెలిపారు. పరిమితికి మించి భక్తులు సమర్పిస్తున్న కోడెల్ని నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయ అవసరాలకు రైతులకు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా, వేములవాడ రాజన్న ఆలయంలో కోడెల మృతి ఘటనపై గురువారం జరగనున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. వేములవాడ గోశాలలో జీవాల రక్షణకు చేపట్టాల్సిన మెరుగైన చర్యలపై చర్చించి దేవాదాయ శాఖకు తగు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికలపై నేడు స్పష్టత!

(మొదటిపేజీ తరువాయి)

ఎజెండాగా ఉండనున్నాయి. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మంత్రిమండలి కీలక చర్చ జరపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే గ్రామపంచాయతీలతోపాటు ఆ తరువాత వరుసగా మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, కొన్ని మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. వీటిలో సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరికే ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. సర్పంచ్‌లు లేకపోవడంతో పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.1,600 కోట్ల వరకు నిలిచిపోయాయి.

బీసీల రిజర్వేషన్ల అంశంపై..

రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించిన ప్రభుత్వం.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, దాని ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. సర్వే వివరాలు వచ్చిన తరువాత స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉపాధి అవకాశాల్లోనూ 42 శాతం ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేసి.. ఈ రెండు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించింది. అయితే ఈ బిల్లులు అమల్లోకి రావాలంటే పార్లమెంటు ఉభయసభలు ఆమోదం తెలపాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్లు 50 శాతం మించకూడదంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. వాటిని అధిగమించాలంటే కేంద్రం పార్లమెంటులో ఆమోదించాల్సి ఉంది. ఆ తరువాత వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. వీటిపై కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో క్యాబినెట్‌లో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. రాజకీయపరంగా ఇస్తామన్న రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు వెళ్దామా? లేదా ఏదైనా ప్రత్యామ్నాయం ఆలోచిద్దామా? అన్న అంశంపై చర్చించనున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపై క్యాబినెట్ భేటీలో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని 215 పంచాయతీలను 38 మునిసిపాలిటీల్లో కలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి సంబంధించి ఉత్తర్వులు త్వరలో విడుదల చేయనున్న నేపథ్యంలో వాటిపైనా చర్చించనున్నారు. ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిలో పలు కీలక



సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు

సవరణలకు అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్ కోసం చేసుకునే స్లాట్ బుకింగ్‌లకు వసూలు చేసే ఫీజుల అంశం ఉండొచ్చని తెలిసింది. ఉదాహరణకు.. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న భూముల రిజిస్ట్రేషన్ ధరలు, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ లాంటి జిల్లాల్లోని మారుమూల పట్టణాలు, గ్రామాలతోపాటు ఆదివాసీ, గిరిజనులు ఉండే ప్రాంతాల్లోని భూముల ధరలు, వాటి రిజిస్ట్రేషన్ ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. కానీ, ప్రస్తుత భూ భారతిలో అన్ని ప్రాంతాల్లోని భూముల రిజిస్ట్రేషన్ కోసం చేసుకునే స్లాట్ బుకింగ్ ఫీజులను ఒకేలా వసూలు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో ఒకే ఫీజు కాకుండా భూముల ధరలు, వాటి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం.. స్లాట్ బుకింగ్ ఫీజు వసూలు చేసే విధంగా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. మరోవైపు సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశంపైనా మంత్రిమండలిలో చర్చించనున్నారు. అయితే సాదాబైనామాల క్రమబద్ధీకరణ వ్యవహారంపై కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దానిపైనా ప్రభుత్వం చర్చించనుంది.

ప్యాకేజీలుగా హ్యామ్ రోడ్లు..

రాష్ట్రంలో 30 వేల కిలోమీటర్ల రోడ్లను హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్అండ్‌బీ పరిధిలో 13 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17 వేల కిలోమీటర్లను గుర్తించింది. ఈ రోడ్లను వచ్చే ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేయాలని, 15 ఏళ్ల నిర్వహణకు కాంట్రాక్టు ఇవ్వాలని భావించింది. ప్రస్తుతం ఆర్అండ్‌బీ పరిధిలో మొదటి దశలో 5,190 కిలోమీటర్ల రోడ్లను హ్యామ్ కింద అభివృద్ధి చేయాలని గుర్తించారు. పంచాయతీరాజ్‌లోనూ కొంతమేర గుర్తించారు. అయితే వీటిని ప్యాకేజీలుగా మార్చాలని, వాటి ప్రకారమే పనులు నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. మొదటి దశలో అభివృద్ధి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించిన మొత్తం కిలోమీటర్లను 40-50 ప్యాకేజీలుగా విభజించాలని ఇప్పటికే సూచించినట్టు సమాచారం. అయితే ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పైనా చర్చించనున్నారు. పల్లెల్లో నిర్మించే ఇండ్లలో అటాచ్డ్ బాత్రూమ్ ఏర్పాటు విషయంలో లబ్ధిదారులు కొంత అయిష్టత వ్యక్తం చేస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో తమ దృష్టికి వచ్చిందని పలువురు మంత్రులు చెబుతున్నారు. ఈ క్రమంలో అటాచ్డ్ బాత్రూమ్‌ను ఇంటిలోనే ఏర్పాటు చేసుకోకపోయినా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలనే అంశంపైనా సమావేశంలో చర్చించనున్నారు. వీటితో పాటు ఇటీవల మంత్రులు జిల్లాల వారీగా పలు అంశాలపై సమీక్ష నిర్వహించి రూపొందించిన నివేదికలపైనా క్యాబినెట్‌లో చర్చించి, ప్రధానమైన అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

కాళేశ్వరంపై విజిలెన్స్ కమిషన్ సిఫారసులపైనా..

కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్ కమిషన్ సిఫారసులు, ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనుంది. ఎజెండాలో ఈ అంశాన్ని కూడా చేర్చారు. 17 మంది అధికారులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్, 33 మందిపై శాఖాపరమైన చర్యలు, ఏడుగురిపై సవరణ పెన్షన్ నిబంధనల ప్రకారం పెనాల్టీలు విధించాలని విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ ప్రభుత్వానికి సిఫారసుచేయడం తెలిసిందే.ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం బ్యారేజీల్లో పరీక్షలు చేసే బాధ్యతను కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్)నకు ప్రభుత్వం కట్టబెట్టింది. అంతేకాకుండా బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రణాళికలు అందించాలని నిర్మాణ సంస్థలను కోరింది. దీనిపై ఎల్ అండ్ టీ ధిక్కార స్వరం వినిపించగా.. మిగిలిన సంస్థలు పునరుద్ధరణకు ముందుకువచ్చాయి. మేడిగడ్డలోని ఏడో బ్లాకు నిర్మాణం/పునరుద్ధరణకు అయ్యే ఖర్చునంతా ఎల్ అండ్ టీనుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. అంతేకాక ఈ సంస్థను క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని సూచించింది. దాంతో విజిలెన్స్ నివేదిక ప్రకారం ముందుకు వెళ్లాలా? లేక ప్రస్తుతం విచారణ జరుగుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రకారం చర్యలకు ఉపక్రమించాలా అనే దానిపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అంతే కాకుండా పలు ప్రాజెక్టుల సవరణ అంచనాలపైనా చర్చ జరిగే అవకాశాలున్నాయి.

ఆవేదనను పరిష్కరిస్తాం.. ఆడబిడ్డను గౌరవిస్తాం

స్వాట్‌బృందాల ఏర్పాటుపై సీఎం ప్రశంసలు

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళా నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు.. కొత్తగా మహిళా పోలీసులతోనే స్వాట్ బృందాలను ఏర్పాటు చేయడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా బుధవారం ప్రశంసించారు. 'స్వాట్ ఏర్పాటు అనేది ప్రజాస్వామ్య స్ఫూర్తిలో సరికొత్త ఆలోచన.. నిరసనను పరిగణిస్తాం.. నినాదాన్ని అలరిస్తాం.. ఆవేదనను పరిష్కరిస్తాం.. ఆడబిడ్డను గౌరవిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, నిరసన తెలుపుతున్న మహిళల గౌరవానికి భంగం కలగకుండా వారిని అదుపులోకి తీసుకునేందుకు.. 35 మంది మహిళా పోలీసులకు 45 రోజుల శిక్షణను ఇచ్చి స్వాట్ టీమ్స్‌ను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఇటీవలే ప్రారంభించారు.

8,9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- 1.50 లక్షల చేప పిల్లలు సిద్ధం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం

హైదరాబాద్/ గోషామహల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ఈ నెల 8,9 తేదీల్లో చేపమందు ప్రసాదం పంపిణీకి 5 రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని కుటుంబ సభ్యులు, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్తంగా వసతులు కల్పిస్తున్నారు. రోగుల కోసం మొత్తం 32 క్యూ లైన్లు ఏర్పాటు చేయగా, వృద్ధులు, మహిళలు, వికలాంగులు, అంధుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు సిద్ధం చేస్తున్నారు. ఇక ఉబ్బసం రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం తాత్కాలిక విశ్రాంతి షెడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. చేప మందు కోసం 2 తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హరియాణ, ఢిల్లీ రాష్ట్రాల నుంచి రోగులు రానున్నారు. ఇప్పటికే వచ్చిన రోగులు, వారి సహాయకులు తాత్కాలిక షెడ్లలో సేద తీరుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. చేప ప్రసాదం పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. మరోవైపు, చేప మందు పంపిణీకి 1.50 లక్షల చేపపిల్లలను రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ అందుబాటులో ఉంచింది. ఎవరికి ఆరోగ్య సమస్య తలెత్తినా మెరుగైన చికిత్స కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రోగుల వాహనాల పార్కింగ్‌కు 10 చోట్ల స్థలాలు కేటాయించారు. చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకూ వేల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం/ రాత్రి భోజన వసతి కోసం ప్రత్యేక స్టాళ్లను పలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేశాయి.

క్యాబినెట్‌లో మా సమస్యలపై చర్చించండి

- మంత్రి పొన్నంకు ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి

మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది. యూనియన్లపై ఆంక్షల ఎత్తివేత, ఆర్టీసీ ఉద్యోగుల్ని ప్రభుత్వంలో విలీనం చేయడం, విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడం, వెల్ఫేర్ కమిటీల రద్దు తదితర అంశాలపై క్యాబినెట్ భేటీలో చర్చించాలని కోరారు.

3 డీఏలు.. వెంటనే ఇవ్వండి

మిగతా రెండు డీఏలను పీఆర్సీలో కలపండి.. పీఆర్సీ ఫిట్‌మెంట్ 51 శాతం ఇవ్వండి

- 57 అంశాలను పరిష్కరించండి
- మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగ జేఏసీ విజ్ఞప్తి



ఉద్యోగ సంఘాల జేఏసీ భేటీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రులు పొన్నం, దుద్దిళ్ల

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, సప్లిమెంటరీ బిల్లులన్నీ ఒకే దఫాలో చెల్లించాలని ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘాన్ని కోరింది. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో వెంటనే మూడు డీఏలు విడుదల చేయాలని, మిగతా రెండింటిని పీఆర్సీలో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఉద్యోగుల హెల్త్‌కార్డులు, సాధారణ బదిలీలు సహా తాము కోరుతున్న 57 అంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. పదవీ విరమణ వయసు పెంచే ప్రతిపాదన ఏదైనా ఉంటే విరమించుకోవాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం బుధవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో భేటీ అయింది. ఇందులో ఉప సంఘం సభ్యులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, అధికారుల త్రిసభ్య కమిటీ సభ్యులు నవీన్ మిట్టల్, లోకేశ్ కుమార్, కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, పీఆర్టీయూ నేత దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు.

ఏదైనా తీపి కబురు చెబుతారా?

సమావేశం ప్రారంభం కాగానే.. 'ఏదైనా తీపి కబురు చెబుతారా?' అని జేఏసీ ప్రతినిధులు మంత్రివర్గ ఉప సంఘాన్ని అడిగారు. డిమాండ్ల పరిష్కారం కోసం ముందుకొచ్చి, సమావేశం ఏర్పాటు చేయడమే తీపి కబురని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి, నివేదికను సిద్ధం చేశామని, ఉద్యోగుల డిమాండ్లను మంత్రివర్గ ఉప సంఘానికి వివరించామని తెలిపారు. అనంతరం మారం జగదీశ్, ఏలూరి శ్రీనివాసరావు, దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదటి పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను అమలు చేశారే తప్ప, రెండో పీఆర్సీ మాటే ఎత్తడం లేదని చెప్పారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ నేతృత్వంలోని వేతన సవరణ సంఘానికి తాము పలు రకాల విజ్ఞప్తులు చేశామని వివరించారు. ముఖ్యంగా 51 శాతం ఫిట్‌మెంట్‌ను ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేస్తోందని, దీనిపై క్యాబినెట్ భేటీలో చర్చించి, ఆమోదించాలని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి రూ.13 వేలకోట్ల మేర సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల పిల్లల పెళ్లిళ్లు, గృహ నిర్మాణ బిల్లులను ఆపడం వల్ల వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. గతంలో నెలకు రూ.500 కోట్ల చొప్పున క్లియర్ చేస్తామని చెప్పారని, అది సరిగా అమలు కావడం లేదని.. సప్లిమెంటరీ బిల్లులన్నీ ఒకే దఫాలో క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డుల సమస్య ఇప్పటికీ పరిష్కారం కావడం లేదని.. ఆరోగ్య పథకం కార్పస్ ఫండ్‌కు కాంట్రిబ్యూషన్ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదని పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని కోరారు. సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఏడాది పాటు పెంచుతామన్న వార్తలు వస్తున్నాయని.. దీనివల్ల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతులు పొందాల్సినవారు నష్టపోతారని వివరించారు. ఇలాంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఒకవేళ పదవీ విరమణ వయసు పెంచితే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

నేటి క్యాబినెట్ సమావేశంలో నివేదిక ఇస్తాం: భట్టి విక్రమార్క

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలతో నివేదికను గురువారం జరిగే రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో నివేదిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ఉద్యోగ సంఘాల జేఏసీతో భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘాన్ని, అధికారుల కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని మంత్రుల కమిటీకి సూచించారని చెప్పారు. కొన్నేళ్లుగా ఉద్యోగులు, ఇతర వర్గాల బిల్లులు పేరుకుపోవడంతో ఒకేసారి క్లియర్ చేయలేకపోయామని భట్టి వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వంటివన్నీ సమన్వయం చేసుకుంటూనే, ఉద్యోగ వ్యవస్థకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వివరించారు. ఒకవైపు ప్రజలకు, మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమయ్యామని చెప్పారు. అధికారుల కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదికను రూపొందించి.. గురువారం క్యాబినెట్ సమావేశంలో సమర్పించి, సమస్యలకు పరిష్కారం కనుగొంటామని తెలిపారు.

తెలంగాణ ఎఫ్ఎస్ఎల్ నివేదికలు ఇకపై న్యాయస్థానాల్లో సాక్ష్యాలు

- ఐటీ చట్టం కింద అధికారాన్ని దఖలు పర్చిన కేంద్రం

హైదరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ(ఎఫ్ఎస్ఎల్)కి మరో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. డిజిటల్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను పరిశీలించడానికి, విశ్లేషించడానికి, ధ్రువీకరించడానికి కావాల్సిన చట్టపరమైన అధికారాన్ని ఐటీ చట్టం-2000 సెక్షన్ 79ఏ క్రింద ఎఫ్ఎస్ఎల్‌కు దఖలు పరుస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ నోటిఫై చేసింది. ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ షికాగోయల్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఎస్ఎల్‌ను 'గవర్నమెంట్ ఎగ్జామినర్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్'గా కేంద్రం గుర్తించిందని ఆమె వివరించారు. డిజిటల్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్ ఇచ్చే నివేదికలను ఇక నుంచి దేశవ్యాప్తంగా కోర్టులు ఆమోదయోగ్యమైనవిగా గుర్తిస్తాయన్నారు. తెలంగాణ ఎఫ్ఎస్ఎల్‌లోని డిజిటల్ ఫోరెన్సిక్ విభాగం దేశంలోని అత్యంత అధునాతనమైన వాటిల్లో ఒకటని షికా గోయల్ వివరించారు.

బెజుగామలో జైన తీర్థంకర శిల్పాలు

- గుర్తించిన చారిత్రక పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్

గజ్వేల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామలోని రాయరావు చెరువులో వేర్వేరు కాలాలకు చెందిన 24వ జైన తీర్థంకరుడైన వర్థమాన మహావీరుని రెండు శిల్పాలను తెలంగాణ చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించారు. మొదటి శిల్పం రాయచెరువులో ఉందని, ధ్యాన ముద్రలో ఉన్న ఈ మహావీరుని తలపై ఉష్ణీషం చెక్కి ఉందని తెలిపారు. ఈ శిల్పం 8, 9వ శతాబ్దాలకు చెందిన శైలిలో బ్లాక్ కోర్టైట్ రాయి మీద చెక్కి ఉందన్నారు. రెండో విగ్రహం గ్రామంలోని హనుమాన్ ఆలయం పక్కన చెత్తలో కూరుకుపోయి విరిగి కనిపిస్తుందన్నారు. ఈ శిల్పం గుండ్రని ముఖంతో, చిన్న ఉష్ణీషంతో 10, 11వ శాతాబ్దాలకు చెందిన శైలిలో చెక్కారని తెలిపారు. బెజుగామలో 11వ శతాబ్దానికి(1072కు) చెందిన కళ్యాణి చాళుక్య పాలకుడు భువనైకమల్ల దేవర కాలంలో పంప పెర్మానడిగల్ బెజగాం దేవునికి చేసిన దాన శాసనం ఒకటి, అదే కాలానికి చెందిన మరో శాసన శకలం ఉన్నాయన్నారు. ఈ శాసనంలో పేర్కొన్న బెజుగాం దేవుడు జైన తీర్థంకరుడే అయి ఉండొచ్చని తెలిపారు.

సనాతన ధర్మం పాటించే వారిని శిక్షించాలి

- పవన్ మూడు పెళ్లిళ్లపై అందుకే స్పందించా: నారాయణ

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లపై తాను గతంలో మాట్లాడలేదని, ఆయన సనాతన ధర్మాన్ని నెత్తికెక్కించుకున్న తర్వాత తాను ఆ వ్యాఖ్యలు చేసిన మాట వాస్తవమన్నారు. పవన్ కల్యాణ్‌తోపాటు అరాచకమైన, క్రూరమైన సనాతన ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరిని శిక్షించాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సనాతన ధర్మంలో విడాకులే లేనప్పుడు.. పవన్ కల్యాణ్ తన భార్యలకు ఎలా విడాకులిచ్చారని ప్రశ్నించారు. లౌకికతత్వాన్ని నాశనం చేసే సనాతన ధర్మాన్ని పాటించే వారికి శిక్షించాలే తప్ప.. విమర్శించే వారిని కాదని నారాయణ పేర్కొన్నారు. సనాతన ధర్మం గురించి అడిగితే వాచస్పతి గరికపాటి నరసింహారావు ఏం చెబుతారో వినాలని ఉందన్నారు.

20లోగా నియోజకవర్గాల నివేదికలు ఇవ్వాలి

- కో-ఆర్డినేటర్లు, పరిశీలకుల సమీక్షలో మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీలోగా మిగిలిన శాసనసభ నియోజకవర్గ సమావేశాలు కూడా పూర్తి చేసి పార్టీ పరిస్థితిపై సమగ్ర నివేదికలు అందించాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ పరిశీలకులను ఆదేశించారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గంలో నేతల మధ్య సమన్వయం కుదుర్చడానికి చొరవ తీసుకోవాలని సూచించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన జై భీమ్.. జై బాపూ.. జై సంవిధాన్, ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర కమిటీ కోఆర్డినేటర్లు, పీసీసీ నియోజకవర్గ పరిశీలకులతో జరిగిన సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. ప్రజలకు, పార్టీకి, ప్రభుత్వానికి మరింత సమన్వయం పెంచడానికి నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. జై భీమ్.. జై బాపూ.. జై సంవిధాన్ యాత్రకు సంబంధించి నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి నివేదికలతో పాటు కోఆర్డినేటర్లు, పరిశీలకుల నుంచి ఆయా శాసనసభ నియోజకవర్గాల వారీగా పార్టీ వాస్తవ పరిస్థితిపై అందిన నివేదికలను మీనాక్షి సమీక్షించారు. గద్వాల, చేవెళ్ల ప్రాంతాల్లో ఎమ్మెల్యే-నియోజకవర్గ నేతల మధ్య సమన్వయ లోపంపై ఆయా నాయకులతో మాట్లాడారు. ఇక నుంచి ఎంపీటీసీ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించేందుకు పార్టీ తరఫున నిర్వహించాల్సిన కార్యక్రమాపై దృష్టి కేంద్రీకరించాలని ఆమె సూచించారు

పోలీసుల అదుపులో డ్రగ్స్ స్మగ్లర్ గుణశేఖర్!

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాకు ప్రాతినిధ్యం వహించిన తిరుపతి టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం కూకట్‌పల్లి ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఐదుగురిని పట్టుకున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో డ్రగ్స్ సప్లై చేస్తున్న గుణశేఖర్ తప్పించుకున్నాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఏపీ, తెలంగాణ పోలీసులు గుణశేఖర్‌ను తిరుపతిలో అదుపులోకి తీసుకున్నారు. గురువారం హైదరాబాద్ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించే అవకాశముంది.

మద్యం ముడుపులతో ఓట్ల కొనుగోలు!

వైసీపీ ఎంపీ అభ్యర్థులకు లిక్కర్ కమీషన్ సొమ్ములు.. 'సిట్' దర్యాప్తులో వెలుగులోకి..

- ఇద్దరికి ముడుపులందినట్లు ఆధారాలు
- హైదరాబాద్ నుంచి సూర్యాపేట.. అక్కడి నుంచి నియోజకవర్గాలకు
- తెచ్చింది.. కసిరెడ్డి డ్రైవర్, సహాయకుడు
- తీసుకున్నది ఒక ఎంపీ అభ్యర్థి గన్‌మ్యాన్, మరో అభ్యర్థి డ్రైవర్
- ఈసీకి పట్టుబడ్డ 8కోట్లు ఈ ఖాతాలోవే
- వివరాలు రాబట్టిన 'సిట్'
- ఆ నేతలనూ విచారణకు పిలిచే చాన్స్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముడుపులు రాబట్టాలి... మళ్లీ గెలవాలి! లిక్కర్ కిక్కులో వచ్చిన సొమ్ములను ఎన్నికల ఖర్చులకు వాడాలి!... మద్యం స్కామ్‌పై ఇప్పటిదాకా నెలకొన్న బలమైన అనుమానాలివి! ఇది అక్షరాలా నిజమని నిరూపించే తిరుగులేని ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సేకరించింది. ఎన్నికల ముందు ఇద్దరు వైసీపీ ఎంపీ అభ్యర్థులకు హైదరాబాద్ నుంచి ముడుపుల మూటలు చేరవేసినట్లు తేల్చింది. ఆ ఇద్దరు... అంతకుముందు ఎమ్మెల్యేగా ఉండి 2024 ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వారొకరు... సిట్టింగ్ ఎంపీగా ఉండి, మరోసారి ఎంపీగా బరిలో నిలిచిన వారొకరు! వీరిద్దరికీ డబ్బులు చేరిన 'దారుల'ను సిట్ గుర్తించింది. హైదరాబాద్ నుంచి డబ్బుల సంచులు తీసుకొచ్చిన వారిలో కొందరిని 'సిట్' అధికారులు ప్రశ్నించి కీలక సమాచారాన్ని రాబట్టారు. ఒక ఎంపీ అభ్యర్థి తరఫున ఆయన గన్‌మ్యాన్, మరో అభ్యర్థి కోసం ఆయన డ్రైవర్ 'ఫండ్' అందుకున్నట్లు నిర్ధారించుకున్నారు. అప్పటికే ఎంపీగా ఉన్న ఒక అభ్యర్థి స్వయంగా వాహనంలో వెళ్లి ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ డబ్బులు ఇచ్చింది మరెవరో కాదు! లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి డ్రైవర్, వ్యక్తిగత సహాయకుడే! ఇందులో గన్‌మ్యాన్ పేరు... గిరి. ఆయనది శ్రీకాకుళం జిల్లా. ఆయనతోపాటు మరో ఎంపీ అభ్యర్థి డ్రైవర్, రాజ్ కసిరెడ్డి డ్రైవర్ శ్రీకాంత్, సహాయకుడు రజనీకాంత్‌ను కూడా 'సిట్' అధికారులు ప్రశ్నించారు. తాము తరచూ హైదరాబాద్ నుంచి సూర్యాపేట వరకూ అట్టపెట్టెలు, సంచుల్లో డబ్బు తీసుకొచ్చి... 'ఇవ్వాల్సిన వాళ్లకు ఇచ్చి' వెనక్కి వెళ్లిపోయినట్లు అంగీకరించినట్లు తెలిసింది. డబ్బులు పుచ్చుకున్న గన్‌మ్యాన్ గిరి, మరో అభ్యర్థి డ్రైవర్‌తోపాటు... రాజ్ కసిరెడ్డి డ్రైవర్‌ను సిట్ అధికారులు ఇటీవల ప్రశ్నించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "నన్ను వాహనానికి రక్షణగా మాత్రమే పంపించారు. డబ్బులు తెచ్చిన మాట వాస్తవం. కానీ... ఎంతుందో నాకు తెలియదు" అని గన్‌మ్యాన్ గిరి చెప్పారు. మరో ఎంపీ అభ్యర్థి డ్రైవర్... రాజ్ కసిరెడ్డి డ్రైవర్ నుంచి రూ.3.50 కోట్లు అందినట్లు అంగీకరించారు. తెలంగాణలోని సూర్యాపేటలో ఈ ముడుపులు చేతులు మారినట్లు వెల్లడైంది. కోర్టు అనుమతితో ఆ ఇద్దరు వైసీపీ నేతలను కూడా విచారించే అవకాశం ఉంది.



పథకం ప్రకారం కానిస్టేబుల్ ద్వారా...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిరి అనే ఏఆర్ కానిస్టేబుల్‌ను ఇటీవల సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయన... 2019 వరకు కీలక వైసీపీ ఎమ్మెల్యే వద్ద గన్‌మ్యాన్‌గా పని చేశారు. తాజా ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేను జగన్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. టీడీపీ నుంచి ఆర్థికంగా బలమైన అభ్యర్థి బరిలో ఉండటంతో... హైదరాబాద్ నుంచి పలుమార్లు డబ్బులు తెప్పించారు. ప్రతిసారీ ఎంపీ అభ్యర్థి గన్‌మ్యాన్‌గా ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గిరి ఆ వాహనంలో ఉన్నట్లు తేలింది. వాహనంలో పోలీసులు ఉంటే... ప్రత్యేకంగా తనిఖీలు ఉండవనే ఆలోచనతోనే ఇలా చేశారు. అయినప్పటికీ... అప్పట్లో ఎన్నికల కమిషన్ రూ.8 కోట్లకు పైగా నగదు పట్టుకుంది. ఆ డబ్బులు ఎవరివి? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.? ఎన్నిసార్లు హైదరాబాద్ నుంచి తెచ్చారు? డబ్బులకు రక్షణగా ఎన్నిసార్లు వెళ్లారు? అని ఏఆర్ కానిస్టేబుల్ గిరిని సిట్ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. పలుమార్లు డబ్బులు తీసుకొచ్చినట్లు గన్‌మ్యాన్ అంగీకరించారు. అయితే... ఒక్కో విడతలో ఎంత ఇచ్చారనే విషయం తెలిసేది కాదని చెప్పినట్లు సమాచారం.

మూడున్నర కోట్లు తెచ్చాం..

2019లో ఎంపీగా గెలిచి అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించి, మళ్లీ ఎంపీగా బరిలో నిలిచిన వైసీపీ నేతకూ రాజ్ కసిరెడ్డి సిబ్బంది ద్వారా డబ్బులు అందాయి. ఎన్నికల సమయంలో తన ఖర్చుల కోసం ఒకసారి సూర్యాపేట వరకు వెళ్లి... రూ.3.50 కోట్లు పుచ్చుకున్నట్లు తెలిసింది. ఎంపీ స్టిక్కర్ ఉన్న వాహనంలో సొంత డ్రైవర్‌తో తానే స్వయంగా వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. ఆ డ్రైవర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయన తొలుత నోరు విప్పలేదు. తాను ఏం చెప్పినా ప్రాణాలకు ముప్పు వస్తుందని వాపోయారు. నిజం చెబితే ఎలాంటి ఇబ్బంది ఉండదని, రక్షణ కల్పిస్తామని సిట్ అధికారులు భరోసా ఇవ్వడంతో... ఒక రోజు తాను మూడున్నర కోట్లు తెచ్చానని, పలుమార్లు వెళ్లి డబ్బులు తీసుకున్నప్పటికీ ఎంత అనేది తనకు తెలియదని చెప్పినట్లు సమాచారం.

నువ్వు కాకపోతే ఇంకో బకరా!

(మొదటి పేజీ తరువాయి)

లేదని తేల్చిచెప్పింది. సదరు మహిళ.. అతడు తనను పెళ్లి పేరుతో ఒకసారి లైంగికంగా వాడుకున్నాడంటూ తొలుత సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఒక కేసు పెట్టింది. తర్వాత కొంతకాలానికి.. 4-5సార్లు తనను రేప్ చేశాడని.. పెళ్లి చేసుకోవాలని అడిగితే తనది తక్కువ కులమంటూ దూరం పెట్టాడని ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద మరో కేసు పెట్టింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ అతడు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు అందుకు నిరాకరించింది. దీంతో అతడు సుప్రీంకోర్టుకు వెళ్లాడు. 2021లో సైతం ఆమె ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఇదే తరహా ఫిర్యాదు చేసిన విషయం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించింది. విచారణలో భాగంగా ఆమె అతడితో చేసిన వాట్సాప్ సంభాషణలను, ఇతరత్రా సందేశాలను పరిశీలించిన ధర్మాసనం.. తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించినవారిపై క్రిమినల్ కేసులు పెడతానంటూ బెదిరించే లక్షణం ఆమెకు ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "అవతలి వ్యక్తులు తమంత తామే తనను వదిలేసేలా చికాకుపెడతానన్న విషయాన్ని ఆమే ఒక చాట్‌లో స్వయంగా అంగీకరించింది. తన వ్యక్తిగత లాభం కోసం వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం గురించి కూడా ఆమె మాట్లాడింది. తానొక గ్రీన్‌కార్డ్ హోల్డర్ కోసం చూస్తున్నానన్న విషయం కూడా చెప్పింది. ఒకదశలో.. మరో వ్యక్తిని ట్రాప్ చేయడం తనకు అంత కష్టమేమీ కాదని కూడా చెప్పింది. ఈ చాట్‌లన్నీ ఆమె ప్రవర్తనకు సంబంధించిన చేదు వాస్తవాలకు అద్దం పడుతున్నాయి" అని వ్యాఖ్యానించింది. ఆమె ధోరణిని చూశాక ఆమెతో పెళ్లిని అతడు వద్దనుకోవడంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది. రెండోసారి ఆమె ఫిర్యాదు చేశాక అతడిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రెండో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అతడిపై ఇంకా క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడమంటే.. న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని తేల్చి చెప్పింది. అతడిపై ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన అభియోగాలు అబద్ధాలు, దురుద్దేశంతో కూడినవి, కల్పితాలు, ఆధారరహితమైనవని స్పష్టం చేస్తూ.. ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మ్యాచ్‌ఫిక్సింగ్ జరిగింది

రక్షణ కల్పిస్తే అన్ని అంశాలు బయటపెడతా

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నందకుమార్

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మ్యాచ్‌ఫిక్సింగ్ జరిగిందని ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రధాన నిందితుడైన నందకుమార్ తెలిపారు. విచారణకు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వచ్చినా ఒరిగేదేమి ఉండదని స్పష్టం చేశారు. తనంతట తానే ఫోన్ ట్యాపింగ్ చేయించానని ప్రభాకర్‌రావు అంగీకరిస్తే కేసు ముగిసినట్లేనని వ్యాఖ్యానించారు. ఇక, కేసీఆర్ అంశం ఎక్కడా ప్రస్తావనకు రాదని స్పష్టం చేశారు. నందకుమార్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు చెబితేనే నందకుమార్ ఫోన్ ట్యాపింగ్ చేశామని ఈ కేసులో అరెస్టు అయిన రాధాకిషన్‌రావు ఇప్పటికే నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారని తెలిపారు. తన ఫోన్ ట్యాప్ చేయకపోతే తనకు సంబంధించిన ఆడియోలు మాజీ సీఎం కేసీఆర్‌కు ఎలా దొరికాయని ప్రశ్నించారు. తాను రోహిత్‌రెడ్డితో మాట్లాడింది కాల్ రికార్డింగ్ కావచ్చని, స్వామి సింహయాజీతో మాట్లాడిన కాల్స్ కూడా రికార్డింగేనా? అని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పిస్తే కీలక విషయాలు బయటపెడతానని అన్నారు.

నేడు సిట్ ముందుకు ప్రభాకర్‌రావు!

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు గురువారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కానున్నట్లు తెలిసింది. అమెరికా నుంచి బుధవారం రాత్రి ఆయన హైదరాబాద్ చేరుకోవచ్చని సమాచారం. ఒక వేళ ఆయన రాక ఆలస్యమైతే మరుసటి రోజున న్యాయవాదులతో కలిసి సిట్ విచారణకు హాజరవుతారని తెలుస్తోంది. ఇప్పటి కే ప్రభాకర్‌రావు భార్య హైదరాబాద్ చేరుకున్నట్లు చెబుతున్నారు.

పదోన్నతుల్లో తేడాలెందుకు?

- ఆర్థిక, న్యాయ విభాగాల్లో సత్వరంగా పదోన్నతులు
- సింగిల్ యూనిట్‌లో పదోన్నతికి పదేళ్లు ఆగాల్సిందేనా?
- సచివాలయ విభాగాల్లో సమతుల్యత తీసుకురావాలి
- ప్రభుత్వానికి సచివాలయ అధికారుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని కొన్ని విభాగాల్లో పని చేసే ఉద్యోగులకు చకచకా పదోన్నతులు వస్తుండగా.. సింగిల్ యూనిట్‌లో పని చేస్తున్న వారికి పదోన్నతి రావాలంటే కనీసం 7 నుంచి 10 సంవత్సరాల నిరీక్షణ తప్పడం లేదని సచివాలయ అధికారుల సంఘం వాపోతోంది. ఇదే విషయమై ఇటీవల ఓ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఆ నివేదికలో పేర్కొన్న అంశాల ప్రకారం.. అసిస్టెంట్ సెక్షన్ అధికారు(ఏఎస్‌వో)ల నియామకం అన్ని విభాగాల్లో ఒకే విధంగా జరుగుతున్నప్పటికీ.. న్యాయ, ఆర్థిక విభాగాల్లో పనిచేసే అధికారులకు వచ్చినంత త్వరగా సింగిల్ యూనిట్(జీఏడీ)లో పనిచేసే వారికి పదోన్నతులు రావడం లేదు. ఈ క్రమంలో పనిభారం ఎక్కువగా ఉన్న తమకు పదోన్నతులు రావడం లేదని వారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. 2010 బ్యాచ్ ఏఎస్‌వోలు సింగిల్ యూనిట్‌లో ఇప్పటికీ సెక్షన్ అధికారులుగా కొనసాగుతుండగా.. న్యాయ, ఆర్థిక విభాగాల్లో చేరిన అదే బ్యాచ్‌కు చెందిన వారు డిప్యూటీ, లేదా జాయింట్ సెక్రటరీ క్యాడర్‌లో పని చేస్తున్నారు. ఈ సమతుల్యతను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు.. ఈ అంశంపై దృష్టి పెట్టకుండా ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శి స్థాయి నుంచి మరో పదోన్నతి పొందేలా ప్రత్యేక కార్యదర్శి(నాన్ క్యాడర్) హోదా సృష్టించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. అయితే ఇదే క్రమంలో సింగిల్ యూనిట్‌లో 8, న్యాయ విభాగంలో 1 ప్రత్యేక కార్యదర్శి పోస్టులను ఏర్పాటు చేయాలని అధికారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం సింగిల్ యూనిట్‌లో 16 మంది డిప్యూటీ సెక్రటరీలు, ఏడుగురు జాయింట్ సెక్రటరీలు కలిపి 23 మంది సర్క్యులేటింగ్ అధికారులు ఉన్నారు. సింగిల్ యూనిట్‌ను బలోపేతం చేసేందుకు వీలుగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీలో ఒక అదనపు కమిషనర్ పోస్టును, సెక్రటరీ టు విజిలెన్స్ కమిషనర్, డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో అడ్మిన్‌కు ఒక అదనపు డైరెక్టర్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరింది. ఆరోగ్య శాఖలో ఫుడ్ కమిషన్‌లో ఒక సభ్య కార్యదర్శి పోస్టు, మైనార్టీ కమిషన్‌లో ఒకటి, రాజ్‌భవన్‌లో జాయింట్, డిప్యూటీ, అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం సింగిల్ యూనిట్‌లో 316 సెక్షన్లు ఉండగా వీటిలో 83 మంది అసిస్టెంట్ సెక్రటరీలు, 26 మంది డిప్యూటీ సెక్రటరీలు, 13 మంది జాయింట్ సెక్రటరీలు, 10 మంది అదనపు కార్యదర్శులు ఉన్నారు. దీంతో కీలక శాఖల నిర్వహణతో పని భారం ఎక్కువై సకాలంలో పనులు జరగడం లేదని పేర్కొంది. ప్రతి సర్క్యులేటింగ్ అధికారి 4 నుంచి 5 సెక్షన్లు నిర్వహించాల్సి ఉన్నా.. చాలా మంది వద్ద ఏడుకు పైగా సెక్షన్లు ఉన్నాయి. సింగిల్ యూనిట్(జీఏడీ) పరిధిలో 316 సెక్షన్లకు 83 మంది సహాయ కార్యదర్శులు, 49 మంది సర్క్యులేటింగ్ అధికారులు ఉన్నారు. ఆర్థిక శాఖలో 30 సెక్షన్లు, 19 మంది సహాయ కార్యదర్శులు, 14 మంది సర్క్యులేటింగ్ అధికారులు ఉన్నారు. న్యాయ విభాగంలో 6 సెక్షన్లు, 4 అసిస్టెంట్ సెక్రటరీలు, ఆరుగురు సర్క్యులేటింగ్ అధికారులు ఉన్నారు. దీంతో పదోన్నతుల్లో అసమానతలు తలెత్తుతున్నాయని అధికారుల సంఘం నివేదికలో పేర్కొంది. సహాయ కార్యదర్శి పదోన్నతికి సింగిల్ యూనిట్‌లో 7 సంవత్సరాలు పడుతుందని, న్యాయ, ఆర్థిక విభాగాల్లో మూడేళ్ల వ్యవధిలోనే పదోన్నతులు పొందుతున్నారని తెలిపింది.

ఇథనాల్ కర్మాగారంపై జనాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)


జీపును ధ్వంసం చేస్తున్న ఆందోళనకారులు

స్థానికుల్లో ఆగ్రహం పెల్లుబికింది. మాట తప్పి, మళ్లీ ఇథనాల్ కర్మాగార నిర్మాణాన్ని చేపడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్ని నిలిపివేయాలంటూ అక్కడున్న సిబ్బందిని హెచ్చరించారు. వారి నివాస స్థావరాలకు నిప్పంటించారు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండలం పెద్ద ధన్వాడలో చోటుచేసుకుంది. గ్రామ శివారులో నిర్మిస్తున్న గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్, ఆలివ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ 10 నెలల క్రితం చేపట్టిన ఇథనాల్ కర్మాగార నిర్మాణ పనులను నిలిపివేయాలంటూ సమీప గ్రామాల ప్రజలు గతంలోనే ఆందోళనకు దిగారు. కర్మాగారాన్ని రద్దు చేయాలని వినతి పత్రాలు అందజేశారు. తుంగభద్ర నది సమీపంలో ఈ కర్మాగారాన్ని నిర్మించడం వల్ల తాగునీరు కలుషితమవుతుందని, పంటలు, ప్రజల ఆరోగ్యం నాశనం అవుతాయని తెలిపారు. కర్మాగారం నిర్మాణ స్థలంలో దీక్షలు చేపట్టి, పనులను నిలిపివేశారు. అధికారులు, నాయకులు ఆ ఫ్యాక్టరీని రద్దు చేస్తామని చెప్పి, వారి దీక్షను విరమింపజేశారు. తాజాగా మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సామగ్రి, సిబ్బంది రావడంతో మంగళవారం రహదారిపై ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్ గ్రామాల ప్రజలు దాదాపు 1000 మంది అక్కడికి చేరుకున్నారు. కర్మాగార పనులు చేపట్టిన సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం సిబ్బందిని అక్కడి నుంచి తరిమికొట్టారు. వారి గుడారాలను, కంటైనర్‌ను ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు. అక్కడే ఉన్న యంత్రం, వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. జీపును బోల్తా పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ క్రమంలో పెద్ద ధన్వాడకు చెందిన క్యాసారం కృష్ణ, మరియమ్మకు గాయాలయ్యాయి. వారిని గద్వాల ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం కంపెనీకి చెందిన సామగ్రి, వాహనాలను అక్కడి నుంచి పంపించివేశారు.

మానసిక రోగి మృతికి బాధ్యులెవరు?

ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్‌పాయిజన్ బాధాకరం

వృద్ధ రైతును పోలీసు గెంటేయడం అమానుషం

చివరికి కోడెలకు ఆహారం పెట్టలేని దుస్థితి: హరీశ్

హైదరాబాద్/నర్సాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మానసికవైద్యం పొందేందుకు ఆస్పత్రిలో చేరిన రోగులకు నాణ్యమైన భోజనంపెట్టలేని దిక్కుమాలిన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఒకేసారి 70మంది ఫుడ్ పాయిజన్‌కు గురికావడం, అందులో ఒకరు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఫుడ్‌పాయిజన్ వల్ల మానసిక రోగి మృతికి బాధ్యులెవరు? ఆరోగ్యశాఖకు పట్టింపులేదా? అని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. అలాగే,ఖానాపూర్‌లో తమ సమస్య చెప్పుకొనేందుకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన వృద్ధ రైతుపట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుపై చేయిచేసుకున్న పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. మెదక్ జిల్లా నర్సాపూర్ హరీశ్ మీడియాతో మాట్లాడుతూ వేములవాడ ఆలయ కోడెలకు కనీసం ఆహారం కూడా పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందా? అని మండిపడ్డారు. రోజూ కోడెలు చనిపోతున్నా వాటిని కాపాడుకోలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందంటే పాలన ఏ విధంగా సాగుతుందో అర్థమవుతోందన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తితోనే కాంగ్రెస్ పాలన!

- 'మంత్రులతో ముఖాముఖి' మళ్లీ ప్రారంభం
- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన మంత్రి పొన్నం


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు.. హన్మంతుని గుడి లేని గ్రామం లేదు' అనే నానుడి గత కాంగ్రెస్ హయాంలో ఉండేదని ఇప్పుడు అదే నినాదంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవతో ప్రారంభమైన ముఖాముఖి కార్యక్రమం కొన్ని వారాలుగా నిలిచిపోయింది. పార్టీ కార్యకర్తలు, నాయకుల ఒత్తిడితో బుధవారం మంత్రి పొన్నం పునరుద్ధరించారు. కార్యక్రమాన్ని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మిగిలిపోయిన 7,404 గ్రామ పరిపాలన అధికారి(జీపీఓ) ఉద్యోగాలను జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ చేయాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కాగా, బీఆర్ఎస్‌లో గొడవలు కేవలం ఉనికి కోసం ఆ పార్టీ ఆడుతున్న డ్రామాలని పొన్నం విమర్శించారు. రాజకీయంగా ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందన్నారు. రాజకీయ ఉనికి కోసమే కవిత పోరాటం ప్రారంభించిందని, వారి కుటుంబ పంచాయతీ కాంగ్రెస్‌కు అవసరం లేదన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.